



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 | సంచిక : 335 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | గురువారం 21 ఆగస్టు 2025 | పేజీలు : 12 | వెల : 2/-




## ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధాస్త్రం

- 'ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు-2025'కు లోక్‌సభ ఆమోదం
- ఆన్‌లైన్ మనీ గేమ్‌లు నిర్వహించినా, ప్రచారం చేసినా జైలుశిక్ష, భారీ జరిమానా
- నగదు బదిలీలకు వీలు కల్పించినా నేరమే
- ఇలాంటి గేమ్‌లతో యువత భవిష్యత్తు దెబ్బతింటోందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్
- ఆందోళన డబ్బు ప్రమేయం లేని ఈ-స్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషల్ గేమింగ్‌కు ప్రోత్సాహం

5

# ఇంటికో పారిశ్రామికవేత్త

- స్టార్టప్ లకు ఊపిరి పోసేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్
- అమరావతితో పాటు ఐదు చోట్ల ఆర్టీఐహెచ్ కేంద్రాలు
- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- 24 గంటల్లో రికార్డు స్థాయిలో 1,67,321 రిజిస్ట్రేషన్లకు గిన్నిస్ వరల్డ్ రికార్డు
- టెక్నాలజీ వల్ల ఉద్యోగాలు పోతాయన్న అంశాన్ని నేను విశ్వసించను
- ఏపీ పారిశ్రామికవేత్తలు గ్లోబల్ కమ్యూనిటీకి సేవలందించేలా ఎదగాలని కోరుకుంటున్నా




**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

'ప్రతి కుటుంబం నుంచి ఓ పారిశ్రామిక వేత్త రావాలనేదే నా నినాదం. ఈ లక్ష్యంతో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లు పనిచేస్తాయి అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలకు కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. యువ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, స్టార్టప్ లకు ఊతమిచ్చేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పనిచేస్తుందని స్పష్టం చేశారు. అమరావతితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఐదు చోట్ల ఇన్నోవేషన్ కేంద్రాలను హబ్ అండ్ స్పోక్ మోడల్ లో ఏర్పాటు చేసినట్టు వివరించారు. బుధవారం మంగళగిరిలోని మయూరి టెక్ పార్కులో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ తో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ..'రతన్ టాటా ఆలోచనలను సజీవంగా ఉంచాలని ఇన్నోవేషన్ హబ్ ప్రారంభిస్తున్నాం. రతన్ టాటా నిరాడంబరత, దేశానికి చేసిన సేవ అందరికీ ఆదర్శం. - మిగతా2లో



## నింద మాటున ప్రభుత్వాలు కూల్చేస్తారా?

- న్యాయస్థానాల్లో విచారణ జరగకుండానే, నేర నిరూపణ కాకుండానే పడగొడతారా?
- ప్రధాని, ముఖ్యమంత్రి, మంత్రుల తొలగింపు బిల్లులపై విపక్షాల ముప్పేట దాడి
- బిల్లు ప్రతులను చింపేసి అమిత్ షా పైకి విసిరేసిన విపక్ష సభ్యులు
- నేరారోపణలు ఎదుర్కొంటూ ఏకధాటిగా 30 రోజులు కస్టడీలో ఉంటే పదవుల నుంచి తొలగించే మూడు బిల్లుల రూపకల్పన
- బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్రం.. వెంటనే తీవ్ర ఆందోళనకు దిగిన విపక్ష పార్టీలు
- విపక్షపాలిత ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకే ఈ బిల్లులు తెచ్చారని మండిపాటు.. అధికార పార్టీ ఎంపీలతో వాగ్వాదం
- తీవ్ర గందరగోళం నడుమ బిల్లులను సంయుక్త పార్లమెంటరీ కమిటీకి సిఫార్సు చేసిన మోదీ సర్కార్

2



## స్త్రీ శక్తితో మహిళలకు ఆర్థిక వెసులుబాటు

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత శాఖల మంత్రి
- ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతో మహిళల్లో ఆనందం
- సీఎంకు మహిళా లోకం జేజేలు
- విజయవాడ బస్టేషన్ నుంచి ఉండవల్లి వరకు బస్సులో మంత్రి సవిత ప్రయాణం
- మహిళా ప్రయాణికులతో మంత్రి సవిత మాటామంతి

వివరాలు 2లో..

## రాష్ట్ర వ్యాప్తంగా గృహ నిర్మాణ శాఖ సర్వే




- మంత్రులు పార్థసారథి, నారాయణ
- "ఎంత మందికి ఇళ్లు కావాలనేదానిపై 15 రోజుల్లో సర్వే చేస్తాం
- ఎన్టీఆర్ హౌసింగ్ కింద గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బిల్లులు ఇవ్వాలని సీఎం ఆదేశించారు
- హౌసింగ్, టిడ్కో కలిపి 2లక్షల ఇళ్లు సంక్రాంతికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం
- పీఎంఏవై కింద మిగిలిన 5లక్షల ఇళ్లను రెండో ఏడాది పూర్తి చేసేలా చర్యలు చేపడతాం

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

గృహ నిర్మాణశాఖ రాష్ట్ర వ్యాప్తంగా సర్వే చేసిందని, ఆరు లక్షల మందికి గృహ అవసరాలున్నట్టు గుర్తించామని మంత్రి పార్థసారథి తెలిపారు. గృహనిర్మాణ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష అనంతరం మంత్రులు పార్థసారథి, నారాయణ మీడియాతో మాట్లాడారు. "ఎంత మందికి ఇళ్లు కావాలనేదానిపై 15 రోజుల్లో సర్వే చేస్తాం. ఎన్టీఆర్ హౌసింగ్ కింద - మిగతా2లో



## రూ. 2కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం.. స్మగ్లర్ అరెస్ట్

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసులు దాదాపు రూ.2 కోట్ల విలువైన రెండున్నర టన్నుల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కపిలతీర్థంలోని ఏపీ టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో ఎస్పీ పి.శ్రీనివాస్ కేసు వివరాలు మీడియాకు వెల్లడించారు. డీఎస్పీ ఎండీ షరీఫ్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయి గిరిధర్, ఆర్ఎస్ఐ కె.లింగాధర్‌కు చెందిన బలగాలు విజయవాడ - చెన్నై రహదారిలోని కావలి ప్రాంతంలో - మిగతా2లో



## ప్రజా ప్రభుత్వాల మనుగడ గవర్నర్ల దయపైనా?

- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- ప్రభుత్వం, గవర్నర్ మధ్య సామరస్యమేది?
- రెండోసారి ఆమోదించే బిల్లు రాష్ట్రపతి పరిశీలనకా?
- గవర్నర్‌కు ఆ అధికారాలు లేవు: సీజేఐ
- లేని అధికారం తలకెత్తుకుంటున్న సుప్రీం

5

## చంద్రబాబు.. విశాఖ ఉక్కుపై కుట్ర తగదు!

రాష్ట్రంలో పరిపాలన పూర్తిగా గాలికి వదిలేశారు

ఏ ఒక్క వర్గం సంతృప్తిగా లేదు..సూపర్ సిక్స్ అరకొరగా మొదలు పెట్టినా క్లారిటీ లేదు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేస్తుంటే సీఎం చంద్రబాబు ఏం చేస్తున్నారని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. చంద్రబాబు పాలనపై బొత్స సత్యనారాయణ బుధవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం లో పరిపాలన పూర్తి గా గాలికి వదిలేశారు. ఏ ఒక్క వర్గం సంతృప్తి గా లేదు. సూపర్ సిక్స్ అరకొరగా మొదలు పెట్టినా క్లారిటీ లేదు. తల్లికి వందనం పథకంలో ఏడు ఎనిమిది లక్షల మందికి కేంద్రం నుండి డబ్బులు రాలేదని అరకొరగా ఇచ్చారు. అన్న దాత సుఖీభవ అర్హులకు ఇవ్వలేదు. సాంకేతిక కారణం చెప్పి ఎగ్గొట్టారు.వితంతు పెన్షన్స్ ఇవ్వకుండా కారణాలు చెప్తున్నారు. అర్హులైన వికలాంగులకు పెన్షన్స్ తీసేశారు. అబద్ధాలపై చర్యలు తీసుకోవాల్సి వస్తే సీఎం, మంత్రులపై చర్యలు తీసుకోవాలి. స్టీల్ ప్లాంటు లో 32 విభాగాలు ప్రైవేట్ పరం చేశారు. వైఎస్సార్సీ పీకి ద్వంద వైఖరి లేదు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనేదే మా నినాదం.స్టీల్ ప్లాంట్ కి 14 వేల కోట్లు ప్యాకేజీ ఇచ్చినప్పుడే మేము అనుమానం వుంది అని చెప్పాం. స్టీల్ ప్లాంట్ అప్పులు తీరాక ప్రైవేట్ చేయాల ని పన్నాగం చేస్తున్నారు.సీఎం ఢిల్లీ వెళ్లినప్పుడు స్టీల్ ప్లాంట్ గురుంచి ఎందుకు మాట్లాడటం లేదు'అని ప్రశ్నించారు.



# ఇంటికో పారిశ్రామికవేత్త

-మొదటిపేజీ తరువాయి

అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను ప్రారంభించటం ఓ చారిత్రాత్మక సమయం. గివ్ బ్యాక్ టు ది సొసైటీ అనే విధానాన్ని రతన్ టాటా అవలంభించారు. రతన్ టాటా ఆలోచనల్ని భవిష్యత్ తరానికి అందించాలన్న లక్ష్యంతోనే ఇన్నోవేషన్ హబ్ లను ప్రారంభించాం. విజయవాడ, విశాఖ, తిరుపతి, అనంతపురంలోనూ దీనికి అనుబంధంగా కేంద్రాలు పనిచేస్తాయి. ఏపీలోని 175 నియోజకవర్గాల్లో ఇన్నోవేషన్ కేంద్రాలు ఉండాలని నిర్ణయించాం. యువతకు ఉన్న వినూత్న ఆలోచనల్ని క్రోడీకరించి ప్రోత్సహించేలా ఈ ఇన్నోవేషన్ హబ్ పని చేస్తుంది. యువపారిశ్రామిక వేత్తలు అవకాశాలను వాడుకోండి. టెక్నాలజీ వల్ల ఉద్యోగాలు పోతాయన్న అంశాన్ని నేను విశ్వసించను. ఏపీ పారిశ్రామికవేత్తలు గ్లోబల్ కమ్యూనిటికీ సేవలందించేలా ఎదగాలని కోరుకుంటున్నా. అగ్రిటెక్ లో ఇన్నోవేషన్ కు విస్తతమైన అవకాశాలు ఉన్నాయి. వ్యవసాయం, విద్య, వైద్యం, రక్షణ, ఇలా అనేక రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయి.‘ అని సీఎం వివరించారు. సరైన ప్రభుత్వ విధానాలు అవలంభిస్తే ఆదాయం, సంపద వస్తుంది. భవిష్యత్ అంతా ఐటీ రంగానిదేనని నాడు గుర్తించాను. దేశంలో ఎవరూ చేయనంతగా ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేశాం. సంపద సష్టి జరగాలంటే ఆర్థిక వద్ధి అవసరం. గత 10 ఏళ్లలో 11వ ఆర్థిక వ్యవస్థ నుంచి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాం. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నాం. అప్పుడు సంపద మరింతగా పెరుగుతుంది. ఈ అవకాశాలను రాష్ట్రం అందిపుచ్చుకోవాలి. దీని కోసం రాష్ట్రాన్ని, అమరావతి సహా వివిధ ప్రాంతాలను సిద్ధం చేస్తున్నాం. ప్రాంతాల వారీగా అభివద్ధి ప్రణాళికలు రచించాం. అమరావతి నగరాన్ని నిర్మించే అవకాశాన్ని దేవుడు నాకిచ్చాడు. క్వాంటం వ్యాలీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఇక విప్లవాత్మక అంశాలుగా మారబోతున్నాయి. నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేసి అంతర్జాతీయ ప్రమాణాలు సాధింటంలో మన పరిశ్రమలు మెరుగైన ఫలితాలు సాధించాలి. ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనలు, ఎకో సిస్టం ఉంటేనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉత్పత్తులు అందించగలం. దీంట్లో భాగంగానే అమరావతి నగరం క్వాంటం కంప్యూటింగ్ హబ్ గా అభివద్ధి చెందుతుంది. క్వాంటం కంప్యూటింగ్ ద్వారా రియల్ టైమ్ డేటాను విశ్లేషించి క్షేత్రస్థాయిలో అమలు చేస్తాం.‘ అని చంద్రబాబు చెప్పారు. ఏపీలో ఇన్నోవేషన్, బిజినెస్ స్టార్టప్ ల కోసం రికార్డు స్థాయిలో 1,67,321 రిజిస్ట్రేషన్లు జరిగాయి. 24 గంటల్లో ఈ స్థాయి రిజిస్ట్రేషన్లు జరగటంపై ఏపీ ఇన్నోవేషన్ సొసైటీకి గిన్నిస్ వరల్డ్ రికార్డు నమోదైంది. గిన్నిస్ వరల్డ్ రికార్డును ఆ సంస్థ ప్రతినిధులు సీఎం చంద్రబాబుకు అందచేశారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవం సందర్భంగా మయూరి టెక్ పార్క్ ప్రాంగణంలో వివిధ స్టార్టప్ కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రదర్శించిన స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. రతన్ టాటా ఇన్నోవేన్ హబ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రులు నారా లోకేష్ , నాదెండ్ల మనోహర్, టీజీ భరత్, భారత్ ఫోర్జ్ చైర్మన్ బాబా కల్యాణి, అమర్ రాజా బ్యాటరీస్ చైర్మన్ గల్లా జయదేవ్ తదితరులు హాజరయ్యారు.

# నింద మాటున ప్రభుత్వాలు కూల్చేస్తారా?

న్యూఢిల్లీ

నేరం రుజువుకాకపోయినా కేవలం నిందారోపణలు ఉన్నాయన్న సాకుతో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన విపక్షపాలిత ప్రభుత్వాలను పడగొడతారా? అంటూ పార్లమెంట్ సాక్షిగా మోదీ ప్రభుత్వంపై విపక్ష పార్టీలు ముప్పేటదాడి చేశాయి. విపక్షపాలిత రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరిచే కుట్రతో ఈ మూడు బిల్లులను రూపొందించారని విపక్ష సభ్యులు లోక్‌సభలో ధ్వజమెత్తారు. బిల్లులను తక్షణం ఉపసంహరించుకోవాలని నినాదాలతో హోరెత్తించారు. అయితే బిల్లులను సమర్థిస్తూ అధికార పార్టీ సభ్యులు సైతం దీటుగా స్పందించడంతో లోక్‌సభలో ఒక్కసారిగా మాటల మంటలు రాజుకున్నాయి. అధికార, విపక్ష సభ్యుల వాగ్వాదం మధ్య వివాదాస్పద మూడు బిల్లులను ప్రభుత్వం సంయుక్త పార్లమెంటరీ కమిటీకి సిఫార్సుచేసింది. తీవ్ర నేరారోపణలు ఎదుర్కొంటూ ఏకధాటిగా 30 రోజులుగా కస్టడీలో గడుపుతున్న ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్రమంత్రులను పదవి నుంచి తొలగించేందుకు ఉద్దేశించిన మూడు బిల్లులను లోక్‌సభలో కేంద్రం ప్రవేశపెట్టింది. వెనువెంటనే విపక్ష పార్టీలపాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూలదోసేందుకే మోదీ సర్కార్ ఇలా అత్యంత వివాదాస్పద మూడు బిల్లులను తీసుకొచ్చిందంటూ బుధవారం లోక్‌సభలో విపక్షపార్టీల ఎంపీలు తీవ్ర ఆందోళనకు దిగారు. ఒకదశలో బిల్లు ప్రతులను చింపేసి ఆ ముక్కలను హోంమంత్రి అమిత్‌షా వైపు విసిరేశారు. ఐదేళ్లు, అంతకంటే ఎక్కువ శిక్ష పడే తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటూ అరెస్టయి, కస్టడీలో ఏకధాటిగా 30 రోజులుగా ఉన్న సందర్భాల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులను పదవి నుంచి తొలగించేందుకు ఉద్దేశిస్తూ ‘గవర్నమెంట్ ఆఫ్ యూనియన్ టెరిటరీస్(సవరణ)బిల్లు, 2025, రాజ్యాంగం(130వ సవరణ)బిల్లు, 2025, జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ(సవరణ)బిల్లు, 2025’బిల్లులను అమిత్‌షా లోక్‌సభలో ప్రవేశపెట్టగానే గొడవ మొదలైంది.

**అమిత్, వేణుగోపాల్ మధ్య మాటల యుద్ధం**

బిల్లు ప్రవేశపెట్టగానే అమిత్‌షానుద్దేశిస్తూ కాంగ్రెస్ సీనియర్ సభ్యుడు కేసీ వేణుగోపాల్ మాటలతో విరుచుకుపడ్డారు. “రాజ్యాంగ మౌలికసూత్రాలను ఈ బిల్లులు ఉల్లంఘిస్తున్నాయి. 2010లో సోహ్రాబుద్దీన్ షేక్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో ఆనాడు రాష్ట్ర హోం మంత్రిగా పదవి వెలగబెడుతూనే అమిత్‌షా అరెస్టయ్యారు. సీబీఐ అరెస్ట్‌తో మూడు నెలలు జైల్లోనే గడిపారు.

మరి ఈ నైతికత ఆనాడు మీకు లేదా?”అని వేణుగోపాల్ సూటి ప్రశ్న వేశారు. దీనికి ఇతర సభ్యులు గొంతు కలిపారు. దీంతో అమిత్‌షా దీటుగా బదులిచ్చారు. “అదొక తప్పుడు కేసు. అయినాసరే అరెస్టయిన వెంటనే పదవికి త్యజించి నా నైతికతను నిరూపించుకున్నా. పదవికి రాజీనామా చేశా. కేసులో నిర్దోషిగా బయటపడేదాకా ఎలాంటి చట్టబద్ధ పదవిని చేపట్టలేదు”అని అన్నారు. మధ్యాహ్నం సభ రెండుగంటలకు మళ్లీ మొదలయ్యాక ఈ మూడు బిల్లులను సంయుక్త పార్లమెంట్ కమిటీకి సిఫార్సుచేస్తూ తీర్మానం చేసి మూజువాణి ఓటుతో ఆమోదించిన సందర్భంలో విపక్షసభ్యులు మళ్లీ లేచి నిలబడి నినాదాలుచేశారు. అప్పటికే ఈ మూడు బిల్లుల ప్రతులను కాంగ్రెస్ ఎంపీలు జ్యోతిమణి, ప్రణీత షిండే తోటి ఎంపీలకు పంచారు.

తమ చేతికొచ్చిన బిల్లుల ప్రతులను తృణమూల్ కాంగ్రెస్ నేత కళ్యాణ్ బెనర్జీసహా పలువురు విపక్షసభ్యులు చింపేసి అమిత్‌షా వైపు విసిరేశారు. కొన్ని షా సీటు వద్ద పడ్డాయి. షా ముందున్న మైక్రోఫోన్‌ను లాగిపడేసేందుకు బెనర్జీ విఫలయత్నంచేశారు. దీంతో షాకు రక్షణగా కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజులు షా సీటు వద్దకు వచ్చి అడ్డుగా నిలబడ్డారు. వెల్‌లోకి దూసుకొచ్చిన టీఎంసీ మహిళానేత మహువా మొయిత్రాసహా విపక్షనేతల నినాదాలతో సభ మార్మోగింది. కొందరు బీజేపీ సభ్యులు సైతం వెల్‌లోకి దూసుకొచ్చి విపక్షసభ్యులతో వాగ్వాదానికి దిగారు. వీరిని బీజేపీ సభ్యుడునిషికాంత్ దూబే వారించి తమతమ సీట్ల వద్దకు పంపించారు. వివాదాస్పద బిల్లులను ప్రవేశపెట్టడాన్ని తీవ్రంగా తప్పుబడుతూ ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ, ఆర్‌ఎస్‌పీ నేత ఎన్‌కే ప్రేమచంద్రన్, కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్, ఎస్పీ నేత ధర్మేంద్ర యాదవ్ మాట్లాడారు.

తర్వాత సభ మూడు గంటలకు మొదలయ్యాక అమిత్ షాకు రక్షణగా పార్లమెంట్ సెక్యూరిటీ సర్వీస్ నుంచి 12 మంది మార్షల్స్ వచ్చి పక్కనే నిలబడ్డారు. అయినాసరే విపక్షసభ్యులు బిల్లుల వ్యతిరేక నినాదాలను కొనసాగించారు. యావత్ ఘటనపై స్పీకర్ తీవ్రవిచారం వ్యక్తంచేశారు. ఇలాంటి ఉదంతాలు సభ గౌరవాన్ని తగ్గిస్తున్నాయని ఓం బిర్లా ఆవేదన వ్యక్తంచేశారు. ఎల్లవేళలా తెలుపురంగు టీ%–%షర్ట్ ధరించే లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ మూడు బిల్లులను వ్యతిరేకిస్తూ అందుకు నిరసనగా నలుపురంగు టీ%–%షర్ట్ ధరించారు.

ఎవరేమన్నారంటే..

**పోలీస్ రాజ్యంగా మారుస్తున్నారు**

“ఇలా మూడు అక్రమ చట్టాలను తెచ్చి భారత్‌ను పోలీస్ రాజ్యంగా మార్చాలనుకుంటున్నారు. సీబీఐ, ఈడీ వంటి ఏజెన్సీలు ఇష్టారీతిన అరెస్ట్‌చేసేందుకు మోదీ సర్కార్ మరింత స్వేచ్ఛనిస్తోంది. ఈ ఏజెన్సీలే జడ్జీలుగా, కార్యనిర్వాహక వ్యవస్థలుగా సొంత నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఈ పోకడ ఎన్నికల ద్వారా కొలువుతీరిన ప్రభుత్వాలకు మరణశాసనం వంటిది. ఈ మూడు బిల్లులు హిట్లర్ పాలనలో నాజీ సైన్యం అధికారిక రహస్య పోలీస్ విభాగాన్ని గుర్తుకుతెస్తున్నాయి. విపక్షాలపాలిత రాష్ట్రప్రభుత్వాలను అస్థిరపరిచేందుకే బిల్లులను తెచ్చారు”

%–% ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ

**రాజ్యాంగ మౌలికస్వరూపాన్ని నాశనంచేస్తున్నారు.**

“రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని సర్వనాశనం చేసేలా ఈ మూడు బిల్లులను తీసుకొచ్చారు. సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను ప్రభుత్వం ఇప్పటికే దుర్వినియోగపరుస్తోంది. ఇక ఈ మూడు బిల్లులు చట్టాలుగా మారితే ఈ రాజకీయ దుర్వినియోగ వరదకు గేట్లు ఎత్తినట్లే అవుతుంది. ఈ ధోరణిని ఇప్పటికే సర్వోన్నత న్యాయస్థానం సైతం తూర్పారబట్టింది. కొత్త బిల్లులు రాజ్యాంగపరిరక్షణ అస్త్రాలను నిర్వీర్యంచేస్తున్నాయి”

%–% కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ

**‘జైలు’పాలనపై నిర్ణయం ప్రజలదే**

“తమ పీఎం, సీఎం, మంత్రులు తీవ్ర నేరారోపణలతో అరెస్టయి జైలు ఉండి అక్కడి నుంచే పరిపాలించడం ఎంతవరకు సబబో ప్రజలే నిర్ణయించుకోవాలి. ప్రజాజీవితం గడిపే పాలకుల్లో తగ్గుతున్న నైతికతకు చెక్‌పెట్టేందుకే ఈ మూడు బిల్లులన తెచ్చాం. రాజకీయాలకు మళ్లీ సమగ్రత తేవడమే బిల్లుల లక్ష్యం. భవిష్యత్తులో పాలకులు తీవ్రనేరాలతో జైలుపాలైనా అక్కడి నుంచే పరిపాలిస్తారని రాజ్యాంగ నిర్ణేతలు ఆనాడు రాజ్యాంగ రచన సమయంలో ఊహించి ఉండరు”

%–% బీజేపీ అగ్రనేత అమిత్ షా

**మధ్యయుగాలకు మోసుకెళ్తాయి**

ఈ మూడు బిల్లులు మళ్లీ దేశాన్ని మధ్యయుగాల నాటి దురవస్థకు తీసుకెళ్తాయి. ఈ బిల్లులు చట్టాలుమారితే ఖచ్చితం మనం మధ్యయుగాలకు వెళ్తాం. అక్కడ రాజు తనకు నచ్చని వ్యక్తులను పదవుల నుంచి పక్కకు తప్పిస్తాడు. ఆ పదవిలోని వ్యక్తి ముఖం కూడా నచ్చులేదంటే ఈడీ రంగప్రవేశంచేసి అరెస్ట్‌చేస్తుంది. నేరారోపణ రుజువుకాకపోయినా కేవలం 30 రోజులుగా జైళ్లో ఉన్నాడన్న కారణం చూపి.. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన వ్యక్తి ప్రభుత్వాన్ని కూలదోస్తారు”

%–% లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ

**అంత తొందరెందుకు?**

‘అత్యున్నత పదవుల్లోని నేతలను తొలగించేందుకు ఉద్దేశించిన ఇంతటి కీలకమైన బిల్లులను ఎందుకు హడావిడిగా ప్రవేశపెడుతున్నారు? బిల్లుల గురించి ముందస్తు సమాచారం లేదు. హడావిడిగా బిల్లుల ప్రతులను సభలో నామామాత్రం కొద్దిమందికి పంపిణీ చేసి వెంటనే బిల్లులను లోక్‌సభ ముందుకు తెచ్చారు. సభా నిబంధనలను ఈ బిల్లుల విషయంలో అస్సలు పాటించలేదు”

%–% ఆర్‌ఎస్‌పీ పార్టీ సభ్యుడు, ఎంపీ ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్

**ప్రజాస్వామ్యశకానికి పాతరేసే కుట్ర**

“భారత్‌లో ప్రజాస్వామ్య శకానికి ముగింపు పలికే దురుద్దేశంతో ప్రభుత్వం ఈ మూడు బిల్లులు తెచ్చింది. బిల్లులను తేవడం చూస్తుంటే సూపర్ ఎమర్జెన్సీ పీడకలను ప్రభుత్వ పెద్దలు సాకారంచేసుకునేందుకు వేసిన తొలి అడుగులా తోస్తోంది. దేశ న్యాయవ్యవస్థ స్వతంత్రను కాలరాసేందుకు ఈ బిల్లులను తెచ్చారు. ప్రజాస్వామ్యం, సమాఖ్య స్ఫూర్తిని సర్వనాశనంచేసే కుట్ర ఇది. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎంతకైనా తెగించి ఈ బిల్లులు చట్టాలుగా మారకుండా అడ్డుకుందాం”

%–% టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ

**ఇది ఇంగిజ్ఞానానికి సంబంధించింది**

“మీరు 30రోజులపాటు కస్టడీలో ఉండి కూడా మంత్రిగా పదవిలో కొనసాగుతానని వాదించడం ఎంత వరకు సమర్థనీయం? ఇది పూర్తిగా ఇంగితజ్ఞానానికి సంబంధించిన విషయం. ఈ మూడు బిల్లుల్లో నాకైతే ఎలాంటి తప్పు కనిపించట్లేదు. ఈ అంశం మినహా బిల్లుల్లో లోతైన అంశాలు ఉంటే మాత్రం ఖచ్చితంగా సంయుక్త పార్లమెంట్ కమిటీలో చర్చించాల్సిందే. దేశ ప్రయోజనకర అంశాలు ఉన్నాయో లేదో తేల్చాలి”

%–% తిరువనంతపురం కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్

# ఖజానాకు భారంగా తాయిలాలు

విజయవాడ

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లో సంక్షేమ పథకాల పేరుమీద జరుగుతున్న తాయిలాల పంపకం ఖజానాకు పెనుభారంగా మారుతోంది. గతంలో వైసిపి, ప్రస్తుత కూటమి పోటీపడి మరీ అప్పుల మీద అప్పులు చేస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. నిజానికి అవసరంలో ఉన్న పేదలను ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. కానీ దానకర్ణులు అనిపించుకోవడం కోసం సరైన రాబడి రాకుండానే ఇలా ప్రభుత్వాలు సంక్షేమ పథకాల కోసం అప్పుల మీద అప్పులు చేస్తూ వెల్ఫేర్ స్కీమ్ అమలు చేస్తున్న తీరు మేధావి వర్గాల్లో ఏపీ భవిష్యత్తుపై ఆందోళన పెంచుతోంది జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 2024 లో దిగిపోయేసరికి కేవలం సంక్షేమ పథకాలు కోసం ప్రతి ఏటా 70 వేల కోట్ల వరకూ ఖర్చుపెట్టినట్టు ఆయనే స్వయంగా చెప్పుకున్నారు. దీనికోసం వివిధ కార్పొరేషన్లలోని డబ్బులు సైతం వాడేసారని, ప్రభుత్వ ఆస్తులు తాకట్టుపెట్టి మరీ అప్పులు తెచ్చారని టిడిపి, జనసేన తీవ్రంగా ఆరోపించేవి. ఏపీలో అభివృద్ధి పూర్తిగా పడకేసింది అనేది వారి ప్రధాన విమర్శ గా ఉండేది. అమ్మ ఒడి, నాడు –నేడు లాంటి పథకాల వల్ల చాలామందికి మేలు జరిగిన మాట వాస్తవమే అయినా మిగిలిన అనేక పథకాల వల్ల రాష్ట్ర అభివృద్ధి కుంటుపడింది అనేది చాలామంది ఎనలిస్ట్ లు, ఆర్థిక వేత్తల అభిప్రాయం. అటు అమరావతి పక్కకు పోయి, మూడు రాజధానుల వ్యవహారం బెడిసి కొట్టి, పోలవరం ప్రాజెక్టు అతిగతీ లేని పరిస్థితుల్లో పడిపోవడం తో చివరికి సంక్షేమ పథకాలు సైతం జగన్ ప్రభుత్వాన్ని కాపాడలేకపోయాయి. అప్పట్లో రాష్ట్రం లోని రోడ్ల పరిస్థితులపై సామాన్యులు, ఆటో డ్రైవర్లు, వాహన దారులు తీవ్ర అసంతృప్తి వెళ్ళబుచ్చేవారు. విచిత్రంగా వీరిలో చాలామంది సంక్షేమ పథకాల లబ్ది దారులే కావడం విశేషం. అంటే ప్రజలకు సంక్షేమంతో పాటుగా అభివృద్ధి, కనీస సౌకర్యాలు ముఖ్యమనేది చాలా స్పష్టంగా పాలకులకు తెలియజేసిన ఎన్నికల ఫలితాలు అవితెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా కూడా ప్రో డెవలప్మెంట్ లీడర్గా చంద్రబాబు కు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఎన్ని విమర్శలు వచ్చినా ఆర్థిక పరమైన సంస్కరణలకు ఏమాత్రం వెనుకాడే వ్యక్తి కాదని చంద్రబాబు నాయుడు పేరు తెచ్చుకున్నారు. రాష్ట్ర విభజన తర్వాత 2014 ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు పట్టం కట్టడానికి ముఖ్యమైన కారణం ఇదే.

## కర్నూలు జీజీహెచ్‌లో వివాదం

కర్నూలు

కర్నూలు జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఏపీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిరంజీవులు మధ్య వివాదం రగులుకుంటోంది. ఆసుపత్రిలో అభివృద్ధి పనుల విషయంలో ఇద్దరి మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. ఏకంగా సమీక్ష సమావేశం నుంచి ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ (ఈఈ) బయటకు వెళ్లే వరకు వచ్చింది. బుధవారం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ చాంబర్‌లో సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో రూ.45 లక్షలతో నెఫ్రాలజీ, యురాలజీ, న్యూరో సర్జరీ ఆపరేషన్ థియేటర్ల మరమ్మతుల పనులు, ఇతర అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమీక్షలో హాస్పిటల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు ఆపరేషన్ థియేటర్ల పనులు ఆలస్యం అవుతున్నాయనీ, దీని వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నాలుగు నెలలుగా పనులు సాగుతున్నాయనీ, గతంలో పని చేసిన ఇన్‌చార్జి ఈఈ కరీముల్లా వేగంగా స్పందించేవారనీ సూపరింటెండెంట్ చెప్పడంతో ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ తీవ్ర అసహనానికి గురయ్యారు. పనుల నాణ్యతపై తనకు చెప్పకుండా ఏకంగా ఏపీఎంఎస్ఐడీసీ ఎండీకి ఎలా ఫిర్యాదు చేస్తారని ఈఈ ప్రశ్నించారు. తన సర్వీసు 35 సంవత్సరాలు ఉందని, తన ముందే గతంలో పని చేసిన ఇంజనీర్ అధికారిని పొగడటం ఏమిటన్నారు. ఏకవచనంతో పిలుస్తారా? అంటూ వాదనకు దిగారు. గతంలో పని చేసిన కరీముల్లాతోనే పనులు చేయించుకోండి అంటూ సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. ఈ ఘటన ప్రస్తుతం జీజీహెచ్ ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది.

## రూ. 2కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం.. స్మగ్లర్ అరెస్ట్

-మొదటిపేజీ తరువాయి

వాహనాల తనిఖీ చేపట్టారు. అక్రమ రవాణా జరుగుతున్నట్లు ముందస్తు సమాచారం అందడంతో కావలి వన్ టౌన్, టు టౌన్, కావలి రూరల్ సీఐ, ఎస్ఐ సహకారంతో కె.బిట్రగుంట ఫారెస్ట్ బీటు పరిధిలో వాహనాలు తనిఖీ చేశారు. రెండు కార్లు, లారీ వేగంగా రావడంతో సిబ్బంది అప్రమత్తమై లారీని వెంబడించి పట్టుకున్నారు. హరియాణాకు చెందిన ఒక వ్యక్తిని పట్టుకుని, లారీలోని 83 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా గృహ నిర్మాణ శాఖ సర్వే

-మొదటిపేజీ తరువాయి

గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బిల్లులు ఇవ్వాలని సీఎం ఆదేశించారు. హౌసింగ్, టిడ్కో కలిపి 2లక్షల ఇళ్లు సంక్రాంతికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. పీఎంఏవై కింద మిగిలిన 5లక్షల ఇళ్లను రెండో ఏడాది పూర్తి చేసేలా చర్యలు చేపడతాం. రెండేళ్లలో మొత్తం 9లక్షల ఇళ్లు పూర్తి చేసేలా హౌసింగ్ విభాగం చర్యలు తీసుకుంటుంది. గత ప్రభుత్వం రూ.2,900 కోట్ల కేంద్రం నిధులను మళ్లించింది. అప్పటి ఆర్థిక అవకతవకలను సీఎం దృష్టికి తీసుకెళ్లాం. గత ప్రభుత్వం తప్పిదం కారణంగా లబ్ధిదారులు చెల్లించాల్సిన ఈఎంఐలు రూ.140 కోట్లను సీఎం ఆదేశాల మేరకు ఈ ప్రభుత్వం చెల్లించింది” అని మంత్రులు వివరించారు.

## స్త్రీ శక్తితో మహిళలకు ఆర్థిక వెసులుబాటు



విజయవాడ

స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకంతో మహిళల్లో ఆర్థిక స్వాతంత్ర్యం పెరిగిందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖల మంత్రి ఎస్. సవిత తెలిపారు. విజయవాడలోని బుధవారం పండిట్ నెహ్రూ బస్టేషన్ లో స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకంపై మహిళల అభిప్రాయాలను మంత్రి ఎస్. సవిత అడిగి తెలుసుకున్నారు. విజయవాడ నుంచి అమరావతి వెళ్లే ఆర్టీసీ బస్సులో మహిళా ప్రయాణికులతో పయనించి, ఉండవల్లిలో దిగారు. ఈ సందర్భంగా వారితో మంత్రి ముచ్చటించారు. ఉచిత ఆర్టీసీ ప్రయాణంతో కలిగిన లాభాలను అడిగి తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబు అమలు చేస్తున్న పథకాలు గురించి వివరించారు. తల్లికి వందనం, ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, ఉచిత ఇసుక వల్ల ఎంతో మేలు కలుగుతోందని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. అన్న క్యాంటీన్ వల్ల రూ.5లకే టిఫిన్, భోజనం వస్తోందని, ఈ పథకం వల్ల కూలీలు, పేదలకు ఎంతో మేలు కలుగుతోందంటూ సీఎం చంద్రబాబుకు మహిళలు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మంత్రి సవిత మీడియాతో మాట్లాడుతూ, విజయవాడ బస్టేషన్ నుంచి అమరావతి వెళ్లే బస్సులో ఉండవల్లి వరకు మంత్రి ప్రయాణించారు. ఈ సందర్భంగా మంత్రి మహిళా ప్రయాణికులతో ప్రభుత్వ పథకాల గురించి, స్త్రీ శక్తి పథకం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళలను గౌరవించే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. ఆకాశంలో సగం అవనిలో సగం అంటూ మహిళలు కూటమి పాలనలో స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించటం ఆనందంగా ఉందన్నారు. బస్ స్టేషన్ లో అవ్వని, అమ్మనీ, ఎవ్వరిని పలకరించినా ఆనందంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కు జేజేలు పలుకుతూ, హృదయ పూర్వకంగా అభినందనలను అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రారంభించిన స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం వల్ల మహిళలు ఎంతో ఆనందంతో బస్సుల్లో ప్రయాణించడం చూస్తుంటే ఎంతో ఆనందంగా కల్గుతుందన్నారు. సూపర్ సిక్స్ లో ఇప్పటికే ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకాలను అమలు చేయడం జరుగిందని, పెన్షన్ లను అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో ప్రాముఖ్యత ఇచ్చిన వ్యక్తి స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అని అన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశ్యంతో ఆస్తి హక్కు కల్పించారన్నారు. తదనంతరం అదే ఒరవడిని కొనసాగిస్తూ వచ్చిన వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళలకు రిజర్వేషన్లు కల్పించారన్నారు. గత ప్రభుత్వం ధరలను పెంచి పేదవాడిని పలు ఇబ్బందులకు గురిచేసిందన్నారు. మా ప్రభుత్వం పేద వారికి బాసటగా ఉంటూ అన్ని రంగాల్లో ముందుకు పోవాలనే ఉద్దేశ్యంతో వారికి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. స్త్రీ శక్తికి ఎదురులేదని వారు ఆర్థికంగా స్థిరపడే విధంగా వారికి అవకాశాలు కల్పిస్తామన్నారు. మహిళలకు అవకాశాలిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు నెలకు కనీసం రూ. 3,000 వరకు ప్రయాణ ఖర్చు ఆదా అవటంతోపాటు ఏడాదికి రూ. 36,000 ప్రయాణ ఖర్చు కలిసి వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం మహిళల సంక్షేమం కొరకు కృషి చేస్తోందన్నారు. అన్న క్యాంటీన్ల ద్వారా 5 రూపాయలకే భోజనం, టిఫిన్ అందిస్తున్నామన్నారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి

డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

గురువారం 21 ఆగస్టు 2025

3

www.viswam voice.com


# నగరాభివృద్ధిలో భాగం మార్వాడీలు

వారంతా నా కుటుంబ సభ్యులే

వారి మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడం సరైన విధానం కాదు

కూటమిగా అండగా ఉంటాం..వారికి రక్షణ ఉంటాం

21న ఎంటర్ ప్రెన్యూర్స్ సమ్మిట్ -2025

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వెల్లడి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** నగరాభివృద్ధిలో భాగం మార్వాడీలు మార్వాడీలు ఉంటారు అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు)స్పష్టం చేసారు. బుధవారం ఉదయం తిలక్ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్వాడీ గో బ్యాక్ నినాదంపై ఆయన స్పందించారు. ఈ నగరం ఆర్థికంగా అభివృద్ధి చెందిందన్నా, సేవా కార్యక్రమాలు ఇతోధికంగా జరుగుతున్నా అందులో తప్పనిసరిగా రాజస్థానీ మార్వాడీలు,జైన్స్ పాత్ర తప్పకుండా ఉందనేది అందరూ ఒప్పుకోవాల్సిన అంశమని అన్నారు. అలాంటి వారిమనోభావాలు దెబ్బతినేలా ఎవరూ మాట్లాడ్డం సరైన విధానం కాదని ఆయన స్పష్టంచేసారు. మార్వాడీలు, జైన్స్ మా కుటుంబ సభ్యులు లాంటి వారన్నారు. గతంలో ఎన్నికల ముందు కూడా లారీతో గుద్దించేస్తాం, మీ ఊరికి మీరు పోవాలని భయభ్రాంతులకు గురిచేసినపుడు కూడా ఆనాటి ఎస్పీ దగ్గరకు వెళ్లి పిర్యాదు చేశామని ఆయన అన్నారు. మార్వాడీలు స్వేచ్ఛగా ఎక్కడైనా వ్యాపారం చేసుకోవచ్చని, మా కుటుంబ సభ్యులు లాంటివారని, పైగా ఎన్నికల్లో కూటమికి అండగా నిలిచారని ఎమ్మెల్యే వాసు అన్నారు. భారతీయుడు అనేవాడు ఎవరైనా ఈ దేశంలో ఎక్కడైనా జీవించవచ్చు, వ్యాపారం చేసుకోవచ్చు ఇందులో ఎలాంటి సందేహం లేదు అని ఆయన గుర్తు చేశారు. ఎన్నో ఏళ్లుగా ఈ నగరంలో ఉంటూ ఈ నగరాభివృద్ధిలో భాగంగా ఉంటూ , ఎక్కడికి వెళ్లిన మార్వాడీలమని, జైన్స్ కాకుండా రాజమండ్రి నుంచి వచ్చామని చెబుతారని ఎమ్మెల్యే వాసు గుర్తుచేసారు. అలాంటి వాళ్ళను విడదీసే విధంగా మాటలు రావడం సరైన విధానం కాదని ఆయన స్పష్టంగా చెప్పారు. మా బంధం చాలా బలమైనది, ఈ బంధానికి విఘాతం కల్గిస్తే, కూటమి ప్రభుత్వం కఠినంగా చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే వాసు ప్రకటించారు. మార్వాడీలకు, జైన్స్ కి కూటమి పక్షాన అండగా ఉండి, రక్షణగా ఉంటామని తెలిపారు. వాళ్ళమీద ఈగ అనేది వాలకుండా చూస్తామని, రక్షణ కవచంగా కూటమి ఉంటుందని స్పష్టమైన హామీ ఇస్తున్నామన్నారు. మార్వాడీలు మాతో సమానంగా కూర్చుని చర్చించే అవకాశం ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో మార్వాడి సామజిక వర్గానికి ప్రాతినిధ్యం ఇవ్వాలని శ్రీ ఉమా మార్కండేయేశ్వర స్వామి ఆలయ ఛైర్మన్ పదవిని మదన్ సింగ్ రాజ్ పురోహిత్ కి ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అలాగే ప్రభుత్వాసుపత్రి కమిటీలో నలుగురు సభ్యులకు గాను ఒకరు బిజెపి, ఒకరు జనసేన, ఇద్దరు టిడిపి నుంచి ఇచ్చామని, టిడిపి నుంచి ఇచ్చిన ఇద్దరిలో అనూప్ జైన్ ఒకరని ఎమ్మెల్యే వాసు చెప్పారు. ఈ పదవులు ఇప్పుడు వేయలేదని ఆయన స్పష్టం చేసారు. అందరికీ ప్రాతినిధ్యం ఉండాలి, అందరూ ఎదగాలనే ఉద్దేశ్యంతో నియామకాలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

**21న ఎంటర్ ప్రెన్యూర్స్ సమ్మిట్ -2025**

రాజమండ్రి ఎంటర్ ప్రెన్యూర్స్ సమ్మిట్ -2025 ఐడియా పిచ్ కాంపిటేషన్ ని 21వ తేదీ గురువారం రాజమండ్రిలోని హెూటల్ మాజీరాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ముందస్తు ప్రచారం చేశామని ఎమ్మెల్యే వాసు చెప్పారు. 130మంది నమోదు చేసుకున్నారని, అందులో స్క్రీనింగ్ చేసి 15మందిని ఎంపిక చేశామని తెలిపారు. హెూటల్ మంజీరాలో బుధవారం మధ్యాహ్నం ఈ 15మంది ప్రజెంటేషన్ ఇస్తారని చెప్పారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిలో మొదటి బహుమతిగా ఒక లక్షా 25వేలు, రెండవ బహుమతిగా లక్ష రూపాయలు, మూడవ బహుమతిగా రూ 75వేలు భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపునుంచి ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే వాసు చెప్పారు. ఈ ముగ్గురితో పాటు మరో ముగ్గురు బాగా ప్రజెంటేషన్ ఇచ్చినవాళ్లను ఎంపిక చేసి మొత్తం ఆరుగురిని బొమ్మూరులో ప్రారంభిస్తున్న రతన్ టాటా హబ్ కి అప్పగిస్తామని తెలిపారు. ఇలాంటి ఎంటర్ ప్రెన్యూర్స్ కి అవసరమైన సహకారం అందించడమే రతన్ టాటా ఇంకుబేషన్ సెంటర్ ఆవశ్యకత అన్నారు. మొత్తం మీద 400మంది పాల్గొంటున్నందున వారందరినీ రతన్ టాటా సెంటర్ కి ఇస్తామని ఆయన చెప్పారు. వారందరినీ ట్యూన్ చేసి ఎంటర్ ప్రెన్యూర్స్ గా స్థిరపడేందుకు మార్గం సుగమం చేస్తారని ఆయన తెలిపారు. రిజిస్ట్రేషన్లు అయిపోయినప్పటికీ ఇంకా ఎవరైనా ఆసక్తి ఉన్నవాళ్లు ఉంటె ఎంటర్ ప్రెన్యూర్స్ గా నమోదుకావచ్చని ఎమ్మెల్యే వాసు తెలిపారు. మీడియా సమావేశంలో కూటమి నాయకులు మజ్జి రాంబాబు, వై శ్రీను పి నాగేంద్ర, యిన్నమూరి దీపు, శెట్టి జగదీష్, అనూప్ జైన్, విక్రమ్ జైన్, మదన్ సింగ్ రాజ్ పురోహిత్, భేరూలాల్ జైన్, హీరా చంద్ జైన్,అధిక సంఖ్యలో మార్వాడీలు,జైన్స్ పాల్గొన్నారు.

## దేశానికి కంప్యూటర్ టెక్నాలజీనీ తెచ్చిన ప్రధాని రాజీవ్ గాంధీ

**టి.కె ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ 81వ జయంతి ఘన నివాళి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** బుధవారం నాడు రాజీవ్ గాంధీ 81వ జయంతి సందర్భంగా రాజమహేంద్రవరం సీతంపేట రాజీవ్ గాంధీ పార్క్ లో ఉన్న దివంగత భారతదేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ టి.కే. విశ్వేశ్వర రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ టి.కే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ భారత రాజకీయాల్లో 40 సంవత్సరాల వయసులో అతి పిన్న వయస్కుడైన ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ, ఈ దృగ్విషయం ప్రపంచ వ్యాప్తంగా దృష్టిని ఆకర్షించింది, ఆయన అందమైన చిరునవ్వు, ఆకర్షణ మరియు మర్యాద, సౌమ్యమైన మనస్తత్వం ఆయనకు విలువైన వ్యక్తిగత ఆస్తులు. ప్రధానమంత్రిగా గాంధీ తీసుకున్న మొదటి చర్య జనవరి 1985లో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని ఆమోదించడం. రాజీవ్ గాంధీ భారతదేశనికి కంప్యూటర్ రంగం, టెలి కమ్యూనికేషన్ రంగం, టెక్నాలజీ రంగం తీసుకువచ్చిన మొదటి ప్రధానిగా గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. భారతదేశాన్ని ఎలక్ట్రానిక్ కంప్యూటర్ యుగంలోకి తీసుకెళ్లిన గొప్ప మహానుభావుడని ఆయన రాజమండ్రి మీటింగ్ కి ప్రధానమంత్రి హెూదాలో వచ్చినప్పుడు రాజమండ్రి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఆయనకు స్వయంగా టీ ఇచ్చే అదృష్టం నాకు కలిగిందని అదే తనకు మంచి అనుభూతి ఇచ్చిందని విశ్వేశ్వర రెడ్డి చెప్పినారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ కూడా ఆయన అడుగుజాడల్లో నడిచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి ఆయన కుమారుడైన రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయ్యేటట్టు ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.వీర వెంకటరావు,శ్రీను,లక్ష్మణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముసలమ్మ వారి రథం షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



**కడియం, విశ్వం వాయిస్ న్యూస్:** కడియం మండలం కడియపులంకలో వేంచేసి ఉన్న శ్రీ పంతులో ముసలమ్మ వారి ఆలయం రథం షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇటీవల ఈ స్థలాన్ని ఆ గ్రామపంచాయతీ వారు తీర్మానం చేసి ఇచ్చారు. గ్రామ పెద్దల ఆద్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి ఈ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నర్సరీ రైతులు మార్గాని సత్యనారాయణ, గట్టి నరసయ్య,మార్గాని ఏడుకొండలు, పాటంశెట్టి రాంజీ,పంతం గణపతి, పుల్లా ఆంజనేయులు, గంగుమళ్ల సత్యనారాయణ, పుల్లా పెద్ద సత్యనారాయణ, పుల్లా చినసత్యనారాయణ, పెనుమాక శేషగిరి, పెద్దిరెడ్డి శ్రీనివాసు,నక్కా కాశీ అమ్మరాజు సోదరుడు, బొర్ను సుబ్బారాయుడు, పుల్లా రామన్న,కర్రి ఎసయ్య,తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగేలా కృషి

- రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

- బాలేపల్లి ఆధ్వర్యంలో ఘన నివాళులు



**రాజమహేంద్రవరం,విశ్వంవాయిస్ న్యూస్:** ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగేలా కృషి చేసిన మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ కొనియాడారు. రాజీవ్ గాంధీ 81వ జయంతి సందర్భంగా స్థానిక మంగళవారపు పేటలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ తో పాటు మాజీ ప్రధానులు జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ విగ్రహాలకు కూడా నివాళులర్పించారు. బాలేపల్లి మాట్లాడుతూ ఇందిరాగాంధీ హత్య అనంతరం ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్ గాంధీ దేశాన్ని మంచి సంస్కరణల బాటలో నడిపిస్తూ సమర్థవంతంగా ముందుకు తీసుకుని వెళ్లారని పేర్కొన్నారు. దేశానికి కంప్యూటర్ ను పరిచయం చేసి యువతకు మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగేలా కృషి చేశారని అన్నారు. విదేశీ వ్యవహారాలు, ఇతర దేశాలతో మంచి సంబంధ బాంధవ్యాలు నడిపి దేశాన్ని అభివృద్ధి బాటన పయనింప చేశారని గుర్తు చేశారు. దేశం, రాష్ట్రం బాగుండాలంటే మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలందరూ ఈ విషయంలో ఆలోచించి కాంగ్రెస్ పార్టీని మళ్ళీ ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు కొవ్వూరి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్లోబలైజేషన్ కి ముందే దేశానికి దశ దశ చూపిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందన్నారు. గాంధీ కుటుంబం నిరంతరం దేశ అభ్యున్నతి, అభివృద్ధి కోసం పనిచేసిన విషయాన్ని ప్రజలు గ్రహించాలని కోరారు. రాజీవ్ గాంధీ హయాంలోనే పోలియో రహిత భారతదేశం రూపుదిద్దుకునేందుకు కార్యాచరణ జరిగిందన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిసిసి సభ్యుడు చింతాడ వెంకటేశ్వరరావు, మహిళా కాంగ్రెస్ నగర అధ్యక్షురాలు చామర్తి లీలావతి, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గట్టి నవ తారకేష్, నాయకులు ఇజ్జరౌతు సత్యనారాయణ, బండారు వెంకన్న, టి.పుర్లయ్య,టీ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## దోమల వలన వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.



**రాజమహేంద్రవరం,విశ్వంవాయిస్ న్యూస్:** అంతర్జాతీయ దోమల దినోత్సవం సందర్భంగా స్థానిక కంబాలచెరువులో కంబాలపేట పట్టణ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అనూహ్య మల్లాది దోమల లార్వాను తినడానికి గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూహ్య మాట్లాడుతూ దోమల నివారణ కు ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని,ఈ వర్షాకాలంలో దోమల వలన వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీహరి,యూపీహెచ్సీ హెచ్ వి డీడీ భవానీ,ఏఎన్ఎమ్ లు,ఆశా కార్యకార్తలు పాల్గొన్నారు.

## "మహా సురక్ష"తో 'ఆక్టోపస్' టీమ్ మాక్ డ్రిల్



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** రాజమహేంద్రవరం,కేంద్ర కారాగారములో బుధవారం సమయం రాత్రి 12.00ల వరకు రెవెన్యూ, ఫైర్, మెడికల్,ఎలక్ట్రికల్ విభాగాల సిబ్బంది,లోకల్ పోలీస్ మరియు ఆర్మ్ డ్ రిజర్వ్ పోలీస్ వారి సహకారంతో "ఆపరేషన్ మహా సురక్ష"పేరుతో 'ఆక్టోపస్'టీమ్ మాక్ డ్రిల్ నిర్వహించింది. కారాగార పర్యవేక్షణాధికారి యస్. రాహుల్ ఆధ్వర్యంలో ఆక్టోపస్ జట్టు అధికారులు డీఎస్పీలు బి.కృష్ణ,కె. శంకరయ్య,ఇన్స్పెక్టర్ బి. మురళి,ఆక్టోపస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ డ్రిల్ ద్వారా జైలులో అత్యవసర పరిస్థితులు ఎదురైె, అనుకోని ఘటనలు జరిగినప్పుడు,ఉగ్రవాద చర్యలు లేదా ప్రమాదకర సంఘటనలు జరిగినప్పుడు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవడం,మరియు రక్షణ వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించి ప్రతి స్పందించడం ఉద్దేశ్యం గా నిర్వహించడం జరిగింది. జైలు అధికారులకు, సిబ్బందికి అత్యవసర పరిస్థితులలో సురక్షిత చర్యలు చేపట్టడం కోసం అవసరమైన మార్గ దర్శకాలను ఆక్టోపస్ జట్టు బృందం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జైలర్లు, డిప్యూటీ జైలరు, గార్డింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్యుల నిర్లక్ష్యానికి బలవుతున్న పేదలు

పేద రోగిని అర్థరాత్రి కాకినాడ పంపేసి చేతులు దులుపుకున్న గుండె పరీక్ష వైద్యుడు

ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్న ఆ వైద్యుడిపై కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తున్నాం

బర్రే కొండబాబు హెచ్చరిక



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో కొందరు వైద్యుల నిర్లక్ష్యానికి పేదలు బలవుతున్నారని నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు ఆరోపించారు. పేద రోగులకు మెరుగైన చికిత్స అందించకుండా కొందరు వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారని ఆయన మండిపడ్డారు. బుధవారం ఉదయం బర్రే కొండబాబు మీడియాతో మాట్లాడారు. సుబ్బారావునగర్ కు చెందిన జువ్వల రాజేష్ అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతుండడంతో మంగళవారం అర్థరాత్రి అత్యవసరంగా అతడి కుటుంబ సభ్యులు రాజమండ్రి ప్రభుత్వాసుపత్రి కి తీసుకు వేళ్ళారని,తాను కూడా అక్కడకు వెళ్లి అతడికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని చెప్పి వచ్చానని తెలిపారు. తాను వచ్చేసిన తర్వాత గుండె పరీక్ష వైద్యుడు కనీసం రోగిని పరీక్షించకుండా మద్యం తాగడం వల్ల హార్ట్ ప్రోబ్లం వచ్చిందని, చికిత్స చేసేందుకు ఇక్కడ హార్టుకి సంబంధించి సరైన సదుపాయాలు లేవని కాకినాడ తీసుకు వెళ్ళాలని చెప్పాడని మండిపడ్డారు. అర్థరాత్రి అంతదూరం తాము ఎలావెళతామని, అంబులెన్స్ ఏర్పాటు చేయాలని రోగి భార్య, బంధువులు వాపోవడంతో ఒక అంబులెన్స్ ఏర్పాటు చేసి కనీసం నర్సింగ్ సిబ్బంది కూడా లేకుండా అంబులెన్స్ డ్రైవరుతో రోగి రాజేష్ ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పంపించాడని ఇలాగేనా రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు ప్రవర్తించే తీరు అని ఆయన ప్రశ్నించారు. కాకినాడ ఆసుపత్రిలో వైద్యులు రాజేష్ ను పరీక్షించి రెండుసార్లు ఈసీజీ తీసి చూసి హార్టులో ఎలాంటి ప్రోబ్లం లేదని నిర్ధారించి, నీరసంగా ఉన్న రోగికి ఇంజెక్షన్ చేసి సెలైన్ ఎక్కించి బుధవారం ఉదయం 6.30 కి ఇంటికి పంపించారని కొండబాబు వివరించారు. రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో కొందరు వైద్యుల తీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని బర్రే కొండబాబు అన్నారు. ఇంటివద్ద ,బయట క్లినిక్ పెట్టుకుని ప్రైవేటు వైద్యం చేయడానికి రుచిమరిగిన కొందరు ప్రభుత్వ వైద్యులు ఆసుపత్రికి వచ్చే పేద రోగులపట్ల ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. కడుపులో ఇన్ఫెక్షన్ తో బాధ పడుతున్న రాజేష్ ను సరిగా పరీక్ష చేయకుండానే కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పంపించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రాజమండ్రి సామాన్య సర్వజన ఆసుపత్రిలో సామాన్యులకు మెరుగైన వైద్యం అందని ద్రాక్షయేనా అని బర్రే కొండబాబు ప్రశ్నించారు. ఆ వైద్యుడి తీరుపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు. రోగి రాజేష్ భార్య జువ్వల సత్యవతి మాట్లాడుతూ రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళిన తన భర్తను డాక్టర్ కనీసం ముట్టుకోలేదని ఎలాంటి పరీక్షలు చేయకుండా ఇక్కడ తమకు సదుపాయాలు లేవని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకు వేళ్ళాలని అర్థరాత్రి చెప్పారని వాపోయింది. అంబులెన్స్ లో డ్రైవరుమాత్రమే ఉన్నారని, నర్సు కూడా తోడు రాలేదని ఆమె బాధపడింది. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు పరీక్షలు నిర్వహించి గుండె నార్మల్ గానే ఉందని ఇంజెక్షన్ చేసి సెలైన్ ఎక్కించి ఇంటికి తీసుకువెళ్లమని చెప్పారని సత్యవతి చెప్పారు. రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో తమలాంటి పేదలకు వైద్య సేవలు అందించడంలో ఇలాంటి వైద్యులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది.

## కాపునాడు రాజానగరం యువజన అధ్యక్షుడిగా దేనేడీ మణికంఠ స్వామి



**రాజమహేంద్రవరం,విశ్వంవాయిస్ న్యూస్:** రాజానగరం నియోజకవర్గ కాపునాడు యువజన విభాగం అధ్యక్షుడిగా దేనేడి మణికంఠ స్వామి నియమితులయ్యారు. ఈమేరకు నియామక పత్రం దేవీ చౌక్ కాపునాడు కార్యాలయంలో ఉభయగోదావరి జిల్లాల అధ్యక్షుడు గుదే రఘు నరేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాజమండ్రి పార్లమెంట్ అధ్యక్షుడు ముమ్మిడి వీరబాబు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత సామాజిక సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుకు రావాలన్నారు. యువతను మంచి పౌరులుగా తీర్చిదిద్దే విధంగా కృషి చేయాలని, ఈ దిశగా కార్యక్రమాలు చేపట్టాలని నూతన అధ్యక్షుడికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గ అధ్యక్షుడు కాళ్ళ చక్రరావు, బచ్చు నాగార్జున, సలాది తాతయ్య నాయుడు, దొడ్డ వెంకటేశ్వర్లు, దేశాల నాగమణికంఠ, తోరాటి వెంకటేష్, పెంటకట్ల వెంకటేశ్వరరావు, రూరల్ అధ్యక్షులు దేశినీడి రాంబాబు, వురింకల సతీష్, కోరుమిల్లి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఎడిటర్ వాయిస్

# నామమాత్రమైన సంక్షేమ చట్టాలు

కన్నవారు, తాము పెంచి పెద్ద చేసిన తమ వారు, బంధు బాంధవులు, కడదాక తమకు వెన్నంటి ఉంటారని అనుకుని, అశక్తత ఆవహించిన ముదిమి వయసులో, అందరూ వదిలి వేస్తుండగా, ఒంటరితనం భరించడం భయంకరమైన వేళ... విధి వంచితులైన ఎందరో వయోవృద్ధులు, పడుతున్న బాధలు వర్ణనాతీతం. వయో వృద్ధుల సంక్షేమార్థం చేసిన చట్టాలు, వాటి అమలుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, కాగితాలకే పరిమితమై, ఆచరణకు నోచుకోలేక మృగ్యాలే అవుతున్నాయి. భారత దేశంలో ప్రస్తుతము 15కోట్లమంది వృద్ధులున్నారు. 2050 నాటికి వీరి సంఖ్య 32.3కోట్లకు చేరుతుందని అంచనా. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని వృద్ధుల సంఖ్య అప్పటికి రెండున్నర కోట్లు దాటే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది వయోవృద్ధులు ఉండగా, వీరిలో 10 శాతంకు మించకుండా ఆర్థికంగా, ఆరోగ్యంగా, తమ తమ పిల్లల, బంధువుల వద్ద ఉంటుండగా, మరికొందరు తమ పిల్లలే చేర్పించిన అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలలో తమ దుస్థితిని తామే తిట్టుకుంటూ, కాలం వెళ్లదీస్తున్నారు. ఆకలితో అలమటిస్తూ, అనారోగ్యాలకు బలి అవుతూ, నిరాదరణ నీడలో మగ్గుతూ, ఎందరో తమ దుస్థితికి ఆవేదన చెందుతుండటం హృదయ విదారకమై, గుండెలను పిండి వేస్తున్న సచిత్రం సర్వత్రా సాక్షాత్కార మిస్తున్నది. దేశంలో నెలకొన్న వరిస్థితుల వల్ల సామాన్యులకు నానాటికీ బతుకు భారము అవుతున్న రోజులివి. అదేక్రమములో వృద్ధుల పట్ల నిరాదరణ కూడా అంతకంతకు ఎక్కువై పోతోంది. దేశాన్ని పాలిస్తోంది ప్రధానంగా వృద్ధనేతలే అయినవ్పటికీ వయోవృద్ధుల సమస్యలకు వరిష్కారం కనబడక పోవడము అసలైన విషాదం. దేశంలోని ప్రతి అయిదుగురి వృద్ధుల్లో ఒకరు ఒంటరిగా జీవిస్తున్నారు. ముగ్గురిలో ఒకరు వేదింవులకు గురవుతున్నారు. 'హెల్పేజ్ ఇండియా' అధ్యయనం నిగ్గుతేల్చిన విషయమిది. వృద్ధాప్యంలో కుటుంబ సభ్యులే వృద్ధుల పాలిట శత్రువులుగా మారుతున్నారు. దూషణలకు పాల్పడటమే కాకుండా కొందరు శారీరక హింసకూ పాల్పడు తుండటం పతనమవుతున్న మానవతా విలువలకు నిదర్శనం. వాస్తవానికి వృద్ధులు జాతి సంవద! వారి అనుభవాలు ముందు తరాలకు అమూల్యమైన పాఠాలు. అందుకే పాశ్చాత్య దేశాలు వృద్ధుల సంరక్షణకు దీటైన చట్టాలు రూపొందించాయి. బతికినంత కాలం వృద్ధులను కుటుంబ సభ్యులు ఆదరణతో చూసుకునే విధంగా పటిష్ఠ నిబంధనలు చట్టంలో పొందు పరచారు. అనేక దేశాలు చట్టాలు చేసిన 50 ఏళ్ళ తర్వాత, "తల్లిదండ్రుల, వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007" మన దేశంలో రూపొదించ బడ్డది. ఐతే దీని గురించి ఎలాంటి అవగాహన సదస్సులు నిర్వహించక పోవడం, సదరు చట్టంపై చాలా మందికి అవగాహన లేకపోవడం, సర్వత్రా కనిపిస్తున్నది. ఫలితంగా ఆ చట్టం నిరుపయోగం అవుతున్నది. సంరక్షణ, భద్రత కల్పించాల్సిన వయోవృద్ధులను, సీనియర్ సిటిజన్లను కుమారులు, కూతురులు విడిచిపెట్టి, పరిత్యాగం చేసే విధంగా, బుద్ధిపూర్వకంగా వ్యవహరించినా, చట్ట ప్రకారం శిక్షార్హమే. శిక్షాకాలం ఒక టర్ముకు, మూడు మాసాల జైలు శిక్ష లేదా అపరాధ రుసుము, గరిష్టంగా ఐదు వేల రూపాయలు, రెండింటిని విధించవచ్చు. జిల్లాస్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యునల్ కు జిల్లా కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్. డి. ఓ. నిర్వహణ అధికారులుగా వ్యవహరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఒక వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని, సీనియర్ సిటిజన్లకు వేరుగా క్యూ పద్ధతి ప్రవేశపెట్టాలని, దీర్ఘకాలిక, అంతిమ పునర్వికాసం లేని రోగాల చికిత్సల సదుపాయాలు, ప్రభుత్వమే కల్పించాలని, 2007 సంక్షేమ చట్టం నిర్దేశిస్తున్నా, అమలుకు నోచుకోక పోవడం శోచనీయం. వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం జారీచేసిన వృద్ధుల సీనియర్ సిటిజన్ సంక్షేమ చట్టం పై, సదవగాహన కల్పించడానికి సదస్సులు ఏర్పాటు, ప్రతి జిల్లాలో ఒక వృద్ధాశ్రమం, సీనియర్ సిటిజన్ "డే కేర్" సెంటర్ల నిర్వహణ, ప్రతి మండలంలో వీరి రక్షణ, వైద్య సహాయం కోసం వైద్యశాల, బాధ్యతను ప్రభుత్వం పూర్తిగా మరిచింది.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# వృద్ధులను జాతి సంపదగా గుర్తించాలి



బాల్య, కౌమార్య, యవ్వన, వృద్ధాప్యాలు జీవితంలో ఏ ప్రాణికయినా తప్పనిసరిగా సంభవించే జీవన రేఖలు. 'ఎండుటాకును చూసి పచ్చటాకు నవ్వింది' అని తెలుగులో ఒక సామెత ఉంది. పండిపోయి చెట్టు నుంచి రాలే ఎండుటాకును చూసి చెట్టు రెమ్మలకు వేలాడే పచ్చటాకు నవ్విందట. అది గమనించిన ఎండుటాకు పిచ్చిమొహమా రేపు నీకు కూడా నా గతే కదే.. అని పకపకమంటూ ఆ ఎండుటాకు రాలిపోయిందట. మనిషి జీవిత చక్రంలో వచ్చే మార్పులు బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం. అయితే మనిషిగా పుట్టిన ప్రతివ్యక్తీ తుదిశ్వాస ఉన్నంతవరకు, ప్రతి దశలోనూ ఎంతో ఆనందంగా జీవించాలని కోరుకుంటాడు. వృద్ధాప్యము లేదా ముసలితనము మానవ జన్మలో చివరి దశ. దీనిని నిర్వచించడానికి వయోపరిమితి లేనప్పటికి, మనిషి శరీరము రోగనిరోధక శక్తిని క్రమక్రమముగా కోల్పోయి చివరకు మరణించే స్థితికి చేరే దశను వృద్ధాప్యముగా చెప్పవచ్చు. నేడు పిల్లలుగా, యువజనులుగా, నడివయస్కులుగా పాత్రలు పోషిస్తున్న అందరూ వృద్ధుల బృందంలోకి అడుగు పెట్టే పరిస్థితి తప్పక వస్తుంది. యవ్వన దశలో వారు సమాజానికి అవసరమైన సమస్త ఉత్పత్తి కార్యకలాపాలలో పాల్గొని రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తుకు తమ వంతు కృషి చేసి ఉంటారు. పనులు మాని, లక్ష్యాలు పూర్తి చేసుకుని ఉత్పత్తికి దూరమై విశ్రాంతి తీసుకుంటూ జీవన చరమదశను ముగిద్దామని దీర్ఘ సెలవులో ఉన్న జాతి నిర్మాతలే వృద్ధులు. అందుకే వారికీ ఓ రోజును కేటాయించి సమాజానికి వారు అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ ప్రపంచ వ్యాప్తంగా ఏటా ఆగష్టు 21న అంతర్జాతీయ సీనియర్ సిటిజన్స్ డే జరుపు కుంటున్నారు. ఐక్య రాజ్య సమితి అంచనా ప్రకారం ప్రపంచంలో ప్రతి 10 మందిలో ఒకరు ఇప్పుడు 60 ఏళ్ల వయసును కలిగి ఉన్నారు. 2050 నాటికి ప్రపంచంలోని ప్రతి అయిదుమందిలో ఒకరు 60 ఏళ్లు ఆ పైబడి వయసు కలిగి ఉంటారట. 2150వ సంవత్సరానికి ప్రపంచంలో ప్రతి ముగ్గురు వ్యక్తుల్లో ఒకరు ముదుసలిగా ఉంటారట. సీనియర్ సిటిజన్లుగా పేరు పడిన ఈ వయోవృద్ధుల అవసరాలు తీర్చే కృషిలో వ్యక్తులూ, సమాజమూ పునరంకింతం అయేందుకు గాను ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలూ అంతర్జాతీయ వృద్ధాప్య దినాన్ని జరుపు తున్నాయి. తన కుమారులకు, కుమార్తెలకు, మనుమళ్ళకు, ముని మనుమలకు సలహాలు ఇచ్చే వయస్సు కూడా ఇదే. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం కూడా వృద్ధుల సంక్షేమానికి కొన్ని జాతీయ ప్రణాళికను, కొన్ని మార్గదర్శకాలను ప్రకటించింది. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా గత 2007లో వృద్ధుల కోసం పోషణ, సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. అయితే, ఈ చట్టాలు అమలుకు పూర్తిగా అమలుకు నోచుకోవడం లేదన్నది తెలిసిన సత్యమే. వృద్ధుల సమస్యల పరిష్కారానికి సమాజంలో ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలి. వేధింపులు, ఆరోగ్య సమస్యల నుంచి వృద్ధులను దూరంగా ఉంచేలా కుటుంబ సభ్యులంతా చొరవ చూపాలి. జీవితంలో వృద్ధాప్యం అనేది చివరి దశ కావడంతో– వారిలో శారీరక మార్పులను ఆపడం ఎవరితరం కాదు. వృద్ధాప్యం అన్నది శరీరానికే కానీ మనసుకు కాదని ప్రతివారూ తెలుసు కోవాలి. ప్రస్తుతం అరవయ్యేళ్ల వయసు దాటిన వారు దేశంలో 15 కోట్ల మేరకు ఉంటారని అంచనా. వీరిలో సుమారు కోటిన్నర మందికి పైగా ఒంటరి జీవితం సాగిస్తున్నారు. ఆధునిక వైద్య సదుపాయాలు, ఔషధాలు అందుబాటు లోకి రావడంతో ఆయుర్ధాయం పెరుగుతోంది. దీంతో వృద్ధుల సంఖ్య అదే స్థాయిలో అధిక మవుతోంది. ప్రపంచంలో ఎక్కువ మంది వృద్ధులు ఉన్న దేశంగా చైనా మొదటి స్థానంలో ఉంది. ఇక్కడ 60 ఏళ్లకు పైబడినవారు 16.7 కోట్ల మంది, 80 ఏళ్లకు పైబడిన వారు పది లక్షల మంది ఉన్నారు. 80 ఏళ్లకు పైబడిన వారి 'సూపర్ సీనియర్ సిటిజన్స్' అంటారు. జపాన్‌లో నూటికి 30 శాతం మంది 60 ఏళ్లు పైబడిన వారు ఉన్నారు. 2050 నాటికి 64 దేశాలు 30 శాతం వృద్ధులతో నిండి పోతాయట! అంటే వృద్ధుల జనాభా 120 కోట్లకు చేరుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 80 శాతం వృద్ధులుంటారని ఐక్యరాజ్యసమితి చెబుతోంది. 2050 నాటికి మన దేశంలో వృద్ధుల జనాభా 30 కోట్లపైనే ఉండే అవకాశముంది. మన దేశంలో ప్రతి ఐదుగురు వృద్ధుల్లో ఒకరు ఒంటరిగా జీవిస్తున్నారు. ముగ్గురిలో ఒకరు వేధింపులకు గురి అవుతున్నారు. 'హెల్పేజ్ ఇండియా' అధ్యయనం నిగ్గుతేల్చిన విషయమిది. వృద్ధుల సంరక్షణ వారి పిల్లల కనీస బాధ్యత. వయసుడిగిన దశలో తమ వారసుల నుంచి వారు కోరుకునేది ప్రేమ పూర్వక పలకరింపు, ఆదరణ, అభిమానాలే తప్ప– ఆడంబరాలు, విలాసాలు కాదు. వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలే కాదు, ఆర్థిక, సామాజిక సమస్యలు వారిని చుట్టు ముడుతాయి. ఇలాంటి సమయంలో వారికి అండగా నిలవాల్సి ఉండాలి. 60 ఏళ్లు పైబడిన అనుభవజ్ఞుల శక్తిని, అనుభవ సారాన్ని ఉపయోగం చేసుకుంటే తప్పకుండా ఏ దేశమైనా పురోగమిస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు. పేద, మధ్యతరగతి కుటుంబాల వారే కాదు, సంపన్న కుటుంబాల లోనూ వృద్ధులైన తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో చేర్పించి తమ పని పూర్తయిందను కుంటున్నారు. రేపు తమదీ ఇదే బతుకని వారు మరచి పోతున్నారు. సంతానం ఉన్నవారు, లేనివారు అనే తేడా లేకుండా పిల్లలు కళ్లముందున్నప్పటికీ కొందరు వృద్ధులు అనాథలుగా మారుతున్నారు. ఆవేదనతో మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. సంపాదన అనే వ్యామోహంలో పడి కొందరు యువకులు తల్లిదండ్రుల ప్రేమను పోగొట్టు కుంటున్నారు. మరికొంత మంది బంధాలను దూరం చేసు కుంటున్నారు. జాతీయ స్థాయిలో వృద్ధుల స్థితిగతులపై 'హెల్పేజ్ ఇండియా' వెలువరించిన నివేదికలో అనేక ఆసక్తికర అంశాలు వెలుగు చూశాయి. సొంత కుటుంబ సభ్యులనుంచే నిరాదరణ ఎదురవుతోందంటూ 56 శాతం వృద్ధులు స్పందించారు. కుమారుల్లో 57 శాతం, కోడళ్లలో 38 శాతం పెద్దవారిని ఆదరించడం లేదట. తమ హక్కుల సంరక్షణ కోసం రూపొందించిన చట్టాలపై వృద్ధుల్లో కొంతవరకు అవగాహన ఉన్నప్పటికీ, కుటుంబ గౌరవం మంట గలుస్తుందన్న భయంతో పోలీసులను ఆశ్రయించటం లేదన్నది 52 శాతం వృద్ధుల స్పందన. వృద్ధులపై వేధింపుల నిరోధానికి కేంద్రం ఒక చట్టం చేసింది. 'తల్లిదండ్రులు, వృద్ధుల సంక్షేమ నిర్వహణ చట్టం'గా వ్యవహరించే దీని గురించి చాలామంది వృద్ధులకు తెలియదు. గ్రామీణ వృద్ధుల్లో 45 శాతం మంది దీర్ఘకాల అనారోగ్యాలతో బాధపడుతున్నారని జాతీయ నమూనా సర్వే తెలిపింది. ఇంట్లో ఎన్ని బాధలు పడుతున్నా నోరువిప్పని వృద్ధులు ఢిల్లీలో 92 శాతం వరకు ఉంటారని హెల్ప్ ఏజ్ ఇండియా అధ్యయనం తెలిపింది. నేటి ఆధునిక కాలంలో వృద్ధాశ్రమాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటుకావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వృద్ధులు ప్రశాంతంగా కాలం గడపడానికి అవసరమైన చేయూత అందచేయడం కుటుంబ సభ్యులందరి కనీస బాధ్యత. వృద్ధాప్యంలో ఉన్నవారితో ప్రతిరోజూ కాసేపైనా గడపాలి. వారి అనుభవాల్ని తెలుసుకోవాలి. ఈరోజు మనం వృద్ధులకు ప్రేమను పంచితే– రేపు మన వృద్ధాప్యంలో మనం కూడా ప్రేమను పొంద గలుగుతాం అని యువత గుర్తించాలి. వృద్ధులను మన జాతి సంపదగా గుర్తించాలి. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా, కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అవుతున్నందున వయోధికులకు ఈ పరిస్థితి ఎదురవుతోంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు పూర్వ వైభవం వచ్చినపుడే వృద్ధులకు గౌరవం పెరుగుతుంది. అన్నింటికన్నా కుటుంబ సభ్యుల ఆదరణే వారికి కొండంత అండ అన్న సంగతిని విస్మరించరాదు.

# ఉద్దిష్టమైనది మాస శివరాత్రి


మాస శివ రాత్రి. ప్రతి నెలా వచ్చే మన శివుని పండుగ. శివుని జన్మ తిథిని అనుసరించి ప్రతి నెలా కృష్ణ పక్షం చతుర్దశి నాడు ఆ భోళా శంకరుని ఉద్దేశించి చేసుకునే పూజ. ఈ రోజున ఉపవాసం, ప్రదక్షిణాలు ప్రత్యేకముగా, విశిష్టముగా ఉంటాయి. చంద్రమా మనసో జాతః అని పెద్దలు చెపుతూ ఉంటారు. అంటే చంద్రుడు మన మనస్సుకు కారకుడు. చంద్రుడు క్షీణ దశలో ఉన్నప్పుడు కేతువు ప్రభావము ఎక్కువగా ఉంటుంది. అందుకే ఆ చంద్రుడిని తల పైన పెట్టుకున్న చంద్రశేఖరుని శరణు వేడడం సదాచారం. ఓం నమఃశ్శివాయ అనే పంచాక్షరీ మహామంత్రం యజుర్వేదం రుద్రాధ్యాయం లోనిది. 'న, మ, శి, వ, య. మంత్రం' 'ఓం' కారంతో ప్రారంభం అవుతుంది. ఓం... మహాబీజాక్షరం. 'న' అనేది భగవంతునిలోని కాంతిని తెలియ చేస్తున్న ఈ పంచాక్షరాలను పంచభూతాలు అని కూడా అంటారు. న అంటే భూమి, మ అంటే నీరు, శి అంటే నిప్పు, వ అంటే గాలి, య అంటే ఆకాశం అని ఈ మంత్రంలో ఉన్న అక్షరాలకు నిర్వచనం చెప్పారు. ఈ మంత్రోచ్చారణ పంచ భూతాల సంబంధంగా చెపుతారు. న అంటే భూమి, మ అంటే నీరు, శి అంటే నిప్పు, వ అంటే గాలి, య అంటే ఆకాశం అని ఈ మంత్రంలో ఉన్న అక్షరాలకు వివరణ ఇచ్చారు. మానవ శరీరం పంచభూతాత్మకం. నమశ్శివాయ అనే అయిదు అక్షరాలను పలికినప్పుడు పంచ భూతాలతో నిండిన శరీరం శుభ్రమవుతుంది. ఒక్కో అక్షరం ఒక్కో భూతాన్ని శుభ్రం చేస్తుంది. 'న' భూమికి సంబంధించిన భాగాలను, 'మ' నీటికి సంబంధించిన భాగాలను, 'శి' అగ్నికి సంబంధించిన భాగాలను, 'వ' గాలికి సంబంధించిన భాగాలను, 'య' ఆకాశానికి సంబంధించిన భాగాలను పరిశుభ్రం చేస్తాయి. భోళా శంకరుడు అభిషేక ప్రియుడు నాలుగు చుక్కల నీరు పోసి, మూడు దళాలు ఉన్న బిల్వ దళం మనసారా పెడితే సంతోషించి వరాలనిచ్చే వరదుడు. శివభక్తుడైన సౌనంద గణేశ ముని ఒకసారి యమ లోకానికి వెళ్లగా యమధర్మరాజు ఆయనను సత్కరించి, వచ్చిన కారణమేమిటని అడిగాడు. తాను యమలోకంలోని



విశేషాలను చూడడానికి వచ్చినట్లు ముని చెప్పారు. దీంతో తన లోకంలో నరక యాతనలు అనుభవిస్తున్న పాపాత్ములను యముడు ఆ మునికి చూపించాడు. వారి పరిస్థితికి జాలిపడిన ఆ మహర్షి.. ఓ జనులారా! ఇది 'ఓం నమశ్శివాయ' అనే మంత్రం దీనిని ఉచ్చరిస్తే మీ యాతనలు పటాపంచలవుతాయని తెలిపారు. ముని చెప్పగా వారంతా పంచాక్షరిని జపించారు. దీంతో వారికి నరక విముక్తి లభించి, అంతా కైలాసం చేరుకున్నారట. అధికార గర్వముతో దుర్వాస మహర్షిని అవమానించిన దేవేంద్రుడు ఆ మహానుభావుని శాప కారణంగా తన సమస్త సంపదలు సముద్రం పాలు అవ్వడం చూస్తూ ఉండి పోయాడు. మందర పర్వతమును కవ్వముగా, వాసుకిని తాడుగా చేసుకుని క్షీర సాగరమును మధించినప్పుడు ముందుగా లోకాలన్నిటినీ భస్మం చేస్తుందా అని అనిపించేలా ఉగ్రతతో హాలాహలం పుట్టింది. అమ్మవారి అనుమతి తీసుకుని ఆ లోకాధారుడు ఆ కాలకూట విషయాన్ని తాను స్వీకరించి లోకాలను కాపాడాడు. క్షీరసాగర మధనం మరలా కొనసాగేలా చూసాడు. తన లోపల ఉన్న లోకాలకు కష్టం కలగకుండా గొంతులోనే నిలుపుకుని శ్రీకంఠుడు, గరళకంఠుడు, నీలకంఠుడు అయ్యాడు. శివుడికి ఈ రోజును ప్రీతి పాత్రమైన రోజున శివుడికి అభిషేకాలు, పూజలు చేయడం వలన కోరిన కోర్కెలు నెరవేరుతాయి అని ప్రతీతి. శివరాత్రి అనగా శివుని జన్మదినం (లింగోద్భవం) అని అర్థం. శివుని జన్మ తిథిని అనుసరించి ప్రతి నెలా జరుపుకునేదే మాస శివరాత్రి. మహాశివుడు లయ కారకుడు. లయానికి (మృత్యువునకు) కారకుడు కేతువు. అమావాస్యకు ముందు వచ్చే చతుర్దశి సమయంలో చంద్రుడు క్షీణించి ఉంటాడు. చంద్రమా మనసో జాతః అనే సిద్ధాంతము ప్రకారము చంద్రుడు క్షీణ దశలో ఉన్నప్పుడూ జీవులపై ఈ కేతు ప్రభావము ఉండటము వలన వారి వారి ఆహారపు అలవాట్లపై ప్రభావము చూపడం వలన జీర్ణశక్తి మందగిస్తుంది. తద్వారా మనస్సు ప్రభావిత మవుతుంది. మాస శివరాత్రి నాడు ఉపవాసము ఉండి, వీలైతే శివాలయ దర్శనం చేసుకొని, శక్తి మేర 3, 5, 11, 18, 21, 54, 108 ఇలా ప్రదక్షిణలు చేయవచ్చు. అదేవిధంగా ఆరోజు ప్రదోష వేళ శివునకు మారేడు దళములతో లేదా కనీసము గంగా జలముతో అభిషేకాది అర్చనలు చేయడము మంచిది. ఇవేమీ చేయడానికి అవకాశములేని వారు, ఆరోగ్యవంతులు, అలాగే గృహములో అశౌచ దోషము లేనివారు ఈ రోజు ఉపవాసము ఉండడం చేయాలి. శివనామ స్మరణ చేస్తూ సాయంకాలం ప్రదోష సమయంలో శివునికి అభిషేకం చేయాలి. అభిషేకానంతరం, బిల్వాష్టోత్తరం చెపుతూ బిల్వ దళాలను శివునికి అర్పించాలి. కనీసం ఉపవాసం ఉండి, సాయం కాలం శివాలయానికి వెళ్ళి దీపారాధన చేసి పంచాక్షరీ మంత్రమైన ఓం నమః శివాయను జపించడం కూడా మంచిది. పన్నెండు మాస శివరాత్రులలో ఏ శివరాత్రికైనా సత్కర్మలు చేయడం వల్ల సత్ఫలితాలు పొందుతారు.



## ధడేల్ అంతిమ యాత్రలో పాల్గొన్న డాక్టర్ శ్రీకాంత్....



**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్:** అల్లవరం మండలం దేవగుప్తం గ్రామాని కి చెందిన వైఎస్సార్సీపీ సీనియర్ కార్యకర్త, నాయకుడు, పార్టీ అంటే ప్రాణం గా భావించే వ్యక్తి వెంకటేశ్వరరావు (ధడేల్) ఆరోగ్య పరిస్థితి గత కొంత కాలంగా బాగోడంలేదు . అయితే బుధవారం అమలాపురం లో ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న అమలాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్ కుటుంబసభ్యులను పరామర్శించి ఆయన పార్థిహ దేహానికి నివాళులు అర్పించి జెండా కప్పి అంతిమ యాత్ర లో పాల్గొని వీడ్కోలు పలికారు. ఆయనతో పాటుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు ,ఎంపీపీ ఇళ్ల శేషారావు ,మండల అధ్యక్షులు కొనుకు బాపూజీ ,సర్పంచ్ సాధనల వెంకటరావు,కుడిపూడి బాబు ,చింత రామకృష్ణ, సాధనాల శ్రీను,నాతి శ్రీను ,సూర్యప్రకాశ్ ,తిక్క ప్రసాద్,జేమ్స్ ,పెనుమల విక్రమ్ గారు,మరియు అధిక సంఖ్యలో పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత పుర ప్రజల బాధ్యత...

### కమీషనర్ టివి రంగారావు...




**మండపేట టౌన్... విశ్వం వాయిస్ న్యూస్...** మండపేటలో దోమల నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.మండపేట పురపాలక సంఘ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, మున్సిపల్ కమిషనర్ టి.వి. రంగారావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా టౌన్ పరిధిలో వార్డులలో దోమల నివారణ కోసం దోమల పిచికారీ మందులు స్ప్రేయింగ్ చేశారు. మున్సిపల్ మేనేజర్ బి. రవి కిరణ్, శానిటరీ ఇన్స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు ఆద్వర్యంలో పట్టణంలో దోమల నివారణ చర్యలకై డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాలు నిర్వహించారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలలో ఎప్పటికప్పుడు శుభ్రం చేయించారు . ప్రతి ఇంటి వద్ద పూలకుండీలు వాడేసిన కొబ్బరి బొండాలు, రిఫ్రిజిరేటర్లు పాత టైర్లలో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త విడదీసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని కోరారు. ప్లాస్టిక్ బదులుగా పునర్వినియోగం చెందే వస్తువులను ఉపయోగించాలన్నారు. మున్సిపల్ కార్యాలయం నుండి ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వార్డు శానిటేషన్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు, వార్డు హెల్త్ సెక్రటరీలు, పబ్లిక్ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

## ఆ వార్త తప్పు తోటపేట పంచాయతీ సెక్రెటరీ




**రామచంద్రపురం మండలం విశ్వం వాయిస్ న్యూస్ :-** ద్రాక్షారామ.తోటపేట పంచాయతీలోని పారిశుధ్య కార్మికుల జీతాల సొమ్ము తోట పేటకు చెందిన గ్రామ పెద్ద దామిశెట్టి గంగా పురుషోత్తం వద్ద ఉందని ఆ కారణంగానే పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించలేదని వార్త అవాస్తమని, తోటపేట పంచాయతీ సెక్రెటరీ లిఖితపూర్వక వివరణ ఇచ్చారు.ఒక పత్రికలో వచ్చిన వార్త అవాస్తవమని అందులో ఎలాంటి నిజం లేదని, గ్రామ పెద్ద గంగా పురుషోత్తం పంచాయతీ వారికి,కార్మికులకు ఎలాంటి అవసరం వచ్చిన తన సొంత నిధులను అందజేసి కార్మికుల అవసరాలు తీర్చే వారిని పంచాయతీ సెక్రెటరీ వివరణ ఇచ్చారు.ఒక పత్రికలో వచ్చిన వార్తపై ఈవోపీఆర్డి సెలెట్ రాజు విచారణ నిర్వహించి గ్రామ పెద్ద దామిశెట్టి గంగా పురుషోత్తం మరియు గ్రామంలోని పంచాయతీ కార్మికులను విచారించి ఈ విషయంలో పంచాయతీకి అండగా నిలుస్తూ అభివృద్ధికి తన వంతు సహకారం గంగా పురుషోత్తం అందిస్తున్నారని వివరించారు.పారిశుధ్య కార్మికులు కూడా సమయానికి జీతాలు రాకపోతే గంగా పురుషోత్తం తన డబ్బును సర్దుబాటు చేసే వారిని పంచాయతీ కార్మికులు కూడా వివరించారు. పంచాయతీ కార్యదర్శి ఒక పత్రికలో వచ్చిన వార్త పూర్తిగా నిరాదారమని, తప్పుడు కదనమని వ్రాతపూర్వకంగా వివరణ ఇచ్చారు.

## మా నాయకుడుపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదు

అల్లవరం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.



**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్:** అల్లవరం మండల వైస్సార్సీపీ మండల అధ్యక్షులు కొనుకు బాపూజీ అధ్యక్షతన అల్లవరం లో మండల ముఖ్య నాయకుల మీడియా సమావేశం నిర్వహించారు. ఇటీవల నెల్లూరు జిల్లా కి చెందిన రౌడీ షీటర్ శ్రీకాంత్ పెరోల్ వ్యవహారం లో అరుణ అనే మహిళ అమలాపురంనియోజకవర్గం వైస్సార్సీపీ కో ఆర్డినేటర్ డా.పినిపే శ్రీకాంత్ ని సంప్రదించి డబ్బులు ఇచ్చినట్టుగా మహా న్యూస్ ఎలక్ట్రానిక్ మీడియా కథనం లో పేర్కొంది.ఈ నిరాధార ఆరోపణలను మండల నాయకులు కొనుకు బాపూజీ, యిళ్ల శేషారావు, మండల నాయకులు తీవ్రంగా ఖండించారు. వైస్సార్సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు నాతి శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు జిల్లా ల ఎస్పీ లు, నెల్లూరు జిల్లా జైలు సూపరిండిండెంట్ తిరస్కరించిన పె రోల్ రాష్ట్ర హోమ్ శాఖ సంయుక్త కార్యదర్శి ద్వారా ఎలా ఇచ్చారో ప్రభుత్వం సమాధానం చెప్పాలి డిమాండ్ చేశారు. అయినా అరుణ క్యారెక్టర్, ఆక్టివిటీస్ గురించి కథనాలు ప్రచారం చేస్తున్న మహా న్యూస్ వారు అటువంటి క్రెడిబిలిటీ లేని మహిళ మాటలు నమ్మి ఆధారాలు లేకుండా డా. పినిపే శ్రీకాంత్ పై ఆరోపణలు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.అలాగే జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చింతా రామకృష్ణ మాట్లాడుతూ మా నాయకులు పై లేని పోనీ నిరధారమైన ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అలాగే వైస్సార్సీపీ నాయకులు ఉంద్రు బాబ్జి మాట్లాడుతూ ఆరోపణలు చేయడం కాదు ఆధారాలు ఉంటే బయట పెట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు.ఈ సమావేశం లో పల్లి జేమ్స్ రాజు, బొంతు శ్రీను, పులుసుగంటి శ్రీను, రేవు సుందర రావు, కుంచే సుబ్బు,పోతుమూడి చినబాబు, కొనుకు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 26 వరకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ ప్రక్రియ

**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025 – 26 కు గాను డిగ్రీ లో ప్రవేశానికి అడ్మిషన్ ప్రక్రియ జరుగుతుంది. రామచంద్రపురం పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థిని విద్యార్థులు డిగ్రీలో చేరడానికి విద్యార్థులను హ్వానిస్తున్నారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని కళాశాలలో బి.ఎ,బీకాం, బీఎస్సీ విభాగలలో విద్య అందిస్తున్నారని అన్నారు.ప్రవేట్ విద్యా సంస్థలలో కంటే ఉన్నత మైన విద్యను అందించడానికి అనుభవం కలిగిన అధ్యాపకులు వున్నారని ఇది గమనించి విద్యార్థులు అందరూ కూడా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరడానికి ముందుకు రావాలని తెలియజేశారు.అలానే కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూ ద్వారా ఉద్యోగ,ఉపాధి అవకాశాలు పొందవచ్చు అని తెలిపారు.అడ్మిషన్స్ కన్వీనర్ డాక్టర్ రమణ విద్యార్థుల్ని జాతీయ స్థాయిలో అనేక పోటీలకు తీసుకు వెళ్లడం జరుగుతుందని,ఆసక్తి వున్న విద్యార్థులు తమ ప్రతిభ ద్వారా ఉన్నత మైన భవిష్యత్ కు పునాధులు వేసుకోవచ్చు అని అన్నారు.వారికి కావాల్సిన ఉన్నత చదువులకి కూడా అవగాహన సదస్సులు నిర్వహించి విద్యార్థులను భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఉంచడానికి కళాశాల ఎప్పుడు ముందంజలో ఉంటాదని తెలియజేశారు.డిగ్రీలో ప్రవేశం పొందడానికి ఈ నెల 20వ తారీకు నుంచి 26వ తారీకు వరకు మాత్రమే సమయం వున్నదని విద్యార్థిని, విద్యార్థులు త్వరపడాలన్నారు.

## ఫించన్లు తొలగింపుపై ప్రభుత్వం పునరాలోచించాలి

### టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సల్మాన్ హుస్సేన్....



**మండపేట టౌన్... విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వం హడావిడిగా తలపెట్టిన పింఛన్లు ఏరివేత ప్రక్రియ రూల్స్ ప్రభుత్వం కి చెడ్డ పేరు వస్తుందనీ టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సల్మాన్ హుస్సేన్ అన్నారు. ప్రభుత్వం పింఛన్లుపై నిర్ణయం సవరించుకోవాలన్నారు. దీనిపై ప్రతిపక్షాలకి ఆయుధాలు ఇచ్చినట్లు ఉందన్నారు. పింఛన్లు మీద బతికే అభాగ్యులు ఆర్తనాదాలు ప్రభుత్వంకి మంచిది కాదన్నారు. ఈ వయసులో వారిని హాస్పిటల్ చుట్టూ ఆఫీస్ లు చుట్టు తిప్పడం భావ్యం కాదన్నారు. పెద్ద మనసు చేసుకుని అభాగ్యులు కి భరోసా గా ఉండాలని కోరారు అనర్హులు పింఛన్లు తీసుకుంటున్నారని భావిస్తే తీసేయ్యడం భావ్యమే గాని ఇంత హడావుడిగా తీసేసి వారిని తిరిగి ఆఫీసులు హాస్పిటల్ లు చుట్టూ తిప్పడం భావ్యం కాదన్నారు. వెరిఫికేషన్ చేసిన డాక్టర్ లు చాలామందికి అసలు చూడకుండానే పంపివేశారని పింఛను బాధితులు చాలామంది ఆరోపణ చేస్తున్నారని పేర్కొన్నారు. పింఛన్లు షరతులు సులభతరం చేయాలన్నారు. మనవతాదృక్పదం తో ఆలోచించి పింఛన్లు తీసుకునే అభాగ్యులు పై కరుణ చూపాలని కోరారు. సూపర్ సిక్స్ హామీలు సక్సెస్ గా అమలు చేసి ప్రజల్లో మంచి ప్రభుత్వం మంచి వాతావరణం ఏర్పడిన తరుణంలో పింఛను ఏరివేతే ప్రభుత్వ వ్యతిరేక ధోరణి అవుతుందన్నారు.

## పచ్చ జెండా ఊపి జన జాగృతి రథం ప్రారంభించిన ఏలూరు రేంజ్ ఐజిపి




**అమలాపురం., జిల్లా ప్రతినిధి విశ్వం వాయిస్ న్యూస్ ఆగస్టు 20** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,అమలాపురం లో కోనసీమ జిల్లా ఎస్పి బి.కృష్ణారావు వారి ఆధ్వర్యంలో మహిళల భద్రత మరియు సైబర్, ఇతర నేరాలపై అవగాహన కొరకు "జన జాగృతి రథం" ను అమలాపురంలో ఆవిష్కరించిన ఏలూరు రేంజ్ ఐ జి పి జి.వి.జి అశోక్ కుమార్ ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులని బట్టి నేరం జరిగిన తర్వాత తీసుకునే చర్యలు కన్నా నేరాలు జరగకుండా ప్రజలు జాగ్రత్త పడవలసిన అవసరం ఉందని తద్వారా జరగబోయే నష్టాలు నివారించవచ్చునని మరియు జాతరలు, పండుగలు, పెద్ద పెద్ద ప్రోగ్రాములు జరిగేటప్పుడు ప్రజలకు ఈ "జన జాగృతి రథం" ద్వారా విస్తృత స్థాయిలో అవగాహన వీడియోలు ప్రదర్శించడం జరుగుతుందని తద్వారా నేరాలు జరగకుండా ప్రజలు తగిన జాగ్రతలు తీసుకుని అప్రమత్తతో మెలగాలని సూచించారు. ఈ సందర్భంగా ఏలూరు రేంజ్ ఐ జి పి జి.వి.జి అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా స్కూల్స్,కాలేజెస్ లో జరుగుతున్న నేరాల మీద విద్యార్థులకు ముఖ్యంగా అమ్మాయిలకు అవగాహన వుండాలని, మహిళలు పిల్లల మీద జరిగే ఆకృత్యాల మీద మహిళలకు పిల్లలకు అవగాహన ఉండాలని చెప్పడం ద్వారాగా కాకుండా చూడడం ద్వారా ఎక్కువగా గ్రహిస్తారని జన జాగృతి రథం ద్వారా జిల్లాలో నలుమూలల ముఖ్యమైన కూడళ్లలో, జాతర్లు, ఉత్సవాలు సమయములో, రద్దీ ప్రదేశాలలో మహిళలపై ఆకృత్యాల పై సైబర్ క్రైమ్ మీద మరియు ఇతర నేరాల మీద అవగాహన కల్పిస్తూ వీడియోలను ప్రదర్శించడం జరుగుతుందని తద్వారా ప్రజలను చైతన్యవంతులుని చేయవచ్చని తెలిపినారు. అంతేకాక శక్తి టీమ్స్ జిల్లాలో విస్తృతంగా పనిచేస్తున్నాయని, శక్తి టీమ్స్ వారు ఎల్లవేళల అందుబాటులో ఉంటారని, విద్యార్థినిలు మరియు మహిళలు శక్తి టీమ్స్ సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేసారు. ఈ వాహనం ఏర్పాటులో సహాయ సహకారాలు అందించిన ఓఎన్జిసి రాజమండ్రి వారికి మరియు స్వచ్ఛంద సంస్థ అయిన స్నేహిత ఎన్జీవో ఇంచార్జ్ స్వర్ణలత కి జిల్లా ఎస్పి కృతజ్ఞతలు తెలిపినారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏలూరు రేంజ్ ఐజిపి జి.వి.జి అశోక్ కుమార్ , జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు జిల్లా అదనపు ఎస్పీ ఎ.వి.ఆర్.పి.బి.ప్రసాద్ , అమలాపురం సబ్ డివిజన్ డిఎస్పి టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ , రామచంద్రాపురం సబ్ డివిజన్ డిఎస్పి బి.రఘువీర్ , ట్రైనీ డిఎస్పి ప్రదీప్తి , ఓఎన్జిసి రాజమండ్రి లేఫ్నెంట్ కల్నల్ కులదీప్ సింగ్ (సెక్యూరిటీ ఇంచార్జ్), స్నేహిత ఎన్జీవో ఇంచార్జ్ స్వర్ణలత మరియు అమలాపురం టౌన్, రూరల్ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది హాజరైనారు.

## అవార్డు అందుకున్న డాక్టర్ రామకృష్ణ



**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ :-** రామచంద్రపురం పశు సంవర్ధక శాఖ,సహాయ సంచాలకులు,డాక్టర్ రామకృష్ణ 79 వ స్వతంత్ర దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్రస్థాయిలో ప్రతిష్టాత్మక అవార్డును విజయవాడలో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ దామోదర్ నాయుడు మరియు ఎడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వై సింహాచలం,ఐ రత్నకుమారి,రజిని కుమారి అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎల్ అనిత చేతుల మీదుగా అందుకున్నారు. రామచంద్రపురం నియోజవర్గంలో రైతులకు అందించిన కిసాన్ క్రెడిట్ కార్డ్స్ మరియు సెక్స్ సార్టెడ్ సెమెన్,వరద ముంపు ప్రాంతాల్లో అందించిన వైద్య సేవలు మరియు పశువుల దానా, పశు నష్ట పరిహారం, అత్యధిక మినీ గోకులాలు, రైతులకు అందించినందుకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రధానం చేయడమైనది. ఈ అవార్డు రావడం పట్ల పశు వైద్యులు మరియు పశు వైద్య సిబ్బంది తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు.

## అంబాజీపేటలో ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ పునర్నిర్మాణం చేయండి



**అంబాజీపేట / అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్:** అంబాజీపేటలో శిథిలావస్థలో ఉన్న ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ త్వరలో పునర్ నిర్మాణం చేయాలని అంబాజీపేట మాలమహానాడు నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్ ని కోరారు. అమలాపురం ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు . డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అనేకమంది ఎస్సీ నిరుద్యోగ యువకులు ఉన్నారని, అయితే ప్రస్తుతం కార్పొరేషన్ ద్వారా ఆన్లైన్లో కేవలం 32 సబ్సిడీ యూనిట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని అంబాజీపేట మాల మహానాడు నాయకులు తెలిపారు. ఇది సరిపోవడం లేదని, చేతివృత్తులు చేసుకునే వారికి టెంట్ హౌస్, కొబ్బరి వ్యాపారం, సెంట్రింగ్ వంటి రంగాల్లో రుణాలు అదనంగా ఇవ్వాలని మాల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్ ని కోరారు. 30 సంవత్సరాల క్రితం అంబాజీపేటలో నిర్మించిన ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ ఇప్పుడు శిథిలావస్థలో ఉందని, దానిని తొలగించి, కొత్త షాపింగ్ కాంప్లెక్స్ను ఎస్సీ యువతకు అందుబాటులోకి తేవాలని మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్ కి వినతిపత్రం అందజేశారు. సందర్భంగా విజయ్ కుమార్ స్పందిస్తూ, త్వరలోనే సంబంధిత అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈసమావేశంలో నాగవరపు నాగరాజు, నూక పెయ్యి చిన్న, నెల్లి వెంకటరమణ, నాగబత్తుల సుధాకర్, చింతపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత అంబాజీపేట మాల మహానాడు నాయకులు మాల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్ ని ఘనంగా సన్మానించారు.

## ప్రపంచ దోమల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న విజయలక్ష్మి.




**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్:** అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామపంచాయితీ పరిధిలో పల్లిపాలెం ఏరియా నందు బుధవారం గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ర్యాలీని నిర్వహించడం జరిగినది. దోమలకి సంబంధించి వ్యాధులు డెంగ్యూ, మలేరియా, పైలేరియా మొదలగు వ్యాదుల పట్ల ప్రజలకు అవగాహణ కల్పించారు .ఈ కార్యక్రమములో వార్డు సభ్యులు చింతం శ్రీనివాస్ , పంచాయితీ కార్యదర్శి బి.ఆదిశంకరం, హెల్త్ సూపర్ వైజర్ ఎస్.సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ వి.సత్యనారాయణ, ఎంఎల్హెచ్పిలు రకాప సౌమ్య,నల్లి విజయకుమారి, ఏఎన్ఎంలు ఉమా భవాని, బేబీ దుర్గా మరియు ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, గ్రామసచివాలయం సిబ్బంది, గ్రామపంచాయితీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట శిబిరంపై పోలీసులు దాడి

### 8మంది అరెస్ట్ 13 వేల 500రూపాయల నగదు స్వాధీనం

**విశ్వం వాయిస్ న్యూస్ రావులపాలెం** రావులపాలెం మండలం కొమర్రాజు లంక శివారు పబ్లిక్ ప్రదేశంలో పేకాట ఆడుతున్నట్లు రావులపాలెం ఎస్సై కేవీ రమణారెడ్డి వారికీ రాబడిన సమాచారం మేరకు సిబ్బంది సహాయంతో వెళ్ళగా అక్కడ ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద 13500 స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసినట్లు రావులపాలెంఎస్ ఐ కె.వి.రమణ రెడ్డి తెలిపినారు.

## కుమారస్వామిని పరామర్శించిన పినిపే శ్రీకాంత్.



**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్:** అల్లవరం మండలం ఓడలరేవు గ్రామ వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకులు మధుర కుమారస్వామి రెండు మోకాళ్ళు కు చస్త్ర చికిత్స చేయించుకుని స్వగృహం వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న అమలాపురం వైఎస్ఆర్సిపి నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ , ఎంపీపీ ఇళ్ల శేషారావు కుమారస్వామి ని బుధవారం పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితులను, యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీకాంత్ తో పాటుగా మల్లాడి ఉమా మహేశ్వరరావు , పెచేట్టి బాబ్జీ , మల్లాడి భాను , పెచ్చెట్టి నరసింహ రాజు , చిలకలపూడి యేసుబాబు ,పాలేపు లక్ష్మణ్ గారు, దడాల రాజశేఖర్ ,దండుప్రోలు రాంబాబు , తాతయ్యి గారు, మధుర శేఖర్ ,బొంతు షణ్ముఖ , నల్లి ఏడుకొండలు, ఆయన్ని పరామర్శించిన వారిలో ఉన్నారు.

# కటకంశెట్టి బాబి పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు

**కాకినాడ రూరల్ : విశ్వం వాయిస్ న్యూస్.** బుధవారం కాకినాడ రూరల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కో కో ఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాబీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా కటకంశెట్టి బాబీ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. అనంతరం కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట గ్రామానికి చెందిన కోలాటం కళాకారులకు కటకంశెట్టి బాబి నూతన వస్త్రాలను అందజేశారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ నాయకులు మందార చిట్టిబాబు ఆధ్వర్యంలో అచ్చంపేట జంక్షన్ లో గల రెడ్ క్రాస్ గ్రీన్ ఫీల్డ్ అందుల పాఠశాలలో విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి విద్యార్థులకు తినిపించారు. అనంతరం విద్యార్థులకు భోజనాలు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కటకంశెట్టి బాబీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి జీవితంలో జరిగే వేడుకలను సేవా కార్యక్రమాల రూపంలో జరుపుకోవాలని ద్వారా



ఎదుటివారి కళ్ళలో ఆనందం చూసిన వారమవుతామని అన్నారు. తన పుట్టినరోజు ను ఇటువంటి సేవా కార్యక్రమాల రూపంలో జరుపుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. తన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు



తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కటకంశెట్టి బాబి అభిమానులు పాల్గొన్నారు.

## మండల టిడిపి అధ్యక్షులు జీనుమణి బాబుని ఘనంగా సత్కరించిన శ్రీ శిరిడి సాయి టైలర్స్ యూనియన్



**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** స్థానిక జీవీఆర్ అపార్ట్మెంట్ లో జగ్గంపేట మండల టిడిపి అధ్యక్షులు జీను మణి బాబునుజగ్గంపేట శ్రీ శిరిడి సాయి టైలర్స్ యూనియన్ అధ్యక్షులు కింతాడ వెంకటరమణ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులందరూ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జీను మణిబాబు మాట్లాడుతూ టైలర్ అసోసియేషన్ జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ అసోసియేషన్ భవనం నిర్మించారని దానికి ఇంకా ఏమైనా అవసరాలు ఉంటే ప్రభుత్వం ద్వారా అందించడం జరుగుతుందని అన్నారు. టైలర్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ఇల్లు లేని టైలర్స్ కు ఇళ్ల స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకునేందుకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ సహకారంతో ఏర్పాటు చేయించాలని జీను మణి బాబును కోరారు. ఈ కార్యక్రమంలో టైలర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సింగవరపు శ్రీనివాస్ (%%4 టైలర్) సెక్రెటరీ కేసు బోయిన నాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ నీలపల్లి వాసు, గౌరవ అధ్యక్షులు వాకా నాగిరెడ్డి, బొడ్డు కొండ శ్రీను జిల్లా వైస్ ప్రెసిడెంట్, ఆది మూలం ప్రసాద్, తుమ్మల కిషోర్, జీలం అప్పారావు, సుధా కృష్ణ, కాము సురేష్, ఏ కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారాయి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుతున్న ఎక్సైజ్ పోలీసులు



**కాకినాడ జిల్లా, విశ్వం వాయిస్:** కాకినాడ జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ కాకినాడ నార్త్ పరిధిలోని సామర్లకోట మున్సిపాలిటీకి చెందిన బ్రౌన్ పేట, బలుసుల పేట, గాంధీనగర్ వార్డులను నాటు సారాయి రహిత వార్డులుగా ప్రకటిస్తున్నట్లు ఎక్సైజ్ సి ఐ కే రామ్మోహన్రావు తెలిపారు. వివరాలు ప్రకారం సామర్లకోట మున్సిపల్ పరిధిలోని మూడు వార్డులను బుధవారం నాటు సారాయి రహిత గ్రామాలుగా ప్రకటించినట్లు కమిటీ సభ్యులు మరియు ఎమ్మార్వో చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐకే రామ్మోహన్రావు, ఎమ్మార్వో చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ తహసిల్దార్, ఎస్సై ఎంవివిబి కుమార్, హెడ్ కానిస్టేబుల్ వి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ పిట్ట సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ జిల్లాకు మల్లాడి సత్యలింగం నాయకర్ నామకరణం చేయాలి

**తాళ్ళరేవు, విశ్వంవాయిస్:** కాకినాడ జిల్లా తాళ్లరేవులో ఐక్య కాకినాడ జిల్లా పేరు మార్పు చేయాలని డిమాండ్ చేస్తూ మహా సమితి అధ్యక్షులు వైదాడి నూకరాజు ఆధ్వర్యంలో గతవారం క్రితం జిల్లాల కమిటి చైర్మన్ మరియు జనసేన అధినేత పార్టీ ఆఫీస్ కు వెళ్ళి వినతి పత్రం అందజేశారు. బుధవారం తాళ్లరేవు మండల తాసిల్దార్ కలిసి వినతిపత్రం ఇవ్వడం మరియు గాడిమొగ పంచాయితీ లక్ష్మీపతిపురం పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ట కు విచ్చేసిన ముమ్మిడివరం శాసన సభ్యులు దాట్ల సుబ్బరాజుఐక్య మహా సమితి అధ్యక్షులు శ్రీ వైదాడి నూకరాజు టీమ్ తో వెళ్లి కలవడం జరిగిందని అన్నారు. "విద్యాదాత" సత్యలింగం నాయకర్ పేరు కాకినాడ జిల్లాకు పెట్టాలని జిల్లా మంత్రివర్గ అధ్యక్షులకు తమరి ద్వారా వినతి పత్రం అందచేయాలనీ కోరడం వారు కూడా విద్యాదాత ట్రస్ట్ కోసం మాట్లాడుతూ సత్య లింగం నాయకర్ అని కొనియాడారు. అలాంటి మహనీయులకు కాకినాడ జిల్లాకు నామకరణం చేయటానికి తప్పకుండా సహకరిస్తామన్నారు. అందుకు ఐక్య మహా సమితి సభ్యులుఎమ్మెల్యే దాట్లకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎక్సైజ్ దాడుల్లో నాటు సారాయి విక్రయతల అరెస్టు



**కాకినాడ జిల్లా, విశ్వం వాయిస్:** కాకినాడ జిల్లా అసిస్టెంట్ కమిషనర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కాకినాడ వి. రేణుక ఆధ్వర్యంలో ప్రత్తిపాడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శంఖవరం మండలం, రాజవరం గ్రామంలో విస్తృత దాడులు నిర్వహించి, మూడు వేల లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 50 లీటర్ల నాట్ సారాయి నీ స్వాధీనం చేసుకొని, ఒక వ్యక్తిని అరెస్టు చేసి పారిపోయిన ఇంకొక వ్యక్తిని కూడా గుర్తించి కేసు నమోదు చేయడమైనది. ఎవరైనా నాటుసారా కలిగి ఉన్న, త్రాగిన, రవాణా చేసిన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని అసిస్టెంట్ కమిషనర్ వీ రేణుక తెలియజేశారు. ఈ దాడులలో స్వయంగా అసిస్టెంట్ కమిషనర్ వి. రేణుక , ఏ ఈ ఎస్ వి రామకృష్ణ, సిఐ స్వామి, ఎస్సై కళ్యాణి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభల పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లాజగ్గంపేట ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుభందం కాకినాడ జిల్లా రెండవ మహాసభలు సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 రెండు రోజుల పాటు జరగనున్నాయని, ఈ సందర్భంగా మహాసభల పోస్టర్ ను స్థానిక రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ కార్మికుల ప్రయోజనాలకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మహాసభలు జయప్రదానికి తన వంతు సహకారాలు పూర్తిస్థాయిలో అందిస్తానని హామీ ఇచ్చారు. ఈనెల 23వ తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన పెద్దాపురంలో జరుగుతున్న సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందించే ఏర్పాటును ఎమ్మెల్యే నెహ్రూ జిల్లా కలెక్టర్ సాగిలి మోహన్ తో చర్చించారు. ఈ సందర్భంగా సంఘం కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షులు చెక్కల రాజ్ కుమార్ మాట్లాడుతూ 2020లో జగన్ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను నిలుపుదల చేస్తూ తీవ్ర అన్యాయం చేశారన్నారు. అప్పటినుండి ఏ ప్రమాదంలో కార్మికుల చనిపోయినా కార్మికుని కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, సంక్షేమ బోర్డు పథకాలు అమలులోకి వస్తే కొంతమేర కార్మికుల ప్రయోజనాలు నెరవేరుతాయని, తక్షణం సంక్షేమ బోర్డు అమలకు ఆటంకంగా ఉన్న జగన్ ఉత్తర్యులు



1214 మెమో సర్కులర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2019 నుండి పెండింగ్ లో ఉన్న క్లైమూల పరిహారాలను కార్మికులకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తకొండ బాబు, శ్రీ వినాయక రావులమ్మతల్లి తాపిమేస్త్రి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు బోరా సత్తిబాబు, ప్రెసిడెంట్ కొల్లి సత్తిబాబు, సెక్రటరీ కెంగం దుర్గాప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ కెంగం బుజ్జి, జనపరెడ్డి రమణ, పైడి యేసు, రామచంద్రపురం సత్తిబాబు, ఎలక్ట్రిషియన్ సంఘం ఈర్లు శ్రీను, సాయి విజయదుర్గ తాపీ మేస్త్రుల సంఘం ప్రెసిడెంట్ నగమళ్ల అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

# వేదం సమాజ శ్రేయస్కరం: విశ్వనాథ గోపాలకృష్ణ.

**కాకినాడసిటీ: విశ్వం వాయిస్ న్యూస్** వేదం సమాజ హితాన్ని శ్రేయస్కరాన్ని కోరుకుంటుందని అందుకే వేదం ప్రతి ఒక్కరు శ్రవణం చేయాల్సిన కర్తవ్యం ఉందని రాష్ట్రపతి అవార్డు గ్రహీత మహా మహోపాధ్యాయ శ్రీ విశ్వనాథ గోపాలకృష్ణ (రాజమండ్రి) అన్నారు .శ్రీమద్ ఆంధ్ర వేద శాస్త్ర పరిషత్ 71వ వసంతాల వేద సభ బుధవారం సాయంత్రం స్థానిక రామారావు పేట లో ఉన్న గాయత్రి మండపంలో పరిషత్ అధ్యక్షులు బ్రహ్మశ్రీ శ్రీరామ భగవతి అధ్యక్షతన జరిగింది. తొలుత గాయత్రి మాత చిత్రపటం ముందు శ్రీ విశ్వనాథ గోపాలకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేశారు .అనంతరం సభలో వేద పండితుల ఉద్దేశించి గోపాలకృష్ణ ప్రసంగించారు. వేదాలు శాస్త్రాల పరమార్థం అందరూ సుఖసంతోషాలతో ఉండాలన్నదే అన్నారు. వేదం బోధించిన మార్గంలో పయనిస్తే అనేక ప్రయోజనాలను మనం పొందగలమని అందరూ బాగుండాలన్నదే వేదాల సారాంశం అని చెప్పారు. సమాజ కళ్యాణం కోరుకునేదే వేదమని వేద విజ్ఞానం అపారమని దానిని అర్థం చేసుకోవడానికి వేదవ్యాస మహాముని చే సామాన్యుల కోసం భారతం వంటి అనేక గ్రంథాలను రచన చేసి అపూర్వ సంపదను అందించారని గోపాలకృష్ణ గుర్తు చేశారు. సనాతన వైదిక ధర్మాలు పాటించే వారిని గౌరవించడం మన అందరి ప్రథమ కర్తవ్యం గా ఆయన ప్రస్తావించారు. వేదాలలో అన్ని విషయాలను ప్రస్తావించబడిందని విపులీకరించారు .

భారత జ్యోతి అవార్డు గ్రహీత శ్రీ దత్తాత్రేయ వేద గురుకుల ప్రధానోపాధ్యాయులు శ్రీ గుల్లపల్లి శ్రీరామచంద్రమూర్తి ఘనపాటి (రాజమండ్రి )మాట్లాడుతూ వేద సభలు నిర్వహించడం ద్వారా సమాజానికి మరియు దేశానికి ఎంతో క్షేమకరమని అన్నారు. వేద పండితులు నడయాడిన ప్రాంతం సుభిక్షంగా సుఖ సంతోషాలతో ఉంటుందని అన్నారు. వేద సభలు వేద పండితులను సత్కరించుకోవడానికి వారిని పోషించుకోవడానికి అన్న భావన మంచిది కాదని జీవితాంతం వేద పరిరక్షణకే వారి జీవితాలను అంకితం చేస్తారని అటువంటి వారిని సత్కరించుకోవడం ద్వారా భగవంతుని అనుగ్రహం తప్పక పొందగలమని శ్రీ సీతారామ చంద్ర ఘనపాటి అన్నారు .లౌకిక



విద్య నభ్యసించేవారు చిన్నతనంలో అభ్యసించిన విద్యను వారి మస్తకములో ఉండదని అయితే వేదాధ్యయనము చేసే వారికి 20 సంవత్సరాల విద్య మస్తకములో ఉండడమే కాక నిత్యము పారాయణం చేయడం ద్వారా ఆ ప్రాంతం అంతా ఆరోగ్యకర వాతావరణం నెలకొనే ఉంటుంది అనడంలో సందేహం లేదని సీతారామచంద్ర ఘనాపాటి అన్నారు .శ్రీమద్ ఆంధ్ర వేద పరిషత్ 71వ వేద సభలో పాల్గొనడం గొప్ప విషయంగా ప్రస్తావిస్తూ ఎందరో మహానుభావులు ఆధ్వర్యంలో నిర్వహించబడిందని గుర్తు చేస్తూ చేసిన ప్రసంగం అందరిని ఆకట్టుకుంది. పరిషత్ అధ్యక్షులు బ్రహ్మశ్రీ శ్రీరామ భగవతి మాట్లాడుతూ త్వరలో కాకినాడలో భారీ ఎత్తున బ్రాహ్మణ గర్జన మహాసభను నిర్వహించ దలిచామని చెప్పారు. కార్యదర్శి చల్లా శ్రీనివాస నిరంజన్ మాట్లాడుతూ వేద పండితులు అధిక సంఖ్యలో పాల్గొన్న ఈ వేద సభలో సమాజలోకహితం కోరుకుంటూ వేద స్వస్తి చేయడం అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు . కార్యక్రమంలో పరిషత్ ఉపాధ్యక్షులు అయ్యగారి వెంకటేష్ ,నందమూరి వినోద్, వద్దిపర్తి సత్య మురళీ రావు, భాను కుమార్ ,కప్పగంతుల వెంకట్, తో పాటు పలువురు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత.... ఈ నెల 30 , 31 , తేదీల్లో ఐ.ఎల్.ఎ రాష్ట్ర సదస్సు....

**కాకినాడ సిటీ:విశ్వం వాయిస్ న్యూస్** రాజ్యాంగాన్ని పరిరక్షణ కై ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐ ఎల్ ఎ) చేస్తున్న కృషి అభినందనీయమని కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరి సుబ్రహ్మణ్యం కొనియాడారు. ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభ పోస్టర్ ను బుధవారం కాకినాడ బార్ అసోసియేషన్ హాలులో ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 30, 31, తేదీల్లో గుంటూరులోని శ్రీ వేంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో జరిగే ఐ ఎల్ ఎ రాష్ట్ర సదస్సు కు న్యాయవాదులు అంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బార్ ప్రధాన కార్యదర్శి చెక్కపల్లి వీరభద్రరావు (చంటి) మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం సదస్సు లో చర్చించడం జరిగుతుందన్నారు. ఐ ఎల్ ఎ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు టీ. పృథ్వీ రాజ్ మాట్లాడుతూ రాజ్యాంగ నైతికత ను పెంపొందించేందుకు తీసుకోవాల్సిన




చర్యలు , బెంచ్ అండ్ బార్ సంబందాల మెరుగు , న్యాయవాదులపై జరుగుతున్న దాడులు , ఐక్యత సమాజంలో అనచివేతకు గురౌతున్న వారి హక్కుల పరిరక్షణ తదితర అంశాలపై చర్చ జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ మాజీ సభ్యులు బి. గోపీకృష్ణ , బార్ మాజీ అధ్యక్షులు జవహర్ అలీ , ముత్తింటి విశ్వేశ్వర రావు , ఐ ఎల్ ఎ జిల్లా కన్వీనర్ వడ్డి శ్రీనివాస్ బాబు , కార్యదర్శి రాగాల శివ , ఉపాధ్యక్షులు కోలా శ్రీహరి రావు , జె వి రమణ , సభ్యులు మంగా వెంకట శివ రామక్రిష్ణ , సీనియర్ న్యాయవాదులు ముద్రగడ వీరబాబు , పిల్లి శ్రీనివాస్ గౌడ్ , పి. ప్రసన్న కుమార్ , కుంచె శ్రీహరి , కంచి కామాక్షీ , ఉమామహేశ్వరి , కళ్యాణి , శ్రీలక్ష్మీ , అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

## జగ్గంపేట ప్రభుత్వ ఐటిఐ మూడవ విడత ప్రవేశ దరఖాస్తుల ఆహ్వానం

**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** ప్రభుత్వ ఐటిఐ జగ్గం పేటలో 2025-26 విద్యాసంవత్సరం మిగిలిన సీట్ల భర్తీకి మూడవ విడత ప్రవేశ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.ఆర్.ఆర్. కృష్ణన్ తెలిపారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఐటిఐ జగ్గంపేటలో ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, సివిల్ ట్రేడ్స్‌లో సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అభ్యర్థులు షెడ్యూల్ ప్రకారం 26-08-2025 సాయంత్రం 5.00 గంటలలోపు %ఠఱ.ఖజూ.స్ర్రశీజ.ఱఅ% వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.దరఖాస్తు చేసినవారు ఆ ప్రింట్ కాపీతో పాటు ఒరిజినల్ సర్టిఫికేట్లు, జతపరచిన ప్రతులు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో జగ్గంపేట ప్రభుత్వ ఐటిఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు. వెరిఫికేషన్ చేయని అభ్యర్థుల దరఖాస్తులు చెల్లవని స్పష్టం చేశారు.వివరాల కోసం 9440262266, 8142345444 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. ముఖ్యంగా ఆన్లైన్ వెరిఫికేషన్ పూర్తయినఅభ్యర్థులంతా కౌన్సెలింగ్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## రూ. 20,000 విలువ చేసే ప్రభుత్వ బియ్యం పట్టివేత

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధి శంఖవరంలోని ఓ ఇంటిలో



అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 20,000 విలువ చేసే ప్రభుత్వ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్నారు. ఈ నేరానికి పాల్పడిన బియ్యం వ్యాపారిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్ తోట మెహర్ సీతారామ సుధీర్ (జనసేన)కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ప్రత్తిపాడు సిఐ, అన్నవరం ఎస్ఐ. ప్రభుత్వ పౌరసరఫరాల అధికారులు కలిసి 19 వ తేదీ రాత్రి 2 గంటలకు స్థానిక కాళ్ళ సత్యనారాయణ అద్దెకు ఉంటున్న ఇంటిలోతనిఖీ చేసారు. పేద ప్రజల వినియోగార్థం ప్రభుత్వం తన పౌర సరఫరాల దుకాణాలకు సరఫరా చేసిన రూ. 19,734 విలువ చేసే 11 బస్తాల్లో నిల్వ ఉంచిన 429 కేజీల బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచడాన్ని అధికారులు గుర్తించారు. శంఖవరం, పరిసర గ్రామాల్లోని రేషన్ కార్డుదారుల నుండి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ ఉంచి అధిక లాభార్జన నిమిత్తం అమ్ముకునే వ్యాపారం చేస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా పంపిణీ వ్యవస్థ నియంత్రణ ఉత్తర్వు 2018, అత్యవసర సరుకుల చట్టం 1995 నందలి నిబంధనలను కాళ్ళ సత్యనారాయణ ఉల్లంఘించినట్లుగా క్రిమినల్ కేసు నమోదు చేశారు. పట్టుని స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ప్రభుత్వ నిబంధనల మేరకు భద్రత నిమిత్తం స్థానికంగా ఉన్న వేరొక ప్రభుత్వ చౌకధరల దుకాణానికి అప్పగించి రసీదు తీసుకున్నారు. ఎవరైనా ప్రభుత్వ బియ్యాన్ని కొనుగోలు చేయడం అక్రమమని, అలాగే నిల్వ ఉంచడం, రవాణా చేయడం నేరమని, ఉల్లంఘించి నట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ప్రత్తిపాడు సిఐ ఓ ప్రకటనలో వ్యాపారులను హెచ్చరించారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




## 25న ఛలో కలెక్టరేట్ ను విజయవంతం చేయండి..

– జిల్లా అధ్యక్షులు వై. భాస్కర్ పిలుపు.



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్.ఎఫ్.ఐ తూర్పు గోదావరి జిల్లా కమిటీ ఆగస్టు 25న ఛలో కలెక్టరేట్ గోడపత్రికను ను ఆర్ట్స్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షులు వై. భాస్కర్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని జిల్లాల్లో చలో కలెక్టరేట్ జరుగుతుందని ప్రధానంగా పెండింగులో ఉన్న 3600 కోట్ల ఫీజు రీయంబెర్స్మెంట్ విడుదల చేయాలని, హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు 3000 పెంచాలని, అద్దె భవనాల్లో నడుస్తున్న హాస్టల్స్ కు సొంత భవనాలు నిర్మించాలని, జీఓ నెం.77 రద్దు చేసి పీ.జి చదివే విద్యార్థులకు ఫీజు రీయంబెర్స్మెంట్ అమలు చేయాలని, యూనివర్సిటీ లో అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, హాస్టల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని దాంతో పాటు హాస్టల్లో కుక్, కమాటీ, వర్కర్లను నియమించాలని, పెండింగులో ఉన్న బిల్లులను విడుదల చేయాలని, ఎయిడెడ్ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, మధ్యాహన భోజన పథకం అమలు చేయాలని, ఈ ప్రధాన డిమాండ్స్ తో చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నా మని తెలిపారు. ఈ డిమాండ్స్ పరిస్కారానికై విద్యార్థి లోకం పెద్ద ఎత్తున కదిలి ఛలో కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయకార్యదర్శి కె. జ్యోతి, ఉపాధ్యక్షులు ఎస్. కనక, కార్తిక్, తేజ, ఆదిత్య, షన్ను దితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ



**విశ్వం వాయిస్ కొవ్వూరు** కొవ్వూరు లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయలో కొవ్వూరు నియోజకవర్గంలోని తాళ్లపూడి మండలంలో అన్నదేవరపేట, గజ్జరం, మలకపల్లి, రావూరుపాడు, పోచవరం, వేగేశ్వరపురం గ్రామాలకు చెందిన 11 మంది లబ్ధిదారులకు రూ. 4,32,974/- ల విలువగల ముఖ్యమంత్రి సహాయానిధి చెక్కులు బుధవారం కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సురపనేని చిన్ని చెన్నా సత్యనారాయణ సిద్ది దుర్గాప్రసాద్, కొక్కిరిపాటి వెంకటేష్ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రతన్ టాటా ఇన్నోవేషన్ ముఖ్య ఉద్దేశం విద్యార్థి దశ నుంచి ఎంటర్ప్రెనర్ గా తీర్చిదిద్దడం - ఏబీఎన్ ఎంపీఆర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం రామ్మోహన్



**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను కొవ్వూరు ఏబీఎన్ అండ్ పిఆర్ఆర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు అధ్యాపకులు ఆన్లైన్ మద్యం ద్వారా వీక్షించారని కళాశాల ప్రిన్సిపల్ ఎం రామ్మోహన్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశాల మేరకు కళాశాలలోని బుధవారం విద్యార్థులు ఆన్లైన్ స్క్రీన్ ప్రొడక్షన్ ద్వారా కార్యక్రమాన్ని వీక్షించారని, ఈ ఇన్నోవేషన్ అప్ యొక్క ముఖ్య ఉద్దేశం విద్యార్థి దశ నుంచి ఎంటర్ప్రెనర్ గా తీర్చిదిద్దడం, కృత్రిమ మేధా తదితర అంశాలను నిర్వహించడం ద్వారా పిల్లల్లో చైతన్యం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థుల విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు

# రాహుల్ గాంధీ ఓట్లు చోరీపై పోరాటం






దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తుంది..
ఓట్లు చోరీ చేస్తే ప్రజాస్వామ్యం నిలబడదు.
పారదర్శక ఎన్నికల కోసం రాహుల్ పోరాటం.
దేశం కోసం త్యాగం చేసిన గాంధీ కుటుంబం
మాజీ ఎం.పీ జి.వి హర్ష కుమార్

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ఓట్లు చోరీకి గురయితే ప్రజాస్వామ్య నిలబడదని అమలాపురం పార్లమెంట్ మాజీ అధ్యక్షులు జివి హర్షకుమార్ పేర్కొన్నారు. కొంతమూరు ఎన్‌హెచ్ 16పై గల ప్రకృతి వేదికలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హర్షకుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్లమెటరీ నేత రాహుల్ గాంధీ ఓట్లు చోరీపై పోరాడుతున్నారని, ఆయన పోరాటానికి దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తుందన్నారు. బీహార్‌లో 7.90కోట్ల ఓటర్లు ఉంటే 65లక్షల ఓట్లను తొలగించడం జరిగిందన్నారు. ఇందులో దళితులు, పేదవర్గాలు, మైనార్టీల ఓట్లే ఉన్నాయన్నారు. రాహుల్ గాంధీ పోరాటంతో సుప్రీం కోర్టు స్పందించడంతో 56 గంటల్లోనే 65 లక్షల ఓట్లను తిరిగి చేర్చారన్నారు. ప్రజాస్వామ్యం అంటేనే ఓటుతో నాయకులను ఎన్నుకోవడం అని అలాంటి ఓట్లను చోరీ చేస్తే ప్రజాస్వామ్యం ఎలా నిలబడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలింగ్ రోజున నమోదు అయిన ఓట్ల శాతానికి, లెక్కింపు రోజున నమోదు అయిన ఓట్ల శాతానికి ఎందుకు తేడా వస్తుందని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత ఎన్నికల్లో 12.5శాతం ఓట్ల తేడా వచ్చిందంటే.. ఈ ఓట్లు ఎక్కడ నుండి పెరిగాయని నిలదీశారు. బీహార్‌లో ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగే అవకాశం లేకుంటే ఎన్నికలను బహిష్కరించా లని అన్ని పార్టీలను కోరుతున్నామన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఇవిఎంలపై అందరిలోనూ సందేహాలు నెలకొన్నాయ న్నారు. రాష్ట్రంలో 12.50శాతం ఓట్లు తేడా వచ్చినప్పటికీ దానిపై మాట్లాడటానికి గానీ, పోరాడటానికి గానీ జగన్‌కు దమ్ములేదన్నారు. దీనితో వైసిపికి ఓట్లు వేసిన బిజేపికే వేసినట్లు అవుతుందని ప్రజలు అభిప్రాయపడు తున్నారన్నారు. ఉప రాష్ట్రపతికి ఎన్నికల్లో బిజేపి అభ్యర్థికి జగన్ మద్దతు ఇవ్వడాన్ని ఎలా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. నెలరోజుల పాటు జైల్లో ఉంటే పదవులు పోతాయన్న నిబంధన తీసుకురావడం సరికాదన్నారు. బిజేపి అన్ని వ్యవస్థలను తన చెప్పుచేతల్లో పెట్టుకుందని ఆరోపించారు. ఇప్పుడు రాజకీయ నేతలపై పెడుతున్న కేసులపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. కేసులు కక్షపూరితంగా పెడుతున్నారన్నారు. రాహుల్, రేవంత్ రెడ్డి, చంద్రబాబులు హాట్‌లైన్‌లో మాట్లాడుకుంటారని వ్యాఖ్య చేయడం ద్వారా జగన్ మోహన్ రెడ్డి బిజేపికి దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

**నెహ్రూపై విమర్శలు తగవు**

భారత తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చేసిన తప్పులను సరిదిద్దుతున్నా మంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు తగవని హర్షకుమార్ పేర్కొన్నారు. దేశం కోసం త్యాగం చేసిన కుటుంబం గాంధీ కుటుంబం అన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో నెహ్రూ 14ఏళ్ళ పాటు జైళ్ళలో ఉన్నారన్నారు. తన యావదాస్తిని దేశానికి అందించిన త్యాగమూర్తి అన్నారు. దేశ సమగ్రత కొరకు ఇందిరమ్మ ప్రాణత్యాగం చేశారన్నారు. రాజీవ్‌గాంధీ దేశం కోసం ప్రాణాలర్పించారన్నారు. చిన్న వయస్సులోనే రాజీవ్‌గాంధీ దేశప్రధాని అయ్యి, దేశాన్ని సాంకేతికత వైపు నడిపించారన్నారు. నేడు భారతదేశంసాంకేతికంగా అభివృద్ధి పథంలో ఉందంటే అందుకు కారణంగా ఆయన కంప్యూటర్, ఐటి, టెలికమ్యూనికేషన్ రంగాలలో చేసిన కృషే కారణం అన్నారు. రాజీవ్‌గాంధీకి ఏమాత్రం సంబంధంలేని బోఫోర్స్ కుంభకోణం ఆరోపణలతో గద్దెదించారన్నారు. 1991లో మరోసారి ప్రధాని కావాల్సిన రాజీవ్‌గాంధీ ఉగ్రవాదానికి బలయ్యారన్నారు. ఆయన 81వ జయంతి ఆగష్టు 20 సందర్భంగా సద్భావన దినంగా నిర్వహించుకుంటున్నామన్నారు. తాను జీవించి ఉన్నంత వరకు ప్రవీణ్ పగడాల కేసు మూలన పడదన్నారు. ఈ కేసును సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, రీ పోస్టుమార్టం నిర్వహించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొవ్వూరి శ్రీనివాస్, తాళ్లూరి విజయకుమార్, కాటం రవికాంత్, యర్రా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సుంకవల్లి సత్తిరాజుకు విశ్వజనని సేవారత్న అవార్డ్ అందజేత

**దేవరపల్లి, విశ్వం వాయిస్ న్యూస్:** దేవరపల్లి మండలం సంగాయ గూడెం గ్రామానికి చెందిన సామాజిక విశ్లేషకులు, మోటివేషనల్ స్పీకర్ సుంకవల్లి సత్తిరాజు కు విశ్వజనని ఫౌండేషన్ వారు బుధవారం ఉదయం హైదరాబాద్ లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్శిటీ లో విశ్వజనని సేవారత్న మరియు స్పెషల్ జ్యూరీ అవార్డునిచ్చి ఘనంగా సత్కరించారు. పలు సామాజిక సేవా కార్యాక్రమాల్లో పాల్గొనడమే కాకుండా, విద్యార్థులను అనేక అంశాల్లో మోటివేట్ చేయడం, ప్రతిభా పాటవ పరీక్షలను నిర్వహించి వారిలో నిద్రాణమైన ప్రతిభను వెలికి తీయడంలో సుంకవల్లి సత్తిరాజు విశేషంగా కృషి చేసారు. అన్నదాన కార్యక్ర మాల ద్వారా వృద్ధులకు, అనాథలకు క్షుద్భాధను తీర్చడంలో అనిర్వచనీయమైన పాత్ర నిర్వహించారు. మారుతున్న ప్రపంచ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని భావి పౌరులను చైతన్య పరచడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ విషయంలో ప్రజలకు అవగాహన కలిగించడంలో సత్తిరాజు చేసిన కృషి అనిర్వచనీయం. యుక్త వయసు నుండి ఇప్పటి వరకు ప్రతిఫలాపేక్ష లేకుండా అనేక పత్రికలకు వేలాది వ్యాసాలు, వందలాది కవితలను



వ్రాసి పాఠక లోకాన్ని అలరించడమే కాకుండా, నిజాయితీ, విలువల పట్ల నిబద్ధత పాటించి పలువురి ప్రశంసలను పొందిన సుంకవల్లి సత్తిరాజుకు అవార్డును ప్రధానం చేయడం పట్ల పలువురు అభినందించారు. నేడు జరిగిన కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు, సినీ, టి.వి కళాకారులు పాల్గొన్నారు.

# మార్వాడి సోదరులకు శ్రీసువర్ణ వర్తక సంఘం అండగా నిలుస్తుంది..

– కడియాల శ్రీనివాస్ , భరోసాజి

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** గోదావరి జిల్లాల్లో మార్వాడి సోదరులు ఇతర వర్తకులు దశాబ్దాల కాలం నుండి సోదర భావంతో కలిసి మెలిసి వ్యాపారాలు సాగించుకుంటున్నాము . అనేక సేవా కార్యక్రమాల్లో మార్వాడి వ్యాపార మిత్రులు ఎనలేని సేవలు అందిస్తు భారత మాత హృదయాన్ని గెలుచుకుంటున్నారు . ఎక్కడో తెలంగాణా రాష్ట్రంలో కొంతమంది రోహింగ్యా తెగ వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని స్వచ్ఛమైన భారతీయులైన మార్వాడి మిత్రులపై గో బ్యాక్ మార్వాడి అనే కిరాయి నినాదాలను తెర వెనుక నుండి ప్రోత్సహస్తున్నారు . మార్వాడి కుటుంబాలను భయభ్రాంతులకు గురిచేసి శాంతి భద్రతల సమస్యలు సృష్టించాలని కొన్ని అసాంఘిక శక్తులతో కుట్రలు సాగిస్తున్న ఒక రాజకీయ పార్టి ముఠా తెలంగాణాలో ఈ తరహా వాదనకు ఆజ్యం పోస్తున్నారు. భారతీయుల మధ్య చిచ్చు పెట్టడమే ఈ రోహింగ్యా తెగ వారకసుల లక్ష్యం. రాజమండ్రిలో గల ఒక వర్గం నకిలీ సువర్ణ వర్తక సంఘం నాయకునిగా ప్రచారం పొందిన సత్యం బాబు మాటలు వివాదస్పందంగా వున్నాయి. అవసరం లేకున్నా మార్వాడిలు రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కు అండగా నిలిచారు. ఎంఎల్ఏ కూడా మార్వాడిలకు అండగా



వుంటున్నారు అని పదే పదే ఎమ్మెల్యే ని సత్యం బాబు వివాదాల్లోకి లాగటం ఈ తరహా కుట్ర ఒక కోణంలో ఒక భాగంగా బావిస్తున్నాము. మార్వాడి సోదరులకు శ్రీ సువర్ణ వర్తక సంఘం నిరంతరం అండగా నిలుస్తుంది. నకిలీ సువర్ణ వర్తక సంఘం కు త్వరలో చట్ట పరమైన గుణపాఠం చెప్పటం ఖాయం. సత్యం బాబు మార్వాడి మిత్రులను బెదిరిస్తున్నట్టుగాను , డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టుగాను మా దృష్టికి వచ్చింది. ఆదారాలు సేకరిస్తున్నాము. మార్వాడి సోదరులను తెలంగాణా కేంద్రంగా వస్తున్న కొన్ని మార్వాడి గో బ్యాక్ అంటున్న వీడియో లను చూపిస్తు బెదిరిస్తున్నాని కొంతమంది మార్వాడి సోదరులు ఆందోళన చెందుతున్నారు. మార్వాడి సోదరులు ఎవ్వరు భయ పడొద్దు ,ఆందోళన చెందవద్దు అందుకు శ్రీ సువర్ణ వర్తక సంఘం మార్వాడి కుటుంబాలకు అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా శ్రీనివాస్ ఒక భరోసా ఇచ్చారు.

## సీతానగరం మండలంలో పలువురికి సి.ఎం రిలీఫ్ ఫండ్ ను అందజేసిన రుడా చైర్మన్ బొడ్డు

**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలంలోని వివిధ అనారోగ్య కారణాలతో చికిత్సల అనంతరం సీఎంఆర్ఎఫ్ కి దరఖాస్తు చేసుకున్న కాటవరం గ్రామానికి చెందిన బొల్లి కృష్ణకు రూ %శ్రీ%,09,909/-,మేకల రాజుకు రూ1,00,482/-,చినకొండేపూడి గ్రామానికి చెందిన చుండ్రు ప్రసాద్ కురూ42500/-,చుండ్రు సత్యవాణికి రూ 18,084/- విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను రుడా చైర్మన్,తెలుగుదేశం పార్టీ రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్ ,రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరిఅందజేశారు.

## లారీ ఓనర్స్‌ల సమస్యలను పరిష్కరిస్తా ప్రెసిడెంట్ రాచూరి




**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** పంగిడి లారీ యాజమాన్య సమస్యలను పరిష్కరిస్తామని శ్రీ దుర్గా భవాని టిప్పర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాచూరి శ్రీనివాస్ అన్నారు . బుధవారం దొమ్మేరు గ్రామ సమీపంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో శ్రీ దుర్గా భవాని టిప్పర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. గౌరవ అధ్యక్షులు ఉప్పులూరు వెంకట ఫణి కృష్ణ రావు, బెజవాడ వెంకటేశ్వరరావు, చౌటుపల్లి సాంబశివరావు ముఖ్య అతిథిగా దేవరపల్లి యూనిట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ వెంకటరమణ కొవ్వూరు రూరల్ సీఐ విజయబాబు కొవ్వూరు పట్టణ సీఐ విశ్వం రూరల్ ఎస్సై శ్రీహరి హాజరై ప్రమాణ స్వీకారం లో పాల్గొన్నారు. వేద మంత్రాల మధ్య నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. రెండు సంవత్సరాల కాల పరిమితికి నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ప్రెసిడెంట్ రాచూరి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ మడిచర్ల వెంకటేష్ సెక్రెటరీ పాపోలు వీర వెంకట సత్యనారాయణ జాయింట్ సెక్రెటరీ దార్ల నాగ లక్ష్మి ప్రసాద్, ట్రెజరరీ వీరాబత్తుల మణికంఠ, సభ్యులుగా ఆరు గొలును సత్యనారాయణ, వనచర్ల మోహన్, భీమడోలు శ్రీకాంత్, చెరుకు అయ్యప్ప, గోండేపల్లి సత్యనారాయణ, వెత్సా శేషగిరి సలహాదారుడు పెరుగు సాంబశివరావు నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. వీరికి హాజరైన ముఖ్య అతిథులు లారీ ఓనర్స్ అభినందనలు తెలియజేశారు. అనంతరం ప్రెసిడెంట్ రాచూరి శ్రీనివాస్ మాట్లాడుతూ లారీ ఓనర్ అసోసియేషన్ కి సొంత భవనం నిర్మించడానికి తన వంతు కృషి చేస్తానని లారీ యజమానుల సమస్యలను పరిష్కరిస్తానని ఏమైనా సమస్యలు ఉంటే కార్యవర్గానికి తెలియజేయాలని యూనియన్ మీటింగ్ కి ప్రతి ఒక్క సభ్యుడు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి దేవరపల్లి పంగిడి లారీ ఓనర్స్ హాజరయ్యారు.

## ప్రజా నాయకుడు రాజీవ్ గాంధీ


**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** కొవ్వూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ గారి 81 వ జయంతి సందర్భంగా కొవ్వూరు పట్టణం నందు రాజీవ్ గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ మరియు పిసిసి కోఆప్షన్ సభ్య లు సాక పుల్లారావు, బీసీ నాయకులు తమ్మిశెట్టి శ్రీనివాసు రాజీవ్ గాంధీ అభిమానులు సూరకాసుల గోవిందు బాబు నాని బాబు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ప్రజా



నాయకులని వారి తల్లి ఇందిరా గాంధీ ఈ దేశం కొరకు ప్రాణాలను విడిచి ఉన్నారు అని యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కును కల్పించి గ్రామ అభివృద్ధికి కేంద్రం నుండి నేరుగా నిధులను విడుదల చేసి గ్రామాలు అభివృద్ధి చెందడానికి నిరుద్యోగులకు రాజీవ్ గాంధీ ఎంతోకృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## హిందు న్యాయవాదులతో ధర్మాన్ని కాపాడేందుకు కృషి

సెప్టెంబర్ 14న హిందు న్యాయవాదుల ధర్మ సమ్మేళనం విజయవంతం చేయండి
స్వామీజీ రాధా మనోహర్ దాస్




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** స్వామిజీలతో హిందు న్యాయవాదుల ధర్మ సమ్మేళనాన్ని సెప్టెంబర్ 14వ తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్టు ఫోరమ్ ఫర్ హిందు న్యాయవాదులు, ఇంటలెక్చువల్స్ కో ఆర్డినేటర్ జి.శ్రీకృష్ణ కుమార్ వెల్లడించారు. పలువురు స్వామిజీలు, న్యాయవాదులు హాజరవుతారన్నారు. ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 150 బార్ అసోసియేషన్ల నుంచి 1500 మంది న్యాయవాదులతో పాటు ధర్మాన్ని కాపాడేందుకు కృషిచేస్తున్న స్వామిజీలు కూడా పెద్దఎత్తున హాజరవుతున్నారని వివరించారు. స్వామిజీలపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి, ఆస్తుల పరిరక్షణ, ధర్మ పరిరక్షణ చేయడానికి కృషిచేస్తామన్నారు. అభయ్ హిందు సేన వ్యవస్థాపకుడు రాధా మనోహర్ దాస్ మాట్లాడుతూ ధర్మం కోసం పనిచేసే న్యాయవాదులు ద్కైవం, దేశం కోసం పనిచేయడానికి ముందుకు రావాలన్నారు. ధర్మ, దేశ వ్యతిరేకతకు పాల్పడుతున్న వారిని ప్రశ్నిస్తామన్నారు. సమావేశంలో ఆంజనేయులు, కె.రవి శంకర్, అమృత తదితరులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవ ఆలోచన లో కాకినాడ, కరప మండలాల అధ్యక్షుల ఎన్నికలు

**అందరూ పార్టీని బలోపేతం చేసే దిశగా పనిచేయాలి...**

**కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిశీలకులు,కుడుపూడి సత్తిబాబు పిలుపు**



**కాకినాడసిటీ:విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ రూరల్,కరప మండలాల పార్టీ అధ్యక్షుల ఎన్నికలు పారదర్శకంగాఎకగ్రీవ పంథాలో జరుగుతాయని ఇందుకు పార్టీ శ్రేణులంతా సహకరించాలని కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిశీలకులు,ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు కోరారు.అందరూ పార్టీని మరింత బలోపేతం చేయడానికి వీలుగా పని చేయాలని సూచించారు.కాకినాడ రూరల్ తెలుగుదేశం పార్టీ మండల కార్యకర్తల సమావేశం బుధవారం కాకినాడ రూరల్ మండల టీడీపీ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో సత్తిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాకినాడ రూరల్ మండల అధ్యక్షుని ఎన్నికల బరిలో ఇద్దరు ఆశావహులుఆసక్తిచూపుతున్నారని, వారిలో ఒకరిని సామరస్యంగా ఏకగ్రీవంగా ఎన్నుకుని,పోటీ లేకుండా చేద్దామని పిలుపునిచ్చారు. అలాగే ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం కరప మండలంలో కార్యకర్తల సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు.తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి నారా లోకేష్ కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా అన్నారు. పాదయాత్రలో జగన్ ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టినా లోకేష్ ఎంతో ధీటుగా ఎదుర్కొని పోరాటం చేసి,పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చారని గుర్తు చేశారు. ఎక్కడైతే పాదయాత్ర ఆగిపోయిందో అక్కడి నుంచే మళ్ళీ పాదయాత్ర చేపట్టి,లోకేష్ విజయ శంఖం పూరించారని చెప్పారు.లోకేష్ అందించిన స్ఫూర్తితో పార్టీని మరింత ముందుకు తీసుకు వెళ్లాలని కోరారు.వైకాపా చేసిన అకృత్యాల వల్ల ప్రజలు వారిని 158 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితం చేసి గుణపాఠం చెప్పారని ఈ సందర్భంగా వివరించారు. తనకు శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ పదవి రావడానికి నారా లోకేష్ కారణమని ఈ సందర్భంగా చెప్పారు. పలు దశల్లో శెట్టి బలిజ సమావేశాలు కూడా నిర్వహిస్తూ వారిని పార్టీ వైపు చైతన్య వంతం చేస్తున్నామని చెప్పారు. ఏవైనా సమస్యలుంటే కాకినాడ రూరల్ కన్వీనర్ పిల్లి సత్తిబాబు,కో - కన్వీనర్ కటకం శెట్టి ప్రభాకర్ తో చర్చించాలని, అక్కడ సాధ్యం కాకుంటే రూరల్ అబ్జర్వర్ అయిన తన దృష్టికి తీసుకు రావాలని, అదీ సాధ్యం కాక పోతే అప్పుడు పార్టీ కార్యాలయానికి వెళ్లాలని కోరారు.ఏమైనా సమస్యలు ఉంటే రాజమండ్రిలోని తన కార్యాలయానికి వచ్చి చెప్పవచ్చని ఆయన అన్నారు. పార్టీ ఆదేశాల మేరకు చిన్న వివాదం కూడా లేకుండా అందరినీ
కలుపుకుని పార్టీ కార్య క్రమాలను ముందుకు తీసుకు వెళుతున్నట్లు చెప్పారు.అందరూ పార్టీకి విధేయతతో పని చేయాలని కోరారు.చిన్న చిన్న సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకుందామని సూచించారు.ఎన్నికయ్యే మండల అధ్యక్షులు మండలంలోని ప్రతి గ్రామంలోను పర్యటించి పార్టీ అభివృద్ధికి, తద్వారా ప్రభుత్వం, సామాజిక అభివృద్ధికి ఊతం ఇవ్వాలని కుడు పూడి సత్తిబాబు పిలుపు నిచ్చారు.

# కాకినాడ రూరల్ కో ఆర్డినేటర్ పదవికి రాజీనామా చేసిన పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్:** కాకినాడ రూరల్ నియోజకవర్గానికి శాసనసభ ఎన్నికల సమయంలో కో ఆర్డినేటర్ గా నియమించారు. పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనాటి ఎలక్షన్ ఎన్నికలకు పిల్లి సహధర్మచారిని అయినా మాజీ శాసన సభ్యురాలు పిల్లి అనంత లక్ష్మి జనసేన అభ్యర్థి శ్రీ పంతం నానాజీ గారి విజయానికి కృషి చేయడం జరిగింది. నానాజీ కి 72వేల పై చిలుకు ఓట్లతో అఖండ విజయం సాధించడం జరిగింది. దీనికి కాకినాడ రూరల్ నియోజక వర్గంలో అన్ని వర్గాల ప్రజల పూర్తి స్థాయిలో సహకరించడం జరిగింది. ఎన్నికలు అయినా తదుపరి కాకినాడ రూరల్ నియోజక వర్గం ఎమ్మెల్యే గా గెలుపొందిన నానాజీ ఇప్పటి వరకు మాకు గాని మన పార్టీ కార్యకర్తలకు గానీ ఏ విధమైన సహాయ సహకారాలు అందించలేదు అన్నారు. పైగా ఏ విషయంపై నైనా మన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వెళితే వారి ఊరు పేరు అడిగి ఆ ఊరి జనసేన ప్రెసిడెంట్ ను తీసుకురమ్మని చెప్పడం జరుగుతుంది.దానికి మన పార్టీ కార్యకర్తలు మనస్తాపం చెంది ఒక్కొక్కరు దూరమవుతూ ఉన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు కు నిధులు గానీ, అధికారుల సహకారం గానీ ఏమియు లేదు. లోగడ ఎన్నికల్లో మేము ప్రచారం చేసినప్పుడు మనకి 50%. జనసేన కి 50% అని చెప్పి ఇరువురం ప్రజల నుండి ఓట్లను అభ్యర్థించడం జరిగింది. వెనుకబడిన తరగతులకు నాయకులకు, కార్యకర్తలకు,ప్రజలకు జనసేన పార్టీ అభ్యర్థి పై పలు సందేహాలు ఉన్న మాజీ ఎమ్మెల్యే గా పిల్లి అనంత చెందిన లక్ష్మి, నియోజక అభివృద్ధి చైర్మన్ గా నేను ఉండి.. మాది హామీ అని చెప్పి పనిచేశాం. ఇప్పుడు మమ్మల్ని గానీ, మా కార్యకర్తలను గానీ లెక్కచేయడం లేదు. ఈ విషయం ముఖ్యమంత్రివర్యులైన మీకు నాలుగు దఫాలుగా మిమ్మలను కలిసి విన్నవించడం జరిగింది. కాకినాడ జిల్లా ఇంచార్జ్ మినిస్టర్ నారాయణ గారి దృష్టికి అనేక సార్లు నియోజక వర్గ విషయం తీసుకువెళ్ళడం జరిగింది.ఒకమారు మీరు మా సమక్షంలోనే మంత్రి నారాయణ గారికి ఈ విషయం పరిష్కారం చేయమని సివియర్ ఇంస్ట్రక్షన్స్ ఇవ్వడం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పల్లా శ్రీనివాస్ గారికి విశాఖ పట్నం వెళ్ళి వారిక్యాంపు కార్యాలయంలో, అలాగే విజయవాడ పార్టీ కార్యాలయం లో పలుమార్లు ఇదే విషయం గూర్చి వారి దృష్టిలో పెట్టడం జరిగింది. కానీ నేటి వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. వైసిపి ప్రభుత్వంలో మిమల్ని అరెస్ట్ చేసినప్పుడు సుమారు 53 రోజులు నియోజక వర్గ పరిధిలో వలసపాకల గ్రామంలో అనేక రకాల ఉద్యమాలు సామాజికంగా అన్ని కులాల తోను, ప్రజావేత్తలతో, మహిళల తోను, విద్యార్థిని విద్యార్థులతో రాజకీయ నాయకులతో పారిశ్రామిక వేత్తలు,అనేక రకములైన ఉద్యమాల్లో “బాబుతో- నేను” కార్యక్రమాల్ని జయప్రదం చేయడం జరిగింది. అటులనే పార్టీ ఆదేశాల ప్రకారం ఇదేం ఖర్మ, జాబు కావాలంటే బాబు రావాలి, పింఛను కార్యక్రమం, టిడిపి సభ్యత్వ నమోదు. ఎమ్మెల్సీ ఓటు నమోదు. ఎన్నికల నిర్వహణ. ఇది మంచి ప్రభుత్వం, సుపరిపాలనలో తొలి అడుగు. సూపర్ సిక్స్ పథకాలు, ఏర్పాట్లు, పార్టీ గ్రామ స్థాయి సంస్థాగత ఎన్నికలు నియోజకవర్గంలో 49 గ్రామాల్లో గ్రామ స్థాయి కమిటీలు, అనుబంధ కమిటీలు మరియు మండల కమిటీలు, మండల అనుబంధ కమిటీలు పూర్తి చేసి అన్ని కార్యక్రమాలలో నియోజకవర్గమును ముందు నిలపడం జరిగినది. కాకినాడ రూరల్ నియోజక వర్గానికి మీరు కో ఆర్డినేటర్లను నియమించేటప్పుడే కో ఆర్డినేటర్, కో కో ఆర్డినేటర్ గా ఇద్దరిని నియమించడం దానివల్ల ఇద్దరం కలిసి నియోజక వర్గాన్ని అభివృద్ధి చేయవలసి ఉన్నా దాన్ని విస్మరించి కో కో-ఆర్డినేటర్ గా ఉన్న వ్యక్తి సొంతం గా తన బలాన్ని పెంచుకోవడానికి కేడర్ ను విడదీసి రాజకీయం గా ఎదగడానికి ప్రయత్నం చేసుకుంటున్నాడు . అతను ఏకపక్ష నిర్ణయం గా వెళ్ళడం వలన కేడర్ అసంతృప్తికి లోనవడమే కాకుండా జనసేన ఎమ్మెల్యేతో చెట్టాపట్టాలేసుకుని పార్టీ కేడర్కు, పార్టీకి అన్యాయం చేస్తున్నాడు. దీని వల్ల కార్యకర్తలకు ఇబ్బందికర పరిస్థితి ఎదురై పార్టీ కి దూరమవుతున్నారు. అదియును కాక మా కాకినాడ రూరల్ నియోజక వర్గానికి రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ పరిశీలకులుగా నియమించడం జరిగింది. కాకినాడ రూరల్ నియోజక వర్గంలో శెట్టిబలిజ కులస్తులు అత్యధికంగా ఉన్నారని,మంచి ఉద్దేశంతో వారికి న్యాయం జరుగుతుందని వారిని నియమించినా అతని రాజకీయ లబ్ధి కోసం కో కో- ఆర్డినేటర్ తో కలిసి కేడర్ ను అన్నీ విధాలుగా విభజించి చూస్తున్నారు. కేవలం అబ్జర్వర్.. కో కో- ఆర్డినేటర్ కి మద్దతుగా ఉంటూ తెలుగుదేశం పార్టీ కి వారు నష్టం చేస్తున్నారని నా ఆలోచన. ఉదాహరణకు (ఆగస్టు 20) కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో కాకినాడ రూరల్ మండల అధ్యక్షుడు ఎన్నిక నిమిత్తం నియోజక వర్గ పరిశీలకుడు గా ఉన్న కుడుపూడి సత్తిబాబు పిలుపు ఇవ్వడం జరిగింది. సమావేశం లో కాకినాడ రూరల్మండలం లో ఉన్న 20 గ్రామాల గ్రామకమిటి అధ్యక్షులు, కార్యదర్శులు మరియు మండలం లోని తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు హాజరై 20 మంది గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు ( ఎవరైతే మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎన్నికకు ఓటర్లో) ఏకగ్రీవంగా అందరూ కలిసి ఒకే పేరు సూచించడం మీదట దానికి పరిశీలకుడు చెప్పిన సమాధానం ..? ఇది మా చేతుల్లో లేదు. అధిష్టానం నిర్ణయిస్తాది.. సీల్డ్ కవర్లో ఆ వ్యక్తి పేరు వస్తాదని చెప్పి ఉన్నాడు. ఇది కేవలం కో కో-ఆర్డినేటర్ సలహా మేరకు... కో కో-ఆర్డినేటర్ పెట్టిన క్యాండేట్ ను ప్రపోజల్ చెయ్యాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించాడు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఈ మండల అధ్యక్షుడి ఎన్నిక కు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నియమించిన ముగ్గురు( ఇద్దరు పరిశీలకులు హాజరయ్యారు) పరిశీలకుల సమక్షంలో జరిగినది. హాజరైన పరిశీలకులు ఇద్దరూ మండల పార్టీ అధ్యక్షుడు ఎన్నిక మా పరిశీలకుల సమక్షంలో ఎంపిక చేసేందుకే మమ్మల్ని పంపించడం జరిగిందని వారు చెప్పగా ..నియోజక వర్గ అబ్జర్వర్ గా ఉన్న వ్యక్తి కో కో ఆర్డినేటర్ కి మద్దతుగా ఉండి సీల్డ్ కవర్ లో పేరు వస్తుందని చెప్పి ఉన్నాడు. దాని మీద గ్రామ ప్రెసిడెంట్ కార్యదర్శులు. నాయకులు కార్యకర్తలు కోపోద్రిక్తులై అడుగగా రసాబస జరిగింది. నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పుడు నేను పార్టీ లో చేరడం జరిగింది. నేను పార్టీలో చేరి 43 ఏళ్లు అవుతుంది. ఇన్నాళ్లు నా రాజకీయ చరిత్రలో మండల అధ్యక్షుడి ఎన్నిక పరిశీలకుల సమక్షంలో జరగడం చూసాను కానీ నేనెప్పుడు ఇటువంటి “సీల్డ్ కవర్” అన్న మాట మన పార్టీలో విని ఉండలేదు. ఈరోజున ఈ కో కో-ఆర్డినేటర్ మరియు పరిశీలకుడు చేసిన పన్నాగం. ఇటువంటి సందర్భాలు అనేకమైనవి జరుగుతా ఉన్నవి. ఈ రోజు జరిగిన ఈ సందర్భం తప్పా ప్రతీ విషయం ఎప్పటికప్పుడు రాష్ట్ర పార్టీ కార్యాలయంలో రూరల్ నియోజక వర్గం కి సంబంధించిన పార్టీ కార్యకలాపాలు చూసే ఆఫీస్ ఇన్చార్జ్ లు రాంబాబు, నాగ రాజు. గంగ రాజు పలుమార్లు తెలియజేసిన ఫలితం శూన్యం. ఈ 14 నెలల కాలంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు గానీ ప్రజలకు గానీ సహాయ సహకారాలు అందించలేక పోయాను. పైగా పేరుకే కో ఆర్డినేటర్ పదవి. ఆ పదవితో కేవలం ప్రజలకు సుమారు రూ. 1.5 కోట్లు సీఎం రిలీఫ్ ఫండ్ మాత్రమే అందించగలిగాను. ఇక ఎటువంటి సహాయ సహకారాలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించలేకపోయాము. పైగా కో-ఆర్డినేటర్, కో-కో ఆర్డినేటర్, పరిశీలకులు, కార్యకర్తలను విడదీసి పరిపాలించడం పార్టీకి నష్టం జరుగుతుంది. తెలుగుదేశం ప్రభుత్వంలో మా కుటుంబం ద్వారా జడ్పీటీసీ గా, టీటీడీ బోర్డు సభ్యురాలు గా. రెండు సార్లు ఎమ్మెల్యే గా, రెండు సార్లు నియోజకవర్గ ఇంచార్జ్ గా అభివృధి సంక్షేమ కార్యక్రమాలు లోటు లేకుండా నియోజవర్గ ప్రజలకు చేసి ప్రతీ వారిమన్నన,గౌరవం సంపాదించి ఈ రోజున తెలుగుదేశం పార్టీ నాయకుడిగా చలామణి అవుతున్న మేము ఈ కో ఆర్డినేటర్ పదవి వలన ఏ విధమైన లబ్ధి కార్యకర్తలకు గాని, ప్రజలకు గాని న్యాయం జరుగుటలేదని మనస్తాపం చెంది.. రానురాను కార్యకర్తలు. ప్రజలు నాకు పార్టీకి దూరమౌతున్నారని గ్రహించి, గత వారం రోజుల నుండి పార్టీలోని వివిధ కుల సంఘాల నాయకులతో, నియోజక వర్గ పెద్దలతో, పార్టీ కేడర్ తో చర్చించి “మీ అందరికి ఎటువంటి సహాయ సహకారాలు అందించలేకపోవుచున్నాను. మీ గౌరవ మర్యాదలు కావాడలేకపొతున్నా అని మనస్తాపం చెంది ఈ రాజీనామాకు సిద్దపడ్డాను అని వాళ్ళకి తెలపడం జరిగింది”. అందువలనే ఈరోజు జరిగిన మండల అధ్యక్షుడి ఎన్నికకు హాజరు కాలేదు.
మీరు నాకు అప్పగించిన ఈ కో- ఆర్డినేటర్ పదవికి రాజీనామా చేసి క్రియాశీలక కార్యకర్తగా నేను పార్టీలో కొనసాగుతానని మీకు తెలియజేస్తున్నాను. పార్టీ ఏ కార్యక్రమం చెప్పిన చేసేందుకు నేను ముందుంటాను. అంటూ మీడియాకు తెలిపారు.

# ముంపు మండలాల్లో వరద బీభత్సం...

**ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ముంపు ప్రాంతాల్లో వరద ముంపు**


**ఉప్పొంగి ప్రవహిస్తున్న గోదావరి,శబరి నదులు**


**జల దిగ్బంధం లో సుమారు 100 గ్రామాలు**

**అప్రమత్తం అయిన అధికార యంత్రాంగం**

**చింతూరు డివిజన్ విశ్వం వాయిస్ న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ పరిధిలో ఉన్న విలీన ప్రాంతంలో వరదలు ముంచెత్తుతున్నాయి.ఎగువన ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు కారణంగా గోదావరి,శబరి నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్న నేపధ్యంలో లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరింది.దీని వలన జలగిగబంధంలో చిక్కున్న వరద బాధితులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.గత నాలుగు రోజులుగా కురుస్తున్న బారి వర్షాలకు ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.అదేవిధంగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి వరద బాధితులకు అన్ని రకాల నిత్యావసర సరుకులు అందిస్తున్నారు.అలాగే వరద ముంచెత్తడంతో ముంపు మండలాల్లో ఉన్న అన్ని మండలాలకు రాకపోకలు స్తంభించాయి.సుమారు 100కు పైగా గ్రామాలు గత మూడు రోజులుగా జలదిగ్బంధంలో ఉన్నాయి. దీనితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ముంపు మండలాల్లో ఉన్న చింతూరు నుండి వరరమచంద్రపురం మండలాలు కు పూర్తి స్థాయిలో రాకపోకలు నిలిచిపోయాయి ఈ మార్గంలో ఉన్న అన్నవరం వాగు,అట్టకోడళ్ల వాగు, సోకిలేరు వాగులు పొంగి పోర్లడంతో ఈ రెండు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి.అలాగే కూనవరం మండలం లో గోదావరి నది ప్రధాన రహదారిపై చేరడంతో కూనవరం యటపాక మండలాలకు కూడా రాకపోకలు నిచిపోయాయి అదే విధంగా జాతీయ 30 పై చింతూరు వద్ద వరద నీరు చేరుకుంది. ఈ వరద పరిస్థితి ఇలా ఉండగా అధికార యంత్రాంగాన్ని అధికారులు అప్రమత్తం చేశారు.చింతూరు ఐటిడిఎ పీ ఓ అపూర్వ భరత్ ప్రతి మండలం లో ఉన్న అధికారులను అప్రమత్తం చేస్తూ వరద ప్రవాహ పరిస్తితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.అదేవిధంగా చింతూరు ఐటిడిఎ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అధికారులను ప్రజలకు అనుసంధానం చేస్తామని పీఓ తెలిపారు.అలాగే ప్రతి మండలంలో ఉన్న తహశీల్దార్ కార్యాలయాల్లో కూడా కంట్రోల్ రూమ్ లను అధికారులు ఏర్పాటు చేశారు.అలాగే ప్రతి మండలము లో ఉన్న ముంపు ప్రాంతాలకు అధికారులు ముందుగానే బఫర్ స్టాక్ ను అందుబాటులో ఉంచారు.అదే విధముగా చింతూరు ఏ ఎస్పీ పంకజ్ కుమార్ మీనా కూడా పోలీస్ శాఖను అప్రమత్తం చేస్తూ వరద ప్రాంతాల్లో ప్రజలు చేపల వేటకు వెళ్లకుండా అలాగే వరద చేరిన రహదారులపై ప్రజలే దాటకుండా ఎక్కడికక్కడ పోలీస్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు అలాగే చింతూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గోపాలకృష్ణ ,యటపాక సర్కిల్ ఇన్స్పెక్టర్ కన్నప రాజు వారి సిబ్బందిని అప్రమత్తం చేస్తూ వరద ప్రాంతాల్లో నిత్యం పర్యటిస్తున్నారు.నిత్యం ప్రతి ఏటా వరదల కాలంలో మాత్రం ప్రజలు తీవ్రంగా ఇబ్బందులకు గురి కావడం ప్రజలకు అలవాటుగా మారింది అదే కాకుండా వరదల్లో ఆస్తి నష్టపోవడం తో వరద ప్రాంతాల్లో ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావస్తున్నారు. ఇది ఇలా ఉండగా భద్రాచలం వద్ద గోదావరి నది మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తుంది,చింతూరు వద్ద శబరి నది కూడా 38 అడుగుల వద్ద ప్రవహిస్తుంది.







## డిప్యూటీ సీఎం గారు న్యాయం చేయండి

**.. పిఠాపురం పోలీస్ స్టేషన్ వద్ద బాధితుల ఆవేదన..**




**కాకినాడ(పిఠాపురం):విశ్వం వాయిస్ న్యూస్** పిఠాపురం మండలం ఎఫ్.కె.పాలెంలో దళితులను తమ వ్యవసాయ భూములోనికి రానివ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురం మండలం ఎఫ్.కె.పాలెంకు చెందిన 20 సెంట్లు భూమిని రవ్వ వెంకటరమణ , కొత్తవేల మేరీ, ఆమె సోదరుడు కలిసి కొనుగోలు చేయడం జరిగిందని .ఆ భూమి రోడ్డు పక్కన ఉండడంతో దానిపై కన్నుజరిగిందని జనసేన నాయకుడు అని చెప్పుకునే వ్యక్తి గతంలో అమ్మేసిన వ్యక్తులను మళ్లీ భూమి లోకి పంపించి దౌర్జన్యం చేయిస్తున్నారని ఆరోపించారు. ఓ వ్యక్తి ఎస్సీలు అయిన కొత్తివేల మేరీ, రవ్వ వెంకటరమణ లకు రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు..కానీ ప్రస్తుతం ముందులో అమ్మిన కసిరెడ్డి రాంబాబు నాయకులు సహకారంతో భూమీలోకి దౌర్జన్యంగా వచ్చారని ఆరోపించారు. దానిపై కేసు పెట్టడం కూడా జరిగింద ని వారు తెలిపారు.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించి నాయకులపై చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. పిఠాపురం బహుజన పార్టీ నాయకులు ఖండవల్లి లోవరాజున బాధితులకు మద్దతుగా పోలీస్ స్టేషన్కు వచ్చి అధికారులను కలిశారు ఉపముఖ్యమంత్రి జోక్ చేసుకోవాలని కోరుతున్నారు.

## రాజవరంలో 50 లీటర్ల సారా స్వాధీనం

**3000 లీటర్ల మొలాసిస్ ధ్వంసం**



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజవరం గిరిజన గ్రామంలో కాకినాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుక ఆధ్వర్యంలో సారా తయారీ కేంద్రాలపై బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. 3000 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని, ఒక వ్యక్తిని అరెస్టు చేసారు. పారిపోయిన ఇంకొక వ్యక్తిని కూడా గుర్తించి కేసు నమోదు చేశారు. ఎవరైనా సారా కలిగి ఉన్నా, త్రాగిన, రవాణా చేసిన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుక ఈ సందర్భంగా గ్రామంలో ప్రకటించారు. ఈ తనిఖీల్లో ప్రత్తిపాడు ఎక్సైజ్ ప్రొహిబిషన్ ఏఈఎస్. వి.రామకృష్ణ, సిఐ.స్వామి, ఎస్సై కళ్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

## వరద రాకముందే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్ళండి.

**ఎస్పీ అమిత్ బర్గర్**



**చింతూరు డివిజన్ విశ్వం వాయిస్ న్యూస్:** వరదలు తమ గ్రామాలను, ఇళ్లను మంచివేయక ముందే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు, రిహాబిటేషన్ సెంటర్లకు తరలి వెళ్లాలని ఎస్పీ అమిత బర్గర్ ముంపు ప్రాంత ప్రజలకు పిలుపునిచ్చారు. చింతూరు, విఆర్ పురం, కూనవరం లలో ముంపు గురయ్యే ప్రాంతాల్లో ఎస్పీ పర్యటించారు. అధికారులను ఏ ఏ గ్రామాలు ముందుగా ముంపు గురైతాయో తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో రిహాబిటేషన్ సెంటర్ లకు ముందే ప్రజలను తరలించాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రాణహాని జరక్కుండా చూడాలని అధికారులను కోరారు. అలాగే బాధిత ప్రజలకు ఏ ఏ సౌకర్యాలు కల్పిస్తున్నది ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ అపూర్వ భరత్ ను అడిగి తెలుసుకున్నారు. పర్యటన అనంతరం చింతూరు లోని ఐటిడిఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలీస్ కంట్రోలింగ్ రూమ్ ను సందర్శించారు . పనిచేస్తున్న సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభమ్ అనోర్, ఓ ఎస్ డి జగదీష్ హడహళ్లి, అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్ మీనా, నాలుగు మండలాల రెవెన్యూ ఆఫీసర్లు, ఎండిఓలు చింతూరు సిఐ గోపాలకృష్ణ, ఎటపాక సీఐ కన్నపరాజు, నాలుగు మండలాల ఎస్సైలు అధికారులు పాల్గొన్నారు

## గిరిజన సంక్షేమ వసతి గృహంలో నిద్ర చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు

**ఆసిఫాబాద్** అది దట్టమైన అడవి. సెన్సిటివ్ జోన్. సెల్ ఫోన్ సిగ్నల్ కూడా ఉండవు. ఎటు చూసినా అడవే. అలాంటి ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో నిద్ర చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మార్లవాయి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలోని వసతి గృహంలో మంత్రి జూపల్లి కృష్ణారావు నిద్ర చేశారు. అధికారులు వద్దని వారించినా ససేమిరా అన్నారు.

# చంద్రబాబు ఆలోచనలు.. పదేళ్ల తర్వాత ప్రజలకు మంచి ఫలాలు

**ప్రతి కుటుంబం నుంచి ఓ పారిశ్రామికవేత్త రావాలి**

**విజన్ -2047 లో ప్రతిఒక్కరూ భాగ స్వాములు కావాలి**

**మంత్రి నిమ్మల రామానాయుడు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా రానున్న రోజుల్లో యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు మన రాష్ట్రంలోనే లభిస్తాయని జిల్లా ఇంఛార్జి మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆనం కళా కేంద్రం నందు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు, ఎమ్మెల్సీలు సోము వీర్రాజు,కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి,ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. ఏ రాష్ట్రమైన అభివృద్ధి చెందాలంటే వ్యవసాయం, పరిశ్రమలు, ఇన్ ఫ్రా స్ట్రక్చర్, లా అండ్ ఆర్డర్ బాగుండాలని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఇన్నోవేషన్ హబ్ గా మార్చాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సంకల్పమని.. ఇందులో భాగంగా ఆవిష్కాంధ్ర దిశగా ఇవాళ తొలి అడుగు పడటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. యువతలోని సృజనాత్మకతను వెలికితీసి.. వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఓ మంచి వేదికగా చెప్పుకొచ్చారు. అలాగే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్ట పరిచేందుకు ఈ ఇన్నోవేషన్ హబ్ దోహదపడుతుందన్నారు. ఈ హబ్ ద్వారా భవిష్యత్తు లో ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త పుట్టుకొస్తారనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. గోదావరి జిల్లాలు వ్యవసాయ ఆధారిత జిల్లాలు అని.. ఈ ఇన్నోవేషన్ హబ్ ద్వారా రానున్న రోజుల్లో పారిశ్రామిక రంగంలోనూ గోదావరి జిల్లాలు ముందు వరుసలో నిలబడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో జాబ్ క్యాలెండర్లు లేక, డీఎస్సీ నోటిఫికేషన్లు రాక యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలకు దూర మయ్యారని పేర్కొన్నారు. ఆనాడు యువత డ్రగ్స్ కు విపరీతంగా బానిసలుగా మారడంతో రాష్ట్రం గంజాయి ఆంధ్రప్రదేశ్ గా మారిపోయిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆవిష్కాంధ్రప్రదేశ్ గా మార్చివేస్తూ.. ఉద్యోగ ఉపాధి అవకాశాలకు కేంద్రబిందువుగా రాష్ట్రాన్ని మార్చడం జరుగుతోందన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినవాడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావించి గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించిన పొదుపు సంఘాలు నేడు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నాయన్నారు. ఒకప్పుడు ఇంజనీరింగ్ చదవాలంటే పొరుగు రాష్ట్రాలకు వెళ్లవలసి ఉండేదని.. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆనాటి ముందుచూపుతో రాష్ట్రంలో 300 ఇంజనీరింగ్ కాలేజీలు వచ్చాయని గుర్తుచేశారు. సాఫ్ట్ వేర్ అంటే పూనే, చెన్నై, బెంగుళూరు అనుకునే రోజుల్లో.. వాటన్నింటినీ మించి సైబరాబాద్ ను సృష్టించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే దక్కుతుందన్నారు. పాలకొల్లు నుంచి విశాఖ వెళ్లాలంటే ఒకప్పుడు 14 నుంచి 18 గంటల సమయం పట్టేదని.. కానీ ఆనాడు వాజ్ పేయి సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేషనల్ హైవేలు నిర్మించడంతో కేవలం 5 గంటల్లోనే ప్రయాణం చేయగలుగుతున్నామని మాట్లాడారు.ఇలా ఓ విజన్ తో చంద్రబాబునాయుడు చేసే ఆలోచనలు.. పదేళ్ల తర్వాత ప్రజలకు మంచి ఫలాలు అందిస్తుంటాయని చరిత్రే చెబుతోందన్నారు. అలాగే ఈ ఆవిష్కాంధ్ర కూడా భవిష్యత్తులో మంచి ఫలాలు అందిస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదని మంత్రివర్యులు పేర్కొన్నారు. రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ.. రాష్ట్ర భవిష్యత్తును గొప్పగా మలిచేందుకు ఈ ఇన్నోవేషన్ హబ్ నాంది పలుకుతుందన్నారు. స్వర్ణాంధ్ర-2047 సాధనలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అనేది ఓ మైలు రాయిగా అభివర్ణించారు. ఆర్థికాభివృద్ధితో పాటు ప్రతి కుటుంబాన్ని ఈ కార్యక్రమం శక్తివంతంగా మారుస్తుందని చెప్పుకొచ్చారు. యువత ఉద్యోగాల కోసం వెతికే పరిస్థితి నుంచి.. ఉద్యోగాలు సృష్టించే పారిశ్రామిక వేత్తలుగా మార్చడం కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక కొత్త యుగం మొదలవ్వ తుందని.. ప్రతి కుటుంబం ఆవిష్కరణ కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారుచేయడం ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. ఇలా గతంలో పుట్టుకొచ్చిన డ్వాక్రా సంఘాలు మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడంతో పాటు దేశానికే వెన్నెముకగా మారాయన్నారు. అలాగే ఈ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భవిష్యత్తులో మరింత ప్రగతి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా మనం కూడా ముందుకు సాగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇందులో భాగంగా ప్రతి విద్యార్థినీ భవిష్యత్తు అవసరాలకు సిద్ధం చేయడం ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఇవాళ మనం చూస్తున్న నేషనల్ హైవే ప్రాజెక్టులకు పీపీపీ విధానంలో నాంది పలికింది వాజ్ పేయి గారి సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఫలితంగా దేశవ్యాప్తంగా లక్షలాది కోట్ల రూపాయలతో నేడు ఇన్ ఫ్రా స్ట్రక్చర్ ఏర్పాటు అవుతుందన్నారు. అలాగే చంద్రబాబునాయుడు గారి విజన్ లో భాగంగా ప్రవేశపెట్టిన ఈ ఇన్నోవేషన్ హబ్ రాష్ట్రాన్ని పారిశ్రామికంగా మరింత ముందుకు తీసుకు వెళుతుందని, నిరుద్యోగ నిర్మూలనకు దోహదపడుతుందని చెప్పుకొచ్చారు. చంద్రబాబునాయుడు గారి ముందు చూపుకు ఆకాశమే హద్దు అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విజన్ - 2047 తో రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుకు తీసుకువెళు తున్నారని చెప్పారు. యువతకు పెద్దసంఖ్యలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలనే తపనతో దేశవిదేశాలన్నీ తిరుగుతూ మన రాష్ట్రానికి పెట్టుబడులను, పరిశ్రమలను తీసుకువచ్చేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కావున యువత చక్కగా చదువుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్ లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**ఆవిష్కరణ ఆంధ్ర ప్రతిజ్ఞ**

"ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి ఇల్లు ఒక వ్యవస్థాపకుడిని మరియు మార్పుకు దారితీసే వ్యక్తిని పెంచగలదని తెలుసుకుని, నా కుటుంబం యొక్క బలాన్ని నేను నమ్ముతానని ప్రతిజ్ఞ చేస్తున్నాను."

"నా కుటుంబంలోని ప్రతి సభ్యుడిని కలలు కనడానికి, నేర్చుకోవడానికి మరియు అర్థవంతమైన దాన్ని నిర్మించడానికి ప్రోత్సహిస్తానని నేను ప్రతిజ్ఞ చేస్తున్నాను."

"నేను నేర్చుకుంటూనే ఉంటానని, ఆసక్తిగా ఉంటానని మరియు నా జ్ఞానాన్ని పంచుకుంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను - ఎందుకంటే ఒకరు నేర్చుకున్నప్పుడు, మొత్తం కుటుంబం అభివృద్ధి చెందుతుంది."

"ఒక కుటుంబం, ఒక వ్యవస్థాపకుడు" అనే కలను సాకారం చేసుకునేందుకు, నా కుటుంబంతో కలిసి, మనం వ్యవస్థాపకులు-ఆవిష్కర్తలు, బిల్డర్లు మరియు ఉద్యోగ సృష్టికర్తలుగా ఉండటానికి కృషి చేస్తామని నేను ప్రతిజ్ఞ చేస్తున్నాను". ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మ శ్రీ, సోము వీర్రాజు, గ్రీన్ కోర్ ఛైర్మన్ జీ. రాంబాబు, నన్నయ యూనివర్సిటీ వీసీ వి. ప్రసన్న, గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఛాన్సలర్ కే వి వి సత్యనారాయణ రాజు (చైతన్యరాజు), ఆదిత్య యూనివర్సిటీ ఛైర్మన్ శేషారెడ్డి, గెయిల్ ప్రతినిధి కేవీఆర్ రావు, ఓఎన్జిసి ప్రతినిధి కే వి కే రాజు , తాడేపల్లిగూడెం ఎన్ఐటి ప్రతినిధి రవికిరణ్ శాస్త్రి, వైయస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ ప్రతినిధిగా డీన్ డా ఎస్. సూర్య కుమారి., పలు విద్యాసంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, ఆర్టీజీహెచ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. తొలుత సభ వేదిక కు చేరుకున్న ప్రతినిధులు , అధికారులు ప్రాంగణం లో ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శించి, అక్కడ ప్రదర్శించిన వాటి ఆసక్తిగా గమనించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా చేసిన ప్రసంగాన్ని వీక్షించడం జరిగింది.

## కందులపాలెంలో రైతు సేవా కేంద్రం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం



రామచంద్రపురం మండలం విశ్వం వాయిస్ న్యూస్ :- ,కందులపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వనరుల కేంద్రం నుండి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎడిఎ రాజశేఖర్ మరియు రామచంద్రపురం ఎడిఎ బి నాగ కుమార్,మండల వ్యవసాయ అధికారి టీఏఆర్ మహేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ సస్య రక్షణ యాజమాన్య పద్ధతులు లో భాగంగా వరిలో కాండం తొలుచు పురుగు యొక్క జీవిత చక్రం కొరకు బోర్డు మీద చిత్రం ద్వారా వివరంగా చెప్పటం జరిగింది.కాండం తొలుచు పురుగు జీవితంలో నాలుగు దశలలో రూపాంతరం చెందుతుందని అని తెలియ జేశారు. ముందుగా రెక్కల పురుగు గుడ్లు వరి కోస భాగాన పెట్టడం జరుగుతుందని, వీటిని నివారించటానికి వేప నూనె తో నివారించ వచ్చు అని తెలిపారు.ఒక వేల అలా చేయని రైతులు వరి నాట్లు వేసే సమయంలో వరి కోస భాగాలు తుంచి,కోసలను భూమిలో తొక్కటం ద్వారా నివారించటం జరుగుతుంది అన్నారు.కాండం తొలుచు పురుగు నారుమడి దశ నుండి ఈనిక దశ వరకు ఆశించి వరి పైరుకు నష్టపరుస్తుంది ఖరీఫ్ లో తక్కువ నుండి మధ్యస్థంగా,రబీలో మధ్యస్థం నుండి ఎక్కువగా ఆశించి, నారుమడి దశలో వస్తే కనుక మొక్కలు,పిలక దశలో మొవ్వు చనిపోతుందని,అదేవిధంగా ఈనిక దశలో వస్తే కంకి పాలు పోసుకోక తెల్లకంకులు ఏర్పడతాయని తెలియజేసారు. ముదురు గోధుమ లేక పసుపు రంగులో ఉన్న ఆడ రెక్కల పురుగులు ముందు జత రెక్కలపై నల్లటి మచ్చ కలిగి ఉంటాయి,ఆకు చివరి బాగాన గుడ్లను సముదాయంగా పెట్టి గోధుమ రంగు వెంట్రుకలతో కప్పి ఉంచుతుందని,గుడ్లు నుండి వచ్చిన లార్వా కాండం కింద వైపు నుండి లోపలి ప్రవహించి మవ్వును తిని వేస్తుందని,ఆలస్యంగా నాట్లు వేసినప్పుడు నత్రజని ఎరువులు ఎక్కువ వాడటం వల్ల, ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం వల్ల పురుగు నష్టం ఎక్కువగా ఉంటుందని రైతులకు వివరించారు. నారుమడిలో చదరపు మీటరుకు ఒక తల్లి పురుగు లేదా గుడ్డ సముదాయం,పిలకల దశలో చదరపు మీటరుకు ఒక తల్లి పురుగు లేదా గుడ్ల సముదాయం లేదా 5 శాతం చనిపోయిన మొవ్వులు లేదా లింగాకర్షక బుట్టలలో వారానికి బుట్టకు 25-30 మగ రెక్కల పురుగులు గమనించిన వెంటనే సస్యరక్షణ చేపట్టాలి చెప్పారు. నారు పీకటానికి వారం రోజులు ముందు 5 సెంట్ల (200 చ.మీ.) నారుమడికి 800 గ్రా. కార్బోఫ్యూరాన్ 3 జి గుళికలను పలుచగా నీరుంచి చల్లి ఆ మడిలోనే ఇంకేటట్లు చేయాలి.నాటే సమయంలో నారు కట్టల చివరలను త్రుంచవలెను. పిలక లేదా దుబ్బు చేసే దశలో కార్బోఫ్యూరాన్ 3 జి గుళికలను ఎకరానికి 10 కిలోలు లేదా ఎసిఫేట్ 75 ఎస్.పి.1.5 గ్రా.లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్.పి. 2గ్రా.లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు.అంకురం నుండి చిరుపొట్ట దశలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 జి గుళికలు 8 కిలోలు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 శాతం గుళికలు 4 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్.పి.2 గ్రా.లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 20 ఎస్.సి.0.4 మి.లీ./లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. అలానే నాగ కుమార్ రైతులను ఉదేశించి మాట్లాడుతూ ద్రవరూప జీవన ఎరువు అయినా ఫాస్ఫో బ్యాక్టీరియా పిఎస్బి భూమిలోని లభ్యం కానీ భాస్వరం కరిగించి మొక్కకు అందించి, మొక్క ఎదుగుదలకు కావలసిన హార్మోన్ల ఉత్పత్తికి అవసరం అవుతుందని,ఈ కల్చరును బాగా మాగిన పశు వుల ఎరువు లేదా వర్మీ కంపోస్ట్ సేంద్రియ ఎరువుతో కలిపి విత్తనాలు నాటినపుడు లేదా నాటిన వారం లోపు పొలంలో చల్ల కోవాలని చెప్పడం జరిగింది.ఇది సిఫారసు చేసిన మోతాదు ఎకరానికి ఘన రూప జీవన ఎరువులు అయితే 2కేజీ లు వరకు,ద్రవ రూప జీవన ఎరువులు అయితే 500 మిల్లీ లీటర్లు వరకు కలిపి వినియోగించు కోవచ్చు అని తెలియ జేశారు.భూమిలో వేయుట అన్ని రకాల పంటలకు 2 కిలోల లేదా 500 ఎమ్.ఎల్ కల్చరును 100 కిలోల పశువుల ఎరువు తో కలిపి ఎకరం పొలంలో వెదజల్లాలన్నారు. విత్తన శుద్ధి చేయాలంటే 500 గ్రాములు లేదా 250 ఎమ్.ఎల్ కల్చరును ఎకరానికి సరిపడు విత్తనములకు కలుపుకోవాలని వివరించారు. అలానే నారుమడి వేసే సమయంలో 1 కిలో లేదా 500 ఎమ్.ఎల్ కల్చరును 10 నుండి 15 లీటర్లు నీటిలో కలిపి ఆ మిశ్రమంలో నారును 30 నిమిషాలు పాటు ఉంచి తరువాత నాటుకోవాలన్నారు. డ్రిప్ విధానంలో అయితే 500 ఎమ్.ఎల్ కల్చరును 200 లీటర్లు నీటిలో కలిపి డ్రిప్ ట్యాంకులో వెయ్యాలన్నారు. అయితే ఇవి అన్ని కూడా మన రామచంద్రపురం డివిజన్ లో ఉన్న ప్రతి రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయి అని,ప్రతి రైతు పిఎస్బి ను ఉపయోగించి,వరి పంటకు వాడిన పొలాన్ని,వాడినా పొలానికి ఉన్నా తేడాను గమనించాలని రైతులకు చూపించారు. ఎమ్ఏఓ మహేష్ మాట్లాడుతూ నానో ఫెర్టిలైజర్ వలన కలిగే ఉపయోగాలు,అనగా వాటి వలన కలిగే ప్రయోజనాలు తెలియ జేస్తూ,భూమి కి విపరీతంగా యూరియా, డిఏపి,పొటాష్,భాస్వరం ఎరువులు వాడటం వలన భూమి నిస్సారం అవుతున్నది కావున వాటిని తగ్గిస్తూ క్రమేపీ నానో ఫెర్టిలైజర్ వాడు కోవాలని తెలియ జేశారు. నానో యూరియా డిఏపి వాడిన పొలం యొక్క పరిశీలన చేసి,రైతు వాడే పద్ధతిలో చేయటం ద్వారా ఎక్కువ ఖర్చు అయ్యి తక్కువ పిలకలు వచ్చిన చిత్రాలను చూపించటం జరిగింది.నానో ఫెర్టిలైజర్ వాడిన పొలంలో 8 నుండి 12 పిలకలు ఎక్కువ రావటంతో పాటు,ఖర్చు తక్కువ అవటం ద్వారా రైతుకు కొంత మేరకు ఖర్చు ఆదా అవుతున్నది అని తెలియ జేశారు.అదే విధంగా ఫీల్డ్ లెవెల్ ఐఎఫ్ఎఫ్ టి కంపెనీ ద్వారా డెమో చేసిం చూపించటం జరిగింది. డ్రోన్స్ 80 శాతం ప్రభుత్వం రాయితీ తో వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్నారు అని తెలియజేశారు, అదేవిధంగా ఖరీఫ్ పంటకు సంబంధించి ఈ పంట నమోదు కార్యక్రమం జరుగుతుందని,రైతులు మరియు కౌలు రైతులు తప్పనిసరిగా మీరు వేసిన పంటకు ఈ క్రాప్ చేయించుకోవాల్సినదిగా, మీ గ్రామంలో రైతు సేవ కేంద్రంలో సంప్రదించాలని, పంట నమోదు చేయడం ద్వారా మాత్రమే వ్యవసాయ సంబంధించి అన్ని పథకాలు రావడానికి అవకాశం ఉందని,రైతు సేవ కేంద్రాలలో ధాన్యం అమ్ముటకు ఈ పంట తప్పనిసరి చేసుకోవాలని, పంట నమోదు ప్రక్రియలో ప్రతి రైతు పొలం దగ్గరకు వెళ్ళి పంట స్థానిక విఏఏ మరియు విఆర్ఓ వారికి చూపించి,నమోదు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ ఛైర్మన్ వైట్ల శ్రీనివాసరావు,విఏఏ శ్రీరామ్,జెడ్బిఎన్ఎఫ్ స్టాఫ్ మండల ట్రైనర్,గ్రామ పెద్దలు,రైతు సోదరులు, రెవెన్యూ,పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### బీజేపీ వైపే.. మొగ్గు...

**గుంటూరు :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ బీజేపీతో ప్రత్యక్షంగా పొత్తు పెట్టుకోకపోయినా పరోక్షంగా తన సంబంధాలను కొనసాగిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పెడుతున్న ప్రతి బిల్లుకు వైసీపీ ఆమోదిస్తుంది. అలాగే రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లోనూ మద్దతు ఇస్తూ వస్తుంది. అధికారంలో లేనప్పుడు, ఉన్నప్పుడు కూడా జగన్ బీజేపీతో సఖ్యతగానే ఉంటూ వస్తున్నారు. బీజేపీ కేంద్ర నాయకత్వానికి కూడా జగన్ పట్ల సానుకూల వైఖరి ఉంటుంటారు. మరొకవైపు కాంగ్రెస్ కు శత్రువు కావడంతో సహజంగానే తనకు మిత్రుడిగా జగన్ ను బీజేపీ భావిస్తుంది. అందుకే జగన్ పై నమోదయిన అనేక కేసులు నేటికీ ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయని తెలుగుదేశం పార్టీ నేతలు కూడా బహిరంగంగానే ఆరోపిస్తారు. తాజాగా మరోసారి ఉప రాష్ట్రపతి ఎన్నికలు జరగనున్నాయి. ఇండి కూటమి ఇంకా తన అభ్యర్థిని ప్రకటించలేదు. ఈ నెల 21వ తేదీన నామినేషన్లకు తుది గడువు కావడంతో ఇండి కూటమి కూడా తమ అభ్యర్థిని బరిలోకి దింపాలని ప్రయత్నిస్తుంది. అయితే వైసీపీకి రాజ్యసభలో ఏడుగురు, లోక్ సభలో నలుగురు సభ్యుల బలం ఉంది. మొత్తం పదకొండు మంది సభ్యులు ఉండటంతో జగన్ సహజంగానే ఈ ఎన్నికల్లో కీలకంగా మారనున్నారు. ఇప్పటికే కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఫోన్ చేసి జగన్ తో మాట్లాడారు. తమకు మద్దతివ్వాలని అభ్యర్థించారు. తాను పార్టీ నేతలతో చర్చించిన తర్వాత నిర్ణయం చెబుతానని జగన్ చెప్పినప్పటికీ నిర్ణయం బీజేపీ వైపు ఉంటుందన్నది అందరికీ తెలిసిందే. రాహుల్ పై విమర్శలు జగన్ ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కూడా విమర్శలు చేశారు. చంద్రబాబు, రాహుల్ గాంధీ హాట్ లైన్ లో టచ్ లో ఉన్నారంటూ ఆరోపించారు. అలాగే ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ ఛార్జి మాణిక్యం ఠాగూర్ జగన్ పై చేసిన విమర్శలతో పాటు వీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల కూడా జగన్ కు శత్రువుగా మారడంతో ఆ పార్టీ పక్షాన నిలబడే అవకాశం ఎంత మాత్రం ఉండదు.

---

### దివ్యాంగుల పొట్ట కొడుతున్న కూటమి ప్రభుత్వం....

**లబోదిబోమంటున్న దివ్యాంగులు.**



**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్:** అల్లవరం మండలం ఓడలరేవు గ్రామానికి చెందిన చిలకలపూడి మూల స్వామి, అంతాని నరసింహ స్వామి, అంతాని వీర వేణి, మట్టా వీర వెంకట దుర్గా ప్రసాద్ అనే నలుగురు దివ్యాంగులకు పింఛన్ తీసేయడం పై పలువురు గ్రామస్తులు మండిపడుతున్నారు. బుధవారం సచివాలయానికి వచ్చిన దివ్యాంగులను అడగగా మాకు నెలకు 6వేలు పింఛన్ వచ్చేదని ఆ పింఛన్ తోనే మా కుటుంబాలను పోషించుకుంటాం అని ఇప్పుడు పింఛన్ తీసేసారు అని అంటున్నారు అలా అయితే మమల్ని చూసే దిక్కు ఎవరని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేసారు. దివ్యాంగులు మాట్లాడుతూ మంగళవారం ఎంపీడీవో కార్యాలయానికి రమ్మన్నారని అక్కడికి వెళ్ళాం అని మళ్ళీ సచివాలయం వద్దకు వెళ్ళండి అని అన్నారు అందుకే ఇక్కడకి వచ్చాం అని తమ బాధను తెలిపారు.పింఛన్ కోసం గతం లో ఎప్పుడూ ఇలా ఇబ్బంది పడలేదని దివ్యాంగులు తమ బాధను వెళ్లగక్కారు. ఈ విషయం పై సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ నీ వివరణ కోరగా ప్రభుత్వం మాకు పంపిన ఉత్తర్వులు పరంగా అసెస్మెంట్ జరుగుతుందని ఇప్పుడూ ఈ నలుగురు మరలా డాక్టర్ సర్టిఫికెట్ కి వెళ్లవలసి ఉంటదని ,అవన్నీ వివరాలు వారి ఇంటి వద్దకే వెళ్ళి తెలియజేస్తామని, మా పరంగా ఏమి చేయాలో అన్ని కంప్లీట్ చేసి ఉన్నత అధికారుల దృష్టికి పంపిస్తామని ఆమె తెలిపారు. కూటమి ప్రభుత్వం ఒక పక్క పెన్షన్లు పెంచి, మరో పక్క పింఛన్ తొలగించి దివ్యాంగుల కుటుంబాలను రోడ్డు న పడేసి ఇబ్బంది పెడుతుందని , 2010 లో జారీ చేసిన వైకల్య ధృవీకరణ పత్రాల్లో ఉన్న వైకల్య శాతాన్ని తగ్గించడం సమంజసం గా లేదని , రాష్ట్ర వ్యాప్తం గా కూడా దివ్యాంగులు ఉద్యమం చేస్తున్నారని దివ్యాంగులు అందరికీ న్యాయం జరగాలని పలువురు నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

### ద్రాక్షారామలో సైన్ స్నాచర్స్ వున్నారు జాగ్రత్త

**మెడలో 6 కాసుల బంగారం తాడు పోగొట్టుకున్న మహిళ**

**రామచంద్రపురం మండలం విశ్వం వాయిస్ న్యూస్ :-**ద్రాక్షారామ గ్రామానికి చెందిన తంగిరాల జయ సంతోషి విష్ణు ప్రియ అను ఆమె వెంకటాయపాలెం గ్రామం లో వున్న లిటిల్ రోజ్ స్కూల్ నందు హెడ్ మాస్టర్ గా విధులు నిర్వహిస్తున్నారు.అయితే తన విధులు ముగించుకొని 4.30 గంటలు సమయంలో తన యొక్క స్కూటీ పై ఇంటికి వెలుచుండగా ద్రాక్షారామ సబ్ రిజిస్ట్రర్ ఆఫీసు దాటిన వెంటనే వెనుక నుండి ఎవరో గుర్తు తెలియని ఒక వ్యక్తి మోటార్ సైకిల్ పై వచ్చి ఆమె మెడ లో వున్న బంగారు పుస్తెల త్రాడు (6 కాసులు) దొంగిలించడం జరిగింది.అయితే ఆవిడ ఫిర్యాది ఇచ్చిన రిపోర్ట్ పై ద్రాక్షారామ ఎస్ఐ ఎమ్ లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు

### సిక్కోలులో భయపెడుతున్న కుక్కలు

**శ్రీకాకుళం :** కిందటి నెల 14న జిల్లాలోని లావేరు మండలం మురపాక గ్రామంలో కుక్క కరవడంతో బొద్ద అజయ్ అనే 24 ఏళ్ల యువకుడు మృతి చెందాడు. అజయ్ మృతి చెందిన రోజుకి సరిగ్గా రెండు నెలల ముందు ఊరులో అతనికి కుక్క కరిచింది. అయితే కుక్క కాటును లైట్ తీసుకున్న యువకుడు యాంటీ రాబీస్ వ్యాక్సిన్ వేయించుకోకుండా నిర్లక్ష్యం చేశాడు. దీంతో కిందటి నెల 14న ఇంటి వద్ద అజయ్ ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు యువకుడిని వెంటనే శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు అజయ్. అయితే అజయ్ మృతి చెందిన 34 రోజులకు అనగా సోమవారం మధ్యాహ్నం బూర్జ మండలం తోటవాడకు చెందిన దనాన అప్పమ్మ అనే 70 ఏళ్ల వృద్ధురాలు కుక్క కాటుకు మృతి చెందింది.కిందటి నెల 27న ఒకరోజు తోటవాడకు చెందిన అప్పమ్మతో పాటు అదే మండలంకు చెందిన అయ్యవారిపేట, అన్నంపేట కొల్లివలస, కంట్లాం గ్రామాలలో 15మందిని, రెండు ఎద్దులను పిచ్చి కుక్క కరిచింది. ఒక్క ఉదుటున అప్పమ్మపైకి ఎగిరి కన్ను పక్క భాగం అంతటిని నోటితో పట్టి పీకేసింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని శ్రీకాకుళం హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం మళ్లీ అక్కడి నుంచి విశాఖపట్నంలోని హాస్పిటల్‌కు తీసుకువెళ్లి చికిత్స చేయించారు. అయితే ఇటీవలే ఇంటిపట్టున ఉంటూ టైముకి మందులు వేసుకుంటుండగా ఆదివారం ఆరెన్‌గా ఆమె ప్రవర్తనలో మార్పు వచ్చింది. దీంతో శ్రీకాకుళం ఉడుము కి తరలించారు కుటుంబసభ్యులు. దీంతో హాస్పిటల్ లో చికిత్స పొందుతూ అప్పమ్మ సోమవారం మధ్యాహ్నం మృతి చెందింది.కిందటి నెల అప్పమ్మను కరిచిన పిచ్చి కుక్కే.. రెండు ఎద్దులను కూడా కరిచింది. దీంతో కొద్ది రోజులకి ఆ ఎద్దులు కూడా చనిపోయాయి. అలా మాట్లాడిన మరుసటి రోజే అప్పమ్మ మృతి చెందింది.

### భారీగా తగ్గనున్న మద్యం షాపుల లైసెన్సులు

**విజయవాడ :** కొత్త బార్ పాలసీలో భాగంగా బార్ లైసెన్స్ ఫీజులు, దరఖాస్తు రుసుములను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీగా తగ్గించింది. లైసెన్స్ ఫీజును ఆరు వాయిదాల్లో చెల్లించేందుకు సైతం అవకాశం కల్పించింది. ఈ మార్పుల వల్ల ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటారు. లైసెన్స్ ఫీజు, అప్లికేషన్ ఫీజుల తగ్గింపు వివరాలను ప్రొహిబిషన్ & ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్ కుమార్ మంగళవారం ప్రకటించారు. తాజాగా జీవో ప్రకారం ఏపీలో మొత్తం 840 బార్లకు లైసెన్సులు జారీ చేస్తారు. 10 శాతం బార్లను గీతకులాలకు కేటాయించడంతో పాటు లైసెన్స్ ఫీజులో వారికి 650 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. కడపలో బార్ లైసెన్స్ ఫీజు రూ.1.97 కోట్లు వసూలు చేయగా, అనంతపురంలో రూ.1.79 కోట్లు, తిరుపతిలో రూ.1.72 కోట్లు, ఒంగోలులో రూ.1.40 కోట్లు ఉండేది.

## నాణ్యత ప్రమాణాలు లేక ప్రజల ప్రాణాలతో

# చెలగాటం ఆడుతున్న వాటర్ ప్లాంట్లు

**కఠిన చర్యలు తప్పవు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్..**

**జమ్మికుంట :** ప్రజలకు అనువుగా ఉండేందుకు జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో వాటర్ ప్లాంట్ లను ఏర్పాటు చేసుకున్నారని, నాణ్యత ప్రమాణాలు లేకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వాటర్ ప్లాంట్ లపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్, అన్నారు. బుధవారం జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని జయశ్రీ వాటర్ ప్లాంట్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు నాణ్యమైన తాగు నీరు అందించాలని ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ లోని క్యాన్లు 90రోజులకు ఒకసారి మార్చాలని, నీటిలో ఎంత శాతం క్లోరిన్ కలపాలో కూడా తెలియని షాప్ లోని వర్కర్లను షాప్ లలో ఉంచుతున్నారని, క్యాన్ లో పురుగులు ఉంటున్నాయని కమిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు ఇచ్చి రోగాలను తెచ్చుకుంటున్నామని, ఇటువంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని, మున్సిపాలిటీ పరిధిలో 25 వాటర్ ప్లాంట్ లు ఉన్నాయని, వాటిని తనిఖీ చేస్తామని ఆయన అన్నారు. షాప్ లైసెన్స్ ల గడువు ముగిసిన రెన్యువల్ చేసుకోవడంలో అలసత్వం వహిస్తున్నారన్నారు. కొన్ని ప్లాంట్ లలో క్లోరిన్ కు బదులుగా బ్లీచింగ్ కలుపుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వర్ష కాలంలో ప్రజలు ఎల్లప్పుడూ మిషన్ భగీరథ నీటిని కానీ, ప్లాంట్ లో కొన్న నీటిని కానీ కాచి చల్లార్చి తాగాలన్నారు. ప్రజలు తాగే ప్రతి నీటిని కాచి చల్లార్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తక్షణమే వాటర్ ప్లాంట్ లైసెన్స్ రెన్యువల్ చేసుకొని వారు చేసుకోవాలని, బి.ఎస్.ఐ. సర్టిఫై ఉన్న క్లోరిన్ నే కలపాలన్నారు. తొందర్లోనే అన్ని షాపులు తనిఖీలు చేస్తామని, ప్రజలకు హాని కలిగించే వాటర్ ప్లాంట్ లను సీజ్ చేస్తామని, షాప్ లోని వర్కర్ లకు కానీ, యజమానులకు కానీ క్లోరిన్ ఎంత మేరకు కలపాలో తెలిసి ఉండాలన్నారు. అనంతరం గణేష్ హోల్ సేల్ షాపును తనిఖీ నిర్వహించారు. అందులో అమ్మే పలు వస్తువుల గడువు కాలం పరిశీలించి, బ్యాన్ అయిన ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించడంపై ఫైన్ వేశారు. పట్టణంలో బ్యాన్ అయిన ప్లాస్టిక్ కవర్లను వాడకూడదని, ప్రజలు జమ్మికుంటను ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీ గా తీర్చి దిద్దడంలో సహకరించాలని కమిషనర్ మహమ్మద్ అయాజ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ లు మహేష్, సదానందం, ఈఈ శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది తో పాటు పలువురు పాల్గొన్నారు...



## జమ్మికుంటలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ, జయంతి వేడుకలు

**జమ్మికుంట :** మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 80వ, జయంతి సందర్భంగా జమ్మికుంటలో మండల కాంగ్రెస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్, ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తాలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా దేశిని కోటి, సుంకరి రమేష్, .పొన్నగంటి మల్లయ్య, మాట్లాడుతూ స్వర్గీయ రాజీవ్ గాంధీ, ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు కమ్యూనికేషన్ రంగంలో సాంకేతిక రంగంలో మన దేశానికి విదేశీ పెట్టుబడులు లాంటి అనేకమైన సంస్కరణలు తీసుకవచ్చి దేశ అభివృద్ధి దేశ పురోగతిని చక్కదిద్దారని 21 సంవత్సరం ఉండబడిన ఓటు హక్కును 18 సంవత్సరాలకే కుదించారని. భారతదేశం కోసం అనేకమైన కార్యక్రమాలు నిర్వహించారని చివరికి దేశం కోసమే ప్రాణార్పించారన్నారు. అలాంటి గొప్ప కుటుంబం రాజీవ్ గాంధీ కుటుంబం అని వారి మాతృమూర్తి స్వర్గీయ ఇందిరా గాంధీ, కూడా దేశం కోసం ప్రాణాలర్పించారన్నారు. 2004 ఉ 2009లో దేశ ప్రధానమంత్రిగా రాహుల్ గాంధీ,కి అవకాశం వచ్చిన పదవులు ముఖ్యం కాదు ఈ దేశ ఆర్థిక వ్యవస్థ బాగుండాలని ఒక ఆర్థికవేత్త అయిన మన్మోహన్ సింగ్, ను రెండుసార్లు ప్రధానమంత్రిగా చేసి భారతదేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దారని మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ, కుటుంబం దేశం కోసం ప్రాణాలర్పించారని. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి పదవిని త్యాగం చేశారన్నారు. ఇలాంటి కుటుంబం కోసం వారి ఆశయాలను వారి ఆశ సాధనల కోసం మనందరం కలిసికట్టుగా కాంగ్రెస్ యువ నాయకులు సైనికులుగా పనిచేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు బొంగోని వీరన్న, ఎలగందుల స్వరూప, శ్రీహరి, శ్రీపతి నరేష్, దిడ్డి రాము, మార్కెట్ డైరెక్టర్ రాజేశ్వరరావు, సూర్య, .కాంగ్రెస్ నాయకులు వర్దపల్లి నాగరాజ్, ముద్దమల్ల రవి, పంజాల అనిల్, ఎండి సలీంపాషా, పిడుగు భాగ్యలక్ష్మి, కుడాది తిరుపతి, మర్రి రామ్ రెడ్డి, అశోక్, భాస్కర్,ప్రవీణ్, .తిరుపతి, శ్రీనివాస్, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు..




# స్వర్గీయ రాజీవ్ గాంధీ సేవలు దేశానికే ఆదర్శం

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్ది కుమార్...**

**జమ్మికుంట :** ఇల్లందకుంట మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది కుమార్, ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ, 81 వ,జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.పూల మాలలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ, సేవలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. రాజీవ్ గాంధీ, ప్రధానిగా ఆధునికత ప్రగతిశీల సంస్కరణలు తీసుకొచ్చి దేశానికి గొప్ప మార్గాన్ని చూపారని కొనియాడారు.సైన్స్ ని ప్రోత్సహించారు., టెలీకాం రంగంలో వినూత్న మార్పులు తీసుకొచ్చారు. శాంతి ప్రజాస్వామ్య విలువలకు తన జీవితాన్ని అంకితం చేశారని,ఈ దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందని యువతకు అవకాశాలు కల్పించి దేశ ప్రగతికి పాటుపడాలని సంకల్పించారని.ఓటు హక్కు 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించి యువతకు గొప్ప అవకాశాన్ని కల్పించారని అన్నారు.రాజీవ్ గాంధీ,పంజాబ్ ఒప్పందం, ఇండియా మరియు శ్రీలంక ఒప్పందం వంటి శాంతి నిర్ణయాలతో ప్రపంచ మన్ననలు పొందారన్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పల శ్రీనివాస్ రెడ్డి, కనుమల్ల సంపత్, వంగ రామకృష్ణ, గోడిశాల పరమేశ్వర్, సింగిరెడ్డి గోపాల్ రెడ్డి, గంగారం మహేష్,పెద్ది శివకుమార్, గొడుగు మానస, మీసా రాజయ్య, భోగం సాయిరాం, తోడేటి కిషన్, బండి మల్లయ్య, మర్రి వీరారెడ్డి, గోరుకుంట్ల స్వామి, బైరెడ్డి కొండారెడ్డి, గడ్డి శ్రీనివాస్, మోతె మహేందర్, మంకు ఐలయ్య, గొట్టె రాజశేఖర్, తాడెం దిలీప్, దంసాని తిరుపతి,రావుల రాజబాబు, దార నరేష్, రేణిగుంట రవీందర్ రావుల మోహన్ రెడ్డి,ఉప్పుల మల్లారెడ్డి,ఉప్పుల శ్రీనివాసరెడ్డి, శాతాల మధు, మారేపల్లి వంశీ,జక్కు కుమారస్వామి, ఆకసపల్లి వెంకటేష్,గుండార కిరణ్, పైడిపల్లి దేవేందర్, ఎండి అజ్గర్ పాషా, దాసరి తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు....



## గోదావరి నది పరివాహక లోతట్టు వరద ముంపునకు

# గురి అయ్యే గిరిజన ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్**

**భద్రాద్రి కొత్తగూడెం:** ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం 43 అడుగులకు చేరుకున్నందున మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినందున ఎగువ కురుస్తున్న వర్షాలకు గోదావరి క్రమేపి పెరుగుతూ ఉధృతంగా ప్రవహిస్తున్నందున, గోదావరి నది పరివాహక లోతట్టు ప్రాంత గిరిజన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐ టి డి ఏ పి ఓ రాహుల్ అన్నారు. అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని సూచించారు.గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో వాగులు,వంకలు పొంగిపొర్లు తున్నాయని అంతేకాక ఉధృతంగా ప్రవహిస్తున్న చెరువులు,వాగులు,వంకల వద్దకు వీడియోల కోసం,సెల్ఫీల కోసం వెళ్ళి ప్రమాదాలకు గురి కావద్దని సూచించారు.వాహనదారులు ప్రయాణాలు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదివే గిరిజన విద్యార్థిని విద్యార్థులు పొంగుతున్న వాగులు, చెక్ డ్యాముల వద్దకు వెళ్లకుండా చూడాలని అన్నారు. గోదావరి నది పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులు వరద ముంపునకు గురి అయితే వెంటనే అధికారుల సూచనలు పాటించి పునరావాస కేంద్రాలకు వెళ్లాలని అన్నారు. అత్యవసరమైన విపత్కరమైన పరిస్థితులు ఏమైనా ఉంటే వెంటనే సంబంధిత కంట్రోల్ రూమ్ నంబర్లు భద్రాద్రి కొత్తగూడెంపాల్వంచ 08744-241950, (వాట్సాప్) 93929 19743, ఐటీడీఏ భద్రాచలం కంట్రోల్ రూమ్ నెంబర్ 799 5268 352, సబ్ కలెక్టర్ ఆఫీస్, భద్రాచలం 08743-2324444, (వాట్సాప్) 93479 10737 నంబర్లకు ఫోన్ ద్వారా తెలియజేయాలని ఆయన కోరారు.




## ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందిస్తున్నాం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్ :** ఆర్థిక పరిస్థితి సరిగా లేకున్నా.. ఎన్నికల హామీలను అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ ను అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు సీఎం రేవంత్ రెడ్డి శంకు స్థాపన చేశారు. శంకుస్థాపనకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గచ్చిబౌలిలో పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామని, 39 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల నుంచి 62 శాతం ఆదాయం వస్తుందని తెలియజేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాయల్లో ఇబ్బందులు ఉండకూడదనే అన్ని సదుపాయాలతో ఆఫీసులు నిర్మిస్తున్నామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాల టెండర్ల దరఖాస్తుకు ఆబ్కారీ శాఖ నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్ :** తెలంగాణలో మద్యం దుకాణాల ఆశావాహులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాల టెండర్ల దరఖాస్తుకు ఆబ్కారీ శాఖ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. అలాగే, దరఖాస్తుల ఫీజు కూడా భారీగా పెంచేసింది. దరఖాస్తు ఫీజు రూ.2లక్షల నుంచి రూ.3లక్షలకు పెంచినట్లు పేర్కొంది. వచ్చే రెండేళ్ల కాల పరిమితి (2025 డిసెంబర్ నుంచి 27 నవంబర్ వరకు)కి కి సంబంధించి లాటరీ పద్ధతి ద్వారా మద్యం దుకాణాల లైసెన్సులను ఎంపిక చేయనుంది. మద్యం దుకాణాల కేటాయింపులో గౌడ్‌లకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం కల్పించనుంది. మద్యం దుకాణాలు 6 శ్లాబ్‌లలో ఎక్సైజ్‌శాఖ లైసెన్సులు జారీ చేయనుంది.

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**పెద్దపల్లి :** పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో స్థానిక ఎమ్మెల్యే విజయ రమణారావు ఆదేశాల మేరకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భూషణ వేణి సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 81 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సురేష్ గౌడ్, సయ్యద్ మసరత్, బొంకూరి అవినాష్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ అతి చిన్న వయసులో ప్రధానమంత్రిగా పనిచేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. అలాగే 18 ఏళ్లకే ఓటు హక్కును కల్పించారని, యువత రాజకీయంగా ఎదగాలని పంచాయతీ సంస్కరణ చేసి ఎంతో మేలు చేశారన్నారు. భారతదేశం హక్కుగా మీద నిలిచిందని అలాగే ఇందిరా గాంధీ ఆశయాలను ముందుకు తీసుకుపోతూ పేద బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచారని దేశం కోసం ప్రాణాలు అర్పించిన గాంధీ కుటుంబమన్నారు. రానున్న రోజుల్లో రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకుపోతూ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కౌన్సిలర్లు నూగిల్ల మల్లయ్య, భూత గడ్డ సంపత్, తూముల సుభాష్, పట్టణ ప్రధాన కార్యదర్శి దొడ్డుపల్లి జగదీష్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బొడ్డుపల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షులు నాంసాని శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాగాల శ్రీకాంత్, నెత్తెట్ల కుమార్ యాదవ్, తాడూరి శ్రీమాన్, ఫణీంద్ర భూపతి, తిర్రి శ్రీనివాస్ గౌడ్, నదీమ్, మానుపాటి రవి, కాజా, సాయి తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్రంలో యూరియా కొరతపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

**హైదరాబాద్ :** రాష్ట్రంలో యూరియా కొరతపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ చోట చెప్పులు లైన్లో పెడితే మరోచోట ఆధార్ కార్డులు ఇంకో చోట పట్టాదార్ పాస్‌బుక్కులు ఉంచుతున్నారని.. ఎండలేదు, వాన లేదు, తెలంగాణలో ఏ మూలకు పోయినా ఇవే దృశ్యాలు కనిపిస్తున్నాయని తెలిపారు. కోడికూయక ముందే రైతన్న ఎరువుల దుకాణం ముందు క్యూ కడుతున్నాడని తెలిపారు. ఒక్క బస్తా కోసం పడిగాపులు గాస్తున్నాడని పేర్కొన్నారు. పదేళ్లలో ఎన్నడన్నా చూసినమా ఇంతటి దైన్యం ఉందా అని ప్రశ్నించారు. తెలంగాణలో మళ్లీ "ఆనాటి రోజులు" తెచ్చింది అసమర్థ రేవంత్ సర్కారు అని మండిపడ్డారు.ముందుచూపు కరువై, అన్నదాతను అరిగోసలు పెడుతోందని విమర్శించారు.

## కృష్ణమ్మ పరవళ్లతో కళకళలాడుతున్న నాగార్జున సాగర్

**హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా గత కొద్ది రోజులుగా భారీ వర్షాల కారణంగా ఓవైపు ప్రజలు ఇబ్బందులు ఎదురుకుంటున్నా.. మరోవైపు జలాశయాలు మాత్రం జలకళను సంతరించుకుంటున్నాయి. నాగార్జున సాగర్ కూడా నీటితో నిండిపోయింది. శ్రీశైలం జలాశయం నుంచి వచ్చిన నీటి ప్రవాహంతో నాగార్జున సాగర్‌కు భారీగా నీరు వచ్చి చేరింది. దీంతో సాగర్ కృష్ణమ్మ పరవళ్లతో కళకళలాడుతుంది. ఈ సీజన్‌లో సాగర్‌కు 4.10 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడం ఇదే తొలిసారి. దీంతో అధికారులు మొత్తం 26 గేట్లను దాదాపు 10 అడుగుల పైకి ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. ఇలా జరిగడం కూడా సాగర్ చరిత్రలో తొలిసారి కావడం విశేషం.గడిచిన మూడు రోజుల నుంచి వరద ప్రమాదం పెరుగుతుండటంతో నాగార్జున సాగర్ నీటిమట్టం అంతకంతకు పెరిగిపోతుంది. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా.. ఇప్పటికే 584.80 అడుగులుగా నమోదైంది. నీటి నిల్వ సామర్థ్యం 312,0450 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 274,8580 టీఎంసీలుగా ఉంది.

## కాళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

**అధికార యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి :** కాళేశ్వరం వద్ద గోదావరి నది నీటి మట్టం పెరుగుతుండడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.బుధవారం కాళేశ్వరంలో గోదావరి, సరస్వతి ఘాట్ల వద్ద వరద ఉధృతిని ఎస్పీ కిరణ్ ఖరే తో కలిసి పరిశీలించారు. బుధవారం ఉదయం 7 గంటలకు సి డబ్ల్యూసి నివేదిక ప్రకారం 12.220 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజల ప్రాణరక్షణలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, విద్యుత్, ఆరోగ్య తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నది పరివాహక గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలను ముందుగానే సమాచారం అందించడంతో పాటు లోతట్టు ప్రాంతాల ప్రజలను గుర్తించి సురక్షిత ప్రాంతాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అత్యవసర పరిస్థితులలో సేవలు అందించడానికి ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్డీ ఆర్ ఎస్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు యంత్రాంగం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అత్యవసర సేవలకు కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన 9030632608 నంబర్ కు కాల్ చేయాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా ప్రజలకు సూచనలు చేశారు



బిజినెస్ వాయిస్

# ఐటీఆర్ గడువు మళ్లీ పొడిగింపు?

## లాభాల బాటలో దేశీయ సూచీలు




గత వారం భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు ఈ వారంలో మాత్రం లాభాల జోష్‌లో సాగుతున్నాయి. జీఎస్టీలో సంస్కరణలు, భారత్‌పై ఆంక్షల విషయంలో డొనాల్డ్ ట్రంప్ కాస్తా నెమ్మదించడం, ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగింపు విషయంలో గుడ్ న్యూస్ వచ్చే అవకాశం ఉందన్న వార్తలు వస్తుండడంతో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు గత వారం భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు ఈ వారంలో మాత్రం లాభాల జోష్‌లో సాగుతున్నాయి. జీఎస్టీలో సంస్కరణలు, భారత్‌పై ఆంక్షల విషయంలో డొనాల్డ్ ట్రంప్ కాస్తా నెమ్మదించడం, ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగింపు విషయంలో గుడ్ న్యూస్ వచ్చే అవకాశం ఉందన్న వార్తలు వస్తుండడంతో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. అంతర్జాతీయంగా సానుకూలాంశాలు కూడా కలిసి రావడంతో సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా రెండో లాభాలను ఆర్జించాయి. సోమవారం ముగింపు (81, 273)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సెన్సెక్స్ రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఒక దశలో దాదాపు 500 పాయింట్లు లాభపడి 81,755 వద్ద ఇంట్రాడే గరిష్టానికి చేరుకుంది. చివరకు సెన్సెక్స్ 370 పాయింట్ల లాభంతో 81, 644 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 103 పాయింట్ల లాభంతో 24, 980 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో మదర్సన్, ఐఐఎఫ్ఎల్, పేటీఎమ్, ఎక్సైడ్ ఇండస్ట్రీస్, బంధన్ బ్యాంక్ షేర్లు లాభాలను ఆర్జించాయి. భారత్ డైనమిక్స్, కల్యాణ్ జువెల్లర్స్, సోలార్ ఇండస్ట్రీస్, క్యామ్స్, రెడ్డీస్ ల్యాబ్స్ షేర్లు నష్టాల బాటలో నడిచాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 551 పాయింట్లు లాభపడింది. బ్యాంక్ నిఫ్టీ 130 పాయింట్లు ఆర్జించింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 86.95గా ఉంది.

## భారత్‌పై టారిఫ్‌ల ప్రభావం ఉండదు



భారత దీర్ఘకాలిక వృద్ధిపై అమెరికా టారిఫ్‌ల ప్రభావం ఉండకపోవచ్చని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్, అభిప్రాయపడింది. ఆర్థిక సంస్కరణలపై ప్రభుత్వం దృష్టి పెడుతుండటం, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రయత్నిస్తుండటం ఇందుకు కారణమని విశ్లేషించింది. 'విదేశీ వాణిజ్యంపై భారత ఆర్థిక వ్యవస్థ పరిమితంగానే ఆధారపడుతోంది. జీడీపీ వృద్ధిలో ఎగుమతుల వాటా కేవలం 15 శాతమే కాగా... దేశీయ గిరాకీనే 85 శాతం వరకు ప్రభావం చూపుతోంది. అందుకే టారిఫ్‌ల ప్రభావం భారత్‌పై పెద్దగా ఉండబోద'ని ఎస్ అండ్ పీ ఆసియా పసిఫిక్ ఆర్థికవేత్త విస్తృత్ రాణా విశ్లేషించారు. అమెరికా విధించే 50 శాతం అధిక టారిఫ్‌లు భారత్ నుంచి ఎగుమతి అయ్యే అన్ని వస్తువులకూ వర్తించబోదనే విషయాన్ని ఇక్కడ గుర్తుంచుకోవాలని అన్నారు. 'భారత ఆర్థిక వ్యవస్థపై టారిఫ్‌ల ప్రభావాన్ని పరిమితం చేసేందుకు పలు అంశాలు దోహదం చేస్తాయి. స్వల్పకాలంలో కొంత ప్రభావమైతే ఉండొచ్చు. మౌలిక రంగంపై అధిక కేటాయింపులు, వ్యాపార అనుకూల పరిస్థితులు లాంటివి మధ్యకాలంలో దేశ వృద్ధి పథాన్ని నిర్దేశిస్తాయ'ని ఆయన వివరించారు. దీర్ఘకాలిక అంచనా ఆధారంగానే రేటింగ్స్‌ను నిర్ణయిస్తామని.. ఫార్మా, ఎలక్ట్రానిక్స్ లాంటి రంగాలకు మినహాయింపు ఉంటుందని విశ్లేషించారు. 'భారత్ మొత్తం ఎగుమతుల్లో అమెరికా వాటా కేవలం ఒక్క శాతమే. అందువల్ల టారిఫ్‌లు అధికంగా ఉన్నా.. భారత దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలపై ఎటువంటి ప్రభావం ఉండద'ని ఆయన వివరించారు. జీఎస్టీ విధానంలో శ్లాబుల సంఖ్యను రెండింటికి తగ్గించాలనే ప్రతిపాదన వల్ల పన్ను రేట్లు దిగివస్తాయని.. దీర్ఘకాలంలో ఆదాయాలు పెరిగేందుకు తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు.

ఆదాయపు పన్ను రిటర్నులు ఫైల్ చేసేందుకు గడువు సమీపిస్తోంది. ఇంకో 25 రోజులు మాత్రమే ఉంది. అయితే, ఇప్పటికీ కొన్ని ఎక్సెల్ యుటిలిటీలను విడుదల చేయలేదని, ఇప్పటి వరకు అందుబాటులోకి తెచ్చిన ఐటీఆర్ ఫారాలు, ఎక్సెల్ యుటిలిటీలు ఆలస్యం కావడం ట్యాక్స్ పేయర్లపై ఒత్తిడి పెంచుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మందిపు సంవత్సరం 2025-26కు సంబంధించి ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్నులు ఫైల్ చేసేందుకు ప్రభుత్వం ఐటీఆర్ గడువును పొడిగించనుందా? అంటే తప్పనిసరిగా చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ట్యాక్స్ పేయర్లు గడువు పెంచాలని కోరుతున్నారు. ఐటీఆర్ గడువు దగ్గరపడుతున్న క్రమంలో ట్యాక్స్ పేయర్లు, ట్యాక్స్ ప్రొఫెషనల్స్‌లో ఆందోళన సైతం పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గుజరాత్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సహా చాలా మంది పన్ను నిపుణులు ఐటీఆర్ ఫైలింగ్ డెడ్‌లైన్ మరోసారి పొడిగించాలని డిమాండ్ చేస్తున్నారు. సెప్టెంబర్ 15, 2025 వరకు ఉన్న గడువును పెంచాల్సిన అవసరం ఉందని నొక్కి చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ట్యాక్స్ పేయర్లు, ఛార్టర్డ్ అకౌంటెంట్లు ఇచ్చిన గడువులోపు ఐటీ రిటర్నులు ఫైల్ చేయడం అనేది సాధ్యం కాదంటున్నారు. ఈ క్రమంలోనే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ కి లేఖ రాసింది గుజరాత్ పారిశ్రామిక సంఘం జీసీసీఐ. ఐటీ రిటర్నుల గడువును మరోసారి పొడిగించాలని కోరింది. ఈసారి ట్యాక్స్ పేయర్లు, పన్ను నిపుణులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేసింది. ప్రధానంగా ఈ ఏడాది ఐటీఆర్ యుటిలిటీలు, ఫారాలను ఆలస్యంగా విడుదల చేయడమేనంటున్నారు.




ఏప్రిల్ రెండో వారంలోపు రావాల్సిన ఐటీఆర్ యుటిలిటీలు, ఫారాలను ఏప్రిల్ చివరి నాటికి కొన్నింటిని మాత్రమే రిలీజ్ చేసింది. ఇప్పటికీ చాలా ఫారాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఐటీఆర్- 5 యుటిలిటీ ఆగస్టు 8, 2025 తేదీన విడుదల చేశారు. దీంతో ఐటీఆర్ దాఖలు చేసేందుకు సిద్ధమయ్యేందుకు తక్కువ సమయం ఇచ్చినట్లయింది. ఇక సిస్టమ్ ఎర్రర్స్, లాగిన్ ఫెయిల్యూర్స్, టైమ్ ఔట్స్ వంటివి ఐటీఆర్ అప్లోడ్ చేస్తున్న సమయంలో ఎదురవుతున్న సమస్యలుగా జీసీసీఐ సూచించింది. అలాగే ట్యాక్స్ పోర్టల్‌లో ఆడిట్ రిపోర్ట్స్ సైతం ఉండడం లేదని తెలిపింది. అలాగే ఫారం 26 ఏఎస్, ఏఐఎస్, టీఐఎస్ వంటి వాటిల్లోని వివరాల్లో తేడాలు ఉండడమూ ఇబ్బందులు కలిగిస్తున్నట్లు తెలిపింది. ఆగస్టు నుంచి నవంబర్ వరకు పలు పండగలు వస్తున్నాయి. ఇది ట్యాక్స్ ప్రొఫెషనల్స్ పనిపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సెప్టెంబర్ 15లోపు ఐటీ రిటర్నుల ఫైలింగ్ పూర్తి కాదని, మరింత సమయం ఇవ్వాలని కోరుతున్నారు.

# తగ్గినా పసిడి ధరలు



ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ, పెట్టుబడిదారులు బంగారంపై పెట్టుబడులను తగ్గించడం ఇందుకు ఒక ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఇటీవలే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య జరిగిన వాణిజ్య చర్చల అనంతరం ఎలాంటి ప్రతికూల పరిణామాలు లేకపోవడం కూడా ధరల స్థిరత్వానికి దారితీసింది. ఈ పరిణామాల నేపథ్యంలో, ఆగస్టు 19, సోమవారం నాడు బంగారం ధరలు తగ్గాయి. ఈ రోజు 24 క్యారట్ల బంగారం గ్రాము ధర రూ. 44 తగ్గింది. ప్రస్తుతం ఒక గ్రాము బంగారం ధర రూ. 10,075 కాగా, 100 గ్రాముల ధర రూ. 10,07,500గా ఉంది. అలాగే, 22 క్యారట్ల బంగారం గ్రాము ధర రూ. 9,235గా, 18 క్యారట్ల బంగారం గ్రాము ధర రూ. 7,556గా నమోదైంది. వివిధ భారతీయ నగరాల్లోనూ బంగారం ధరలు దాదాపుగా ఒకే విధంగా ఉన్నాయి. హైదరాబాద్, (%ష్ట్రఎనవతీఖఘిు%) విజయవాడ, చెన్నై, ముంబై, బెంగళూరు, కోల్‌కతా వంటి నగరాల్లో 24 క్యారట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,00,750 వద్ద ఉంది. అదేవిధంగా, ఈ నగరాల్లో 22 క్యారట్ల 10 గ్రాముల ధర రూ. 92,350గా ట్రేడ్ అవుతోంది. ఢిల్లీ మరియు అహ్మదాబాద్ నగరాల్లో మాత్రం ధరలు కొద్దిగా ఎక్కువగా ఉన్నాయి. ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ. 1,00,900 కాగా, 22 క్యారట్ల ధర రూ. 92,500గా ఉంది. అహ్మదాబాద్‌లో 24 క్యారట్ల బంగారం ధర రూ. 1,00,800 మరియు 22 క్యారట్ల ధర రూ. 92,400గా నమోదైంది. రాబోయే పండుగ సీజన్ దృష్ట్యా, ఆర్థిక నిపుణులు బంగారం ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయంగా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ, పెట్టుబడిదారులు బంగారంపై పెట్టుబడులను తగ్గించడం వల్ల ధరలు తగ్గుతున్నాయి. అలాగే, అమెరికా మరియు రష్యా మధ్య జరిగిన వాణిజ్య చర్చల తర్వాత ఎలాంటి ప్రతికూల పరిస్థితులు తలెత్తకపోవడం కూడా ఒక కారణం.

## ఎయిర్టెల్ యూజర్లకు షాకింగ్ న్యూస్

ప్రముఖ టెలికాం సంస్థ ఎయిర్‌టెల్ తమ వినియోగదారులకు షాక్ ఇచ్చింది. గతంలో బాగా ప్రాచుర్యం పొందిన రూ. 249 ప్రీపెయిడ్ ప్లాన్‌ను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ఇవాళ అర్ధరాత్రి నుంచి అమల్లోకి వస్తుందని ఎయిర్‌టెల్ థాంక్స్ యాప్, వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఈ ప్లాన్ కింద వినియోగదారులకు 28 రోజుల పాటు అన్‌లిమిటెడ్ కాల్స్ మరియు రోజుకు 1+దీ డేటా లభించేది. తక్కువ డేటా అవసరం ఉన్న వినియోగదారులకు ఇది ఒక ఉత్తమ ఎంపికగా ఉండేది. ఈ నిర్ణయంతో ఎయిర్‌టెల్, ఇప్పటికే ఈ ప్లాన్‌ను రద్దు చేసిన జియో బాటలోనే పయనించినట్లు స్పష్టమవుతోంది. ఇటీవల జియో కూడా తమ వినియోగదారులకు అందిస్తున్న రూ. 249 ప్లాన్‌ను రద్దు చేసింది. ఇప్పుడు ఎయిర్‌టెల్ కూడా అదే నిర్ణయం తీసుకోవడంతో, రోజుకు 1+దీ డేటా ప్లాన్‌ల లభ్యత తగ్గిపోయింది. ఈ పరిణామం టెలికాం రంగంలో ధరలు పెరగడానికి దారితీస్తుందని నిపుణులు భావిస్తున్నారు. జియో మరియు ఎయిర్‌టెల్ తర్వాత, వొడాఫోన్ ఐడియా కూడా ఈ ప్లాన్‌ను రద్దు చేసే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి.

# ఆస్ట్రేలియా గడ్డ మీద చరిత్ర సృష్టించిన కేశవ్ మహరాజ్

ఆస్ట్రేలియాతో తొలి వన్డే సందర్భంగా సౌతాఫ్రికా బౌలర్ కేశవ్ మహరాజ్ అరుదైన మైలురాయిని చేరుకున్నాడు. ఈ మ్యాచ్‌లో మార్నస్ లబుషేన్ రూపంలో తొలి వికెట్ అందుకుని.. సౌతాఫ్రికా తరఫున 300 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. కైర్న్స్ వేదికగా మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో కేశవ్ మహరాజ్ ఐదు వికెట్లతో చెలరేగి.. ఆసీస్ బ్యాటింగ్ ఆర్డర్‌ను కుదేలు చేశాడు. లబుషేన్ (1)తో పాటు.. కామెరాన్ గ్రీన్ (3), జోష్ ఇంగ్లిస్ (5), అలెక్స్ క్యారీ (0) రూపంలో నలుగురు కీలక బ్యాటర్లను అవుట్ చేశాడు.

**సరికొత్త చరిత్ర**

ఇక ఎడంచేతి వాటం స్పిన్నర్ అయిన కేశవ్ మహరాజ్ (5/33) తన వన్డే కెరీర్‌లో ఈ మేర తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు. ఈ క్రమంలో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఆస్ట్రేలియా గడ్డ మీద ఈ ఘనత సాధించిన సౌతాఫ్రికా తొలి స్పిన్నర్‌గా కేశవ్ మహరాజ్ చరిత్రపుటల్లో తన పేరు లిఖించుకున్నాడు.

**దిగ్గజాల సరసన**

కాగా అంతకుముందు పేసర్లు మఖయా ఎంతిని (6), లుంగి ఎంగిడి (6).. లాన్స్ క్లుసేనర్, షాన్ పొలాక్, మార్కో యాన్సెన్, మోర్నీ మోర్కెల్, నిక్కీ బోజే, రిచర్డ్ స్నెల్ తదితరులు ఆస్ట్రేలియా గడ్డపై ఈ ఫీట్ నమోదు చేశారు. ఇదిలా ఉంటే.. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా టీ20 సిరీస్ కోల్పోయిన దక్షిణాఫ్రికా జట్టు వన్డే సిరీస్‌లో గెలుపు బోణీ కొట్టిన విషయం తెలిసిందే. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారం




జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు 98 పరుగుల తేడాతో గెలిచి 1%-%0తో ముందంజ వేసింది. కేశవ్ మహరాజ్ దక్షిణాఫ్రికా విజయంలో కీలకపాత్ర పోషించి.. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కించుకున్నాడు.

**ప్రతీకారం తీర్చుకున్న సౌతాఫ్రికా**

కాగా.. 2023 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్ అనంతరం కంగారూ, సఫారీ జట్ల మధ్య ఇదే తొలి వన్డే కాగా... ఆ మ్యాచ్‌లో ఓడిన దక్షిణాఫ్రికా జట్టు... ఇప్పుడు విజయంతో బదులు తీర్చుకుంది. చాంపియన్స్ ట్రోఫీలో ఈ రెండు జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షంతో రద్దయింది. ఈ క్రమంలో తాజాగా మంగళవారం నాటి మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 296 పరుగులు చేసింది. మార్క్‌రమ్ (81 బంతుల్లో 82బీ 9 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... కెప్టెన్ తెంబా బవుమా (74 బంతుల్లో 65బీ 5 ఫోర్లు), మాథ్యూ బ్రీజ్కె (56 బంతుల్లో 57బీ 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకాలు సాధించారు. రికెల్టన్ (33బీ 3 ఫోర్లు), ముల్డర్ (26 బంతుల్లో 31 నాటౌట్‌బీ 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో ట్రావిస్ హెడ్ 9 ఓవర్లు వేసి 57 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు.

**కుదేలైన ఆసీస్ బ్యాటింగ్ ఆర్డర్**

అనంతరం లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా తడబడింది. 40.5 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (96 బంతుల్లో 88బీ 10 ఫోర్లు) మినహా టాపార్డర్ విఫలమైంది. లబుషేన్ (1), కామెరూన్ గ్రీన్ (3), జోష్ ఇన్‌గ్లిస్ (5), అలెక్స్ కేరీ (0), ఆరోన్ హార్డీ (4) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. తొలి వికెట్‌కు హెడ్ (24 బంతుల్లో 27బీ 6 ఫోర్లు)తో కలిసి 60 పరుగులు జోడించిన మార్ష్... ఏడో వికెట్‌కు డ్వార్షుయ్ (52 బంతుల్లో 33బీ 3 ఫోర్లు)తో కలిసి 71 పరుగులు జోడించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కేశవ్ మహరాజ్ (5/33) మాయాజాలానికి ఆసీస్ టాపార్డర్ పెవిలియన్‌కు వరుస కట్టింది. వన్డేల్లో తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన కేశవ్ వరుసగా... లబుషేన్, గ్రీన్, ఇన్‌గ్లిస్, కేరీ, హార్డీ వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. దీంతో ఒక దశలో 60/0తో పటిష్ట స్థితిలో ఉన్న ఆసీస్ జట్టు... 29 పరుగుల వ్యవధిలో 6 వికెట్లు కోల్పోయి 89/6తో నిలిచింది. మార్ష్ పోరాడినా ఫలితం లేకపోయింది.

క్రీడా వాయిస్

## ఆసియా కప్‌లో శ్రేయాస్ అయ్యర్‌కు దక్కని చోటు.. అసంతృప్తిని వ్యక్తం చేసిన అభిషేక్ నాయర్



వచ్చే నెలలో యూఏఈ వేదికగా జరుగనున్న ఆసియా కప్ కోసం బీసీసీఐ జట్టును ప్రకటించింది. అద్భుతమైన ఫామ్‌లో ఉన్న స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌ను జట్టులో చోటు కల్పించకపోవడంపై అందరినీ ఆశ్చర్యపరిచింది. ఛాంపియన్స్ ట్రోఫీలో సత్తా చాటిన, ఐపీఎల్ 2025లో పంజాబ్ కింగ్స్‌ను ఫైనల్ వరకు నడిపించిన అయ్యర్‌కు 15 మంది సభ్యుల జట్టులోనే కాకుండా, ఐదుగురు స్టాండ్‌బై ఆటగాళ్ల జాబితాలో కూడా చోటు దక్కలేదు. దాంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే బీసీసీఐ నిర్ణయంపై టీమిండియా మాజీ అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాడు. 'శ్రేయస్ అయ్యర్ లాంటి స్టార్ ఆటగాడు కనీసం రిజర్వ్ ఆటగాళ్ల జాబితాలో కూడా ఎలా లేడో నాకు అర్థం కావడం లేదు. అతడిని 20 మందితో కూడిన జట్టులో ఎందుకు తీసుకోలేదో తెలియడం లేదు. ఈ నిర్ణయం అతనికి జట్టులో ప్రాధాన్యత ఇవ్వడం లేదు అనే స్పష్టమైన సంకేతం ఇస్తుంది' అని పేర్కొన్నాడు. సెలక్షన్ అనేది కేవలం ఆటగాడి ప్రతిభను మాత్రమే కాకుండా, కొంతమంది వ్యక్తుల ఇష్టాలకు ఆధారపడి ఉండవచ్చని నాయర్ వ్యాఖ్యానించాడు. అయితే, జట్టులో చోటు కల్పించకపోవడంపై బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ స్పందించారు. 'శ్రేయస్ తప్పేమీ లేదు. తాము కేవలం 15 మందిని మాత్రమే ఎంపిక చేయగలం. ప్రస్తుతానికి అతను తన అవకాశం కోసం ఎదురు చూడాల్సిందే' అని కామెంట్ చేశాడు. అలాగే, అభిషేక్ శర్మ బౌలింగ్ చేయగల సామర్థ్యం ఉన్న ఆటగాడు కావడంతో యశస్వి జైస్వాల్ వంటి ఆటగాడిని పక్కన పెట్టడం అనివార్యమైందని అగార్కర్ చెప్పుకొచ్చాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ 17 మ్యాచ్‌లలో 175.07 స్ట్రయిక్ రేట్‌తో 604 పరుగులు చేసి, అత్యధిక స్కోరర్ చేసిన ఆరో ప్లేయర్‌గా నిలిచాడు. ఫుల్ ఫామ్‌లో ఉన్న ఆటగాడిని కీలకమైన టోర్నమెంట్‌కు ఎంపిక చేయకపోవడంపై క్రీడా వర్గాల్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# ప్రపంచ నంబర్ వన్ బౌలర్‌గా అవతరించిన కేశవ్ మహారాజ్

ఐసీసీ ఇవాళ (ఆగస్ట్ 20) ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో ఓ ప్రధాన మార్పు చోటు చేసుకుంది. బౌలర్ల విభాగంలో సౌతాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ నంబర్ వన్ స్థానానికి ఎగబాకాడు. నిన్న ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో సంచలన ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన మహారాజ్.. రెండు స్థానాలు మెరుగుపర్చుకుని అగ్రస్థానానికి చేరాడు. ఈ క్రమంలో శ్రీలంక స్పిన్నర్ మహీశ్ తీక్షణ, టీమిండియా చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్‌ను రెండు, మూడు స్థానాలకు నెట్టాడు. టీమిండియా నుంచి కుల్దీప్‌తో పాటు రవీంద్ర జడేజా టాప్-10లో(తొమ్మిదో స్థానం) ఉన్నాడు. భారత పేస్ త్రయం షమీ, బుమ్రా, సిరాజ్ వరుసగా 13, 14, 15 స్థానాల్లో ఉన్నారు. బ్యాటర్ల విభాగంలో టీమిండియా వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నంబర్ స్థానంలో కొనసాగుతుండగా.. బాబర్ ఆజమ్, డారిల్ మిచెల్ రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. భారత్ నుంచి గిల్‌తో పాటు శ్రేయస్ అయ్యర్ (6) టాప్ 10లో ఉన్నాడు. ఈ జాబితాలో టీమిండియా దిగ్గజ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి పేర్లు కనిపించకపోవడం ఆశ్చర్యంగా ఉంది. గత వారం ర్యాంకింగ్స్‌లో రోహిత్ రెండు.. విరాట్ నాలుగు స్థానాల్లో ఉన్నారు. ఆకస్మికంగా వారి పేర్లు ర్యాంకింగ్స్ నుంచి మాయమైపోవడానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఆల్‌రౌండర్ల విభాగానికొస్తే.. ఆఫ్ఘనిస్తాన్ ఆటగాళ్లు అజ్మతుల్లా ఒమర్‌జాయ్, మొహమ్మద్ నబీ టాప్-2లో కొనసాగుతుం డగా.. భారత్ నుంచి రవీంద్ర జడేజా ఒక్కడే టాప్ 10లో (పదో స్థానం) ఉన్నాడు.




**మహారాజ్ మాయాజాలం**

మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో నిన్న జరిగిన తొలి వన్డేలో సౌతాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ అద్భుతమైన మాయాజాలాన్ని ప్రదర్శించాడు. 297 పరుగుల భారీ లక్ష్యాన్ని డిఫెండ్ చేసుకునే క్రమంలో 5 వికెట్ల ప్రదర్శనతో చెలరేగాడు. ఫలితంగా ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా ఆస్ట్రేలియాను 98 పరుగుల తేడాతో ఓడించి, సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ ప్రదర్శనతో మహారాజ్ పలు రికార్డులను కొల్లగొట్టాడు. తాజాగా ర్యాంకింగ్స్‌లో అగ్రపీఠాన్ని దక్కించుకున్నాడు.

సినీ వాయిస్ CINEMA



# ఎస్ఎస్ఎంబీ 29 కోసం ఎస్ఎస్ రాజమౌళి కొత్త ప్రయోగం.. జంగిల్ సఫారీ రైడ్ అందుకేనా..?

గ్లోబల్ స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి సినిమా అంటే విజువల్స్ ఎలా ఉంటాయో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. జక్కన్న వీఎఫ్ఎక్స్ పార్ట్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లేలా ఉంటుంది. అందుకు మగధీర, ఈగ, బాహుబలి, ఆర్ఆర్ఆర్ సినిమాలే ఉత్తమ ఉదాహరణగా చెప్పొచ్చు. అందుకే భారతీయ సినీ చరిత్రలో జక్కన్న సినిమాలు చాలా ప్రత్యేకమైనవిగా నిలిచాయి. కాగా ఇప్పుడిక ఎస్ఎస్ఎంబీ 29 సినిమాతో బిజీగా ఉన్నాడు ఎస్ఎస్ రాజమౌళి. మహేశ్ బాబు లీడ్ రోల్‌లో నటిస్తోన్న ఈ మూవీ ఆఫ్రికన్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్‌గా రాబోతుంది. భారత్‌లో కొన్ని కీలక షెడ్యూల్స్ షూట్ చేసిన జక్కన్న టీం నెక్ట్స్ షెడ్యూల్ కోసం ప్రస్తుతం నైరోబిలో ల్యాండ్ అయింది. ఇప్పటికే మూవీ హీరోయిన్ ప్రియాంకా చోప్రా ప్రైడ్ ల్యాండ్స్ (సింహాలకు ఆవాసమైన సవన్నా భూభాగం)లో సఫారీ రైడ్ చేసి హైనా, హిప్పోపొటామస్, ఆస్ట్రిచ్, ఆఫ్రికన్ బఫెలో లాంటి వాటిని కెమెరాలో బంధించి ఆ ఫొటోలను ఇన్ స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. ఇక ఈ ఫొటోలను చూసిన నెటిజన్లు, మూవీ లవర్స్ సినిమా గురించి ఆసక్తికర చర్చ తెరపైకి తెచ్చారు. ఇంతకీ విషయమేంటంటే ఈ సినిమా కోసం జక్కన్న సీజీ వర్క్‌కు బదులు కొత్త మెథడ్‌ను ఫాలో అవుతున్నాడని చర్చించుకుంటున్నారు. సినిమాలోని సన్నివేశాలను రియలిస్టిక్‌గా చూపించి అభిమానులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లేందుకు జక్కన్న టీం నైరోబీలోని జంగిల్‌లో సఫారీ రైడ్ చేస్తూ ఇలా జంతువులను షూట్ చేస్తున్నారని అంటున్నారు. సెరెంగెటి నేషనల్ పార్క్ టాంజానియాతోపాటు ఇతర లొకేషన్లలో నెక్ట్స్ షెడ్యూల్ కొనసాగనుంది. అంటే సీజీకి బదులు కెమెరాతో తీసిన రియలిస్టిక్ సీన్లను సినిమాలో చూపించనున్నాడన్నమాట. మేకర్స్ ముందుగా చెప్పినట్టుగానే ఈ చిత్రం అద్భుతమైన గ్లోబల్ యాక్షన్ అడ్వెంచరస్ డ్రామా కాబోతుందని తాజా వార్తలు మరోసారి హింట్ ఇచ్చేస్తున్నాయి. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమారన్ మరో కీలక పాత్రలో నటిస్తున్నాడు. మరి రాబోయే రోజుల్లో ఎస్ఎస్ రాజమౌళి టీం నుంచి ఏదైనా అధికారిక అప్‌డేట్ వస్తుందేమో చూడాలి.

# ప్రభాస్ ఈ రేంజ్‌కు వెళ్తాడని ఊహించలేదు

టాలీవుడ్‌లో ప్రభాస్ తొలి సినిమా ఈశ్వర్‌లో మెప్పించిన కోలీవుడ్ ముద్దుగుమ్మ శ్రీదేవి విజయ్ కుమార్. అంతకుముందే తమిళంలో చాలా చిత్రాలు చేసిన శ్రీదేవి.. రుక్మిణి మూవీతో తెలుగులో అడుగుపెట్టింది. టాలీవుడ్‌లోనూ చాలా సినిమాల్లో తనదైన నటనతో మెప్పించింది. తెలుగులో చివరిసారిగా వీర చిత్రంలో కనిపించిన శ్రీదేవి.. చాలా ఏళ్ల తర్వాత రీ ఎంట్రీ ఇస్తోంది. నారా రోహిత్ హీరోగా వస్తోన్న సుందరకాండ మూవీలో కనిపించనుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన శ్రీదేవి విజయ్ కుమార్ ప్రభాస్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. ప్రభాస్ కెరీర్‌లోనే బెస్ట్ సినిమాల్లో ఒకటని.. తొలి సినిమాతోనే మాస్ హీరోగా మెప్పించారని అన్నారు. ఆ సినిమా సమయంలోనే ప్రభాస్ స్టార్ అవుతాడని మేము అనుకున్నామని తెలిపింది. కానీ ఈ రేంజ్‌కు వెళ్తాడని ఎవరు కూడా ఊహించలేదని శ్రీదేవి వెల్లడించింది. ప్రభాస్ చాలా మంచి వ్యక్తి అని.. ఒకరికి చెడు జరగాలని అస్సలు అనుకోరని అన్నారు. ఆయనది చిన్నపిల్లాడి మనస్తత్వమని శ్రీదేవి పేర్కొంది. కాగా. సుందరకాండ చిత్రాన్ని వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. ఈ కామెడీ ఎంటర్‌టైనర్‌లో శ్రీదేవి కీలక పాత్రలో కనిపించనుంది. ఈ చిత్రంలో వృతి వాఘాని హీరోయిన్‌గా నటించారు. సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది.






# జయ్ దేవరకొండ కింగ్‌డమ్.. మాస్ సాంగ్ వచ్చేసింది!

విజయ్ దేవరకొండ హీరోగా వచ్చిన యాక్షన్ థ్రిల్లర్ కింగ్‌డమ్. గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్‌లో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ మూవీలో భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా మెప్పించింది. జూలై 31న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం నాలుగు రోజుల్లోనే రూ.80 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. తాజాగా ఈ మూవీ నుంచి సూపర్ హిట్ సాంగ్ మేకర్స్ రిలీజ్ చేశారు. రగిలే రగిలే అంటూ సాగే మాస్ సాంగ్ ఫుల్ వీడియోను విడుదల చేశారు. ఈ పాట విజయ్ ఫ్యాన్స్‌ను తెగ ఆకట్టుకుంటోంది. ఈ పాటకు అనిరుధ్ రవిచందర్ సంగీతమందించారు. కాగా.. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు.



# ట్విస్ట్‌తో ఓటీటీలోకి పవన్ కల్యాణ్ హరిహరవీరమల్లు.. ఇంతకీ ఏం మార్పులు చేశారో తెలుసా..?

టాలీవుడ్ యాక్టర్ పవన్ కల్యాణ్ టైటిల్ రోల్ పోషించిన చిత్రం హరిహరవీరమల్లు జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం రెండు పార్టులుగా తెరకెక్కుతుండగా హరిహరవీరమల్లు పార్ట్-1 జులై 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలైంది. అయితే భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద అభిమానులను నిరాశపరిచింది. సినిమాలో వచ్చే కొన్ని సన్నివేశాలపై భారీ ఎత్తున ట్రోల్స్ వెల్లువెత్తాయి. కాగా థియేటర్లలో అంతగా ఇంప్రెస్ చేయలేకపోయిన ఈ చిత్రం ఓటీటీలో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అయింది. కేవలం నాలుగు వారాల వ్యవధిలోనే ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చింది హరిహరవీరమల్లు. ఈ మూవీ ప్రస్తుతం పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. కాగా పలు మార్పులతో ఓటీటీ వెర్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు మేకర్స్. ఓటీటీ మూవీ లవర్స్ కోసం కొన్ని సన్నివేశాలను ట్రిమ్ చేశారు. వీఎఫ్ఎక్స్ హార్స్ రైడింగ్ సెకండాఫ్‌లో పవన్ కల్యాణ్ విల్లు ఎక్కుపెట్టే సన్నివేశాలపై ప్రేక్షకులు, అభిమానుల పెద్ద ఎత్తున ట్రోల్స్ వచ్చిన విషయం తెలిసిందే. తుఫాను వచ్చే సమయంలో వారి మధ్య జరిగే ఘర్షణకు సంబంధించిన సీన్లను తీసివేశారట. ఓటీటీ వెర్షన్‌లో ఈ సన్నివేశాలను పూర్తిగా తొలిగించారని ఇన్‌సైడ్ టాక్. కొత్త వెర్షన్ ప్రకారం అసుర హననం పాట తర్వాత పార్ట్ 2 అనౌన్స్‌మెంట్‌తో సినిమా ముగియనుంది. బాబీ డియోల్‌తో ఎదురుపడే సన్నివేశాలు, సైక్లోన్ ఫైట్ సహా 15 నిమిషాలు ఓటీటీ వెర్షన్‌లో తీసేశారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. ఈ కట్స్ తీసేయగా ప్రస్తుతం హరిహరవీరమల్లు ఓటీటీ రన్‌టైం 2 గంటల 33 నిమిషాలన్నమాట. మరి ఓటీటీలో ఎలాంటి ఇంప్రెషన్ కొట్టేస్తుందో చూడాలి. పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ మూవీలో ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించింది. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించాడు. ఈ మూవీని ఏఎం రత్నం సమర్పణలో మేఘ సూర్య ప్రొడక్షన్ బ్యానర్‌పై ఏ దయాకర్‌రావు నిర్మించారు.



VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com